తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 08.03.2025 | సంపుటి : 11 సంచిక : 236 | పేజీలు : 12 వెల: రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
8 మార్చి 2025
తెలంగాణ

# భారత ఎన్నికల సంఘం
# విశ్వసనీయతకు సవాళ్ళు



భారత ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతిపెద్దది. దీని శక్తి ప్రజల చేతుల్లోనే ఉంది. అయితే, ఆ శక్తిని నిజంగా ప్రజలే నియంత్రిస్తున్నారా? లేక ఒక వ్యవస్థ తరచూ అధికార పార్టీల ప్రయోజనాలను కాపాడటానికి పని చేస్తోందా? ఈ ప్రశ్న ఇప్పుడు అత్యంత ప్రాముఖ్యమైనది. గత దశాబ్ద కాలంగా భారత ఎన్నికల కమిషన్ (ఇ.సి.ఐ.) మీద నమ్మకం క్రమంగా క్షీణిస్తోంది. 1950లో స్వతంత్ర సంస్థగా ఏర్పడిన ఇ.సి.ఐ.కి, ఎన్నికల నిర్వహణ బాధ్యత ఉంది. కానీ, ఇది నిజంగా నిష్పాక్షికంగా పనిచేస్తుందా? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రజాస్వామ్య వ్యవస్థను నీరుగారుస్తుందా?

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన వెంటనే వచ్చిన మొదటి ఆరోపణ ఓట్ల లెక్కింపుపై. పోలైన ఓట్ల సంఖ్య, లెక్కించబడిన ఓట్ల సంఖ్యకు మధ్య తేడా ఉందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఒక ప్రజాస్వామ్యంలో ఓటింగ్ ప్రక్రియ పట్ల ప్రజల్లో నమ్మకం ఉండాలి. కానీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఇ.వి.ఎం.) లెక్కింపుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటరు జాబితాలో అనేక అక్రమ మార్పులు చేయడం, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు రావడం, చనిపోయిన వ్యక్తుల పేర్లను తొలగించకుండా ఉంచడం లాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నా, ఇ.సి.ఐ. స్పందన ఊరట కలిగించేలా లేదు. ఇదే సమస్య రాష్ట్రస్థాయిలోనూ కనిపిస్తోంది. మహారాష్ట్ర, ఢిల్లీ, తెలంగాణ ఎన్నికలలో ఓటర్ల జాబితా అనేక మార్పులకు గురైంది. కొన్ని నియోజకవర్గాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లు అక్రమంగా తొలగించబడ్డాయని ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో ఓటర్ల జాబితా మార్పులను ఒక పార్టీకి అనుకూలంగా చేసారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ చర్యలు, ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను ప్రశ్నార్థకంగా మార్చాయి.

ఇంకా పెద్ద సమస్య ఎన్నికల నిధుల పారదర్శకత. ఎన్నికల బాండ్ల వ్యవహారం రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బి.జె.పి.,కి కట్టుబడిన వ్యవస్థగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఈ బాండ్ల ద్వారా వేల కోట్ల రూపాయలు ఆ పార్టీకి చేరాయని, ఎవరు ఎంత విరాళం ఇచ్చారనే అంశాన్ని రహస్యంగా ఉంచడం వల్ల అవినీతికి తలుపులు తెరవబడ్డాయని సమాజ శాస్త్రవేత్తలు అంటున్నారు. 2017 నుంచి దేశవ్యాప్తంగా ఎన్నికల బాండ్ల పై అనేక పి.ఐ.ఎల్.లు (ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు) దాఖలయ్యాయి. అయితే, ఇ.సి.ఐ. ఈ వ్యవహారంపై ఎటువంటి చర్య తీసుకోవడం లేదు. బాండ్ల ద్వారా వచ్చిన నిధులు ఎన్నికల ఖర్చుల కోసం ఖర్చు చేయబడుతున్నాయా? లేక అవినీతికి దారి తీస్తున్నాయా? అనే ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు అందలేదు.

మత, కులాల పేరిట రాజకీయ నేతలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం కొత్త కాదు. అయితే, 2014 తర్వాత ఈ ప్రచారం ఉద్ధృతమైంది. ప్రధానంగా బి.జె.పి. నేతలు ఎన్నికల ప్రచారంలో మత రాజకీయం చేయడం, ఇతరులపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం పెరిగింది. అనేక సందర్భాల్లో ఇ.సి.ఐ. ప్రవర్తన దీనిపై అనుమానాలు రేకెత్తించేలా ఉంది. ఒకవేళ ప్రతిపక్ష నాయకులు ఈ తరహా వ్యాఖ్యలు చేస్తే, వారిపై వెంటనే చర్యలు తీసుకోవడం కనిపించినా, అధికార పక్ష నేతలు ఇదే పని చేస్తే, ఎన్నికల సంఘం మౌనం పాటించడం సందేహాస్పదంగా మారింది.

ప్రభుత్వ వనరుల దుర్వినియోగం మరో ప్రధాన సమస్య. ప్రభుత్వ పథకాలను అధికార పక్షం తమ ప్రచార సాధనంగా ఉపయోగించుకోవడం, అధికారిక మాధ్యమాలను ఎన్నికల ప్రచారానికి వాడుకోవడం ఎన్నికల సమానత్వానికి పెద్ద ముప్పుగా మారింది. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సమయం దగ్గరపడుతుండగానే సంక్షేమ పథకాలను ప్రకటించడం అనేక ప్రశ్నలు లేవనెత్తింది. ప్రతిపక్షాల నుండి వచ్చిన ఫిర్యాదులను ఇ.సి.ఐ. పట్టించుకోకపోవడంతో న్యాయస్థానాల గడప తొక్కేలాట చేసింది.

దొంగ ఓట్లు, బోగస్ ఓటింగ్ లాంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. చనిపోయిన వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండటం, ఒకే వ్యక్తికి రెండు రాష్ట్రాల్లో ఓటింగ్ హక్కు రావడం, ఫార్జరీ పద్ధతుల్లో ఓటింగ్ జరగడం ఎన్నికల నిష్పక్షపాత్యతను దెబ్బతీసే అంశాలు. ఇటీవలే, టి.ఎం.సి. పార్టీ జరిపిన విలేకరుల సమావేశంలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఓటర్లకు ఒకే ఇ.పి.ఐ.సి. నంబర్ ఇచ్చిన ఘటన వెలుగులోకి వచ్చింది. దీని వల్ల డూప్లికేట్ ఓటింగ్ జరిగే అవకాశాలు పెరుగుతాయి.

వన్నీ చూస్తే, ఎన్నికల కమిషన్ పూర్తిగా నిష్పాక్షికంగా పనిచేస్తోందనే నమ్మకాన్ని ప్రజలు కోల్పోతున్నారని స్పష్టమవుతోంది. నిజానికి, ఇ.సి.ఐ. స్వతంత్రంగా వ్యవహరించాలంటే, అది ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చెందాలి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం దీనిని నియంత్రించడం వల్ల, ఎన్నికల కమిషన్ ఒక స్వతంత్ర సంస్థ అనే అభిప్రాయం నశిస్తోంది. ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన అభ్యర్థులపై కఠిన చర్యలు తీసుకోవాలంటే, ఇ.సి.ఐ.కి మరింత అధికారాన్ని ఇవ్వాలి.

ఇంకా ఒక ముఖ్యమైన అంశం, ఎన్నికల వ్యాజ్యాలు. ఒక అభ్యర్థి నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే, దానిపై విచారణ జరిపి తక్షణమే నిర్ణయం తీసుకోవాలి. అయితే, ప్రస్తుతం ఎన్నికల కేసులు ఏళ్ల తరబడి కోర్టుల్లో నడుస్తూ ఉంటాయి. 2019లో ఎన్నికైన కొన్ని అసెంబ్లీ, లోక్‌సభ సభ్యులపై కేసులు ఇప్పటికీ పెండింగులో ఉన్నాయి. దీని వల్ల, నేరస్థులు కూడా ఎన్నికల్లో గెలిచి పదవుల్లో కొనసాగుతున్నారు. దీన్ని నియంత్రించాలంటే, ప్రత్యేకంగా ఎన్నికల కేసుల పరిష్కారానికి ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలి.

ఈ సమస్యలన్నింటిని పరిష్కరించకుండా, భారత ప్రజాస్వామ్యం నిజమైన ప్రజాస్వామ్యంగా కొనసాగలేను. ఓటింగ్ ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే, ఎన్నికల కమిషన్ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాలి. అధికార పక్షానికి మద్దతు ఇచ్చే విధంగా కాకుండా, ప్రజాస్వామ్య సమర్థతను పరిరక్షించే విధంగా పనిచేయాలి. లేదంటే, ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి సేవలు చేసే ఓ శాఖగానే మిగిలిపోతుంది. అప్పుడు ప్రజాస్వామ్యం అనే పదానికి అర్థమే ఉండదు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# మహిళలకు అండగా
## సృష్టికి మూలం స్త్రీ
# దేవతలు తోడుగా!



యత్ర నార్యంతు పూజ్యతే...
రమంతే తత్ర దేవతాః

ఎక్కడ మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని శ్లోకాలు చెబుతున్నాయి, అంటే మహిళల కోసం దేవతలే తోడుగా నిలుస్తారని భావించవచ్చు.! ఈ లెక్కన ప్రతి ఇంట్లోని "స్త్రీ" కు గౌరవం లభించినట్లైతే ప్రతి ఇళ్ళు దేవతల నిలయంగా మారవచ్చు.! అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఈరోజు ప్రపంచమంతా పూజింపబడుతున్న "స్త్రీ" కు ఈ ఒక్కరోజే కాదు జీవితాంతం పూజించినా కూడా తక్కువే.!

ఈ సృష్టికే మూలంగా పరిగణించబడే స్త్రీలు తను లేనిదే సృష్టి శూన్య మన్నట్లు అన్నింటిలో తనదైన ముద్రను వేసుకుంటూ అంచెలంచెలు గా ఎదుగుతూ మగువలు ఏ విషయంలోను మగవారికి తక్కువ కాదన్న ట్లు సమానంగా పోటీపడుతూ దూసుకెళుతున్న నేటి యుగంలోని స్త్రీలకు సెల్యూట్ కొట్టక తప్పదు, ఒకప్పుడు అన్నింట్లో వివక్షకు గురవుతున్న స్త్రీలు ఆనాడు 1914 లో జపాన్ దేశంలో మొదటి సారి వందమందితో మొదలైన సమావేశం గృహ హింసకు వ్యతిరేకంగా, సమాన హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం గళం విప్పిన మహిళలు అనేక సమావేశాల అనంతరం మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటూ ఈనాడు ప్రపంచ వ్యాప్త ఆదరణతో ప్రతీది తనవైపు తిప్పుకోవడంలో వారి కృషి ఎనలేనిది, నాడు నాలుగు గోడల మద్యే నలిగిన స్త్రీ నేడు నలుదిశల్లోనే కాదు గగనతలంలో కూడా దూసుకుపోతుంది, మగవారిది ఒకటే పాత్ర అయితే, రెండు పాత్రలతో తమ బాధ్యతలను రెట్టింపుగా మోస్తుంది కేవలం స్త్రీ మాత్రమే.! అందుకే స్త్రీ జన్మ అపురూపంగా చెప్పబడ్డది, కార్యేశుదాసి, కరణేషు మంత్రి, బోజ్యేసు మాత, శయణేషు రంభ గా కీర్తించబడ్డది, ఒక బిడ్డగా, చెల్లిగా, అక్కగా, భార్యగా, తల్లిగా, ఇంటికి దీపంగా, లక్ష్మీ దేవిగా కొలిచే స్త్రీ మగవానిలో సగభాగమై అన్ని తానై నడిపించే గృహ సారధి మహిళ మాత్రమే, నాడు కేవలం గృహానికే పరిమితమైన స్త్రీ నేడు అన్ని రంగాల్లో రాకెట్ స్పీడ్ లాగా మహిళా సాధికారత దిశగా దూసుకుపోతు న్నారని చెప్పవచ్చు, టీచర్లు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే కాకుండ ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్, న్యాయమూర్తులుగా, శాస్త్రవేత్తలుగా ఉన్నతమైన పదవుల్లో, అన్ని రంగాల్లో పురుషులకు సమానంగా ఎదుగుతున్నారు, చట్టసభల్లో ఎం.ఎల్.ఏ.లుగా పార్లమెంట్ సభ్యులుగా సాధారణ కుటుంబాల నుండి వచ్చిన వారెందరో మహిళలున్నారు, ఇప్పుడున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ సాధరణ కుటుంబం నుండి దేశ ప్రథమ పౌరురాలుగా అత్యున్నత పదవిని తన కృషితో సాధించారు,ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది మహిళలు వారి కృషితో మన దేశానికి వన్నె తెచ్చారు, ఇందిరా గాంధి, సరోజిని నాయుడు, ఝాన్సిలక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే, కల్పనా చావ్లా, మథర్ తెరిస్సా, సుచేత కృపాలని,అరుణా అసఫ్ అలీ, మేరీకోం, కిరణ్ బేడీ, లతా మంగేష్కర్ ఇలా అన్ని రంగాల్లో రానించిన ఎందరో స్త్రీ మూర్తులున్నారు, వీరి స్ఫూర్తితో నేటి యుగంలో నవ చైతన్యం పుట్టుకస్తూ అన్నింట్లో ముందుంటున్నారు, పి.వి. సింధూ, మనూభాకర్, సాక్షి మాలిక్, కరణం మల్లేశ్వరీ, సైనా నెహ్వాల్, సానియ మిర్జా, నిఖత్ జరీన్ లాంటి యువతులు భారత దేశం తరపున ఒలింపిక్స్, తదితర జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పథకాలు గెలిచి దేశం పేరుని నిలబెట్టగలిగారు, మహిళల హాకీ జట్టు, మహిళల క్రికెట్, మహిళా కబడ్డీ కాకుండా బాక్సింగ్ లో, వెయిట్ లిఫ్టింగ్‌లాంటి ఆటల్లో సైతం పురుషులకు తక్కువేం కాదంటున్నారు, ఒకప్పుడు అమ్మాయిలు రెండు చక్రాల బండి నడిపితేనే విచిత్రంగా చూసే జనాలకు నేటి కాలంలో రైలు నడిపే పైలెట్ గా, విమాన పైలెట్ గా రెక్కలు తొడిగిన పక్షిలా ఆకాశమే హద్దుగ విహరిస్తూ దేశ దేశాలు దాటుతున్నారు, ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహిస్తున్నారు, ఉత్తరప్రదేశ్ లో అరునిమ సింహ అనే యువతి రైలు దొంగల దాడి దుర్ఘటనలో ఒక కాలుని కోల్పోయి, చివరకు కృత్రిమ కాలుతో ఎవరెస్ట్ ను అధిరోహించిన ఉదహరణ ఎంతో మంది యువతులకు స్ఫూర్తిగా నిలిచిపోతుంది, ఇలా చదువుల్లో, ఆటల్లో, ఉద్యోగాలలో, వ్యాపారాల్లో రాజకీయాల్లో అన్ని రంగాలలో రానిస్తూ మహిళా సాధికారత దిశగా నడుస్తూ తన కాళ్ళపై తను నిలబడుతూ స్వావలంబన సాధిస్తున్న వీర వనితల విజయాలను ఎంత చెప్పిన తక్కువే, మన రాష్ట్ర రాజకీయాల్లో సంచనాలు సృష్టించి గెలిచిన చిన్న వయస్సు యువతులు యశస్వినీ, లాస్య నందిని, కడియం కావ్య లాంటి వారు పురుష నాయకులను ఓడించి చట్ట సభల్లో అడుగుపెట్టిన వారెందరో వచ్చే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు, ఇలా మహిళలు గృహానికే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధిలో తమదైన పాత్రతో పాలుపంచుకుంటున్నారు, బయట అన్ని రంగాల్లో ఉన్న స్త్రీలు అటు తమ వృత్తి బాధ్యతల్లో ఉండి కూడా ఇటు ఇంటి బాధ్యతల్లో రెండవ పాత్రను పోషిస్తూ భర్తకు భార్యగా, పిల్లలకు తల్లిగా సెలవు లేని సేవ చేస్తున్న త్యాగ మూర్తులకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియచేయాల్సిందే, అయినా కూడా మగవారి దౌర్జన్యాలకు, వరకట్న సమస్యలకు, అత్తారింటి వేధింపులకు, అధికారుల వేధింపులకు గురవుతూ ఎవరికీ చెప్పుకోలేక జీవితం సాగదీస్తున్న స్త్రీలు, సహనం, ఓపిక వారికే సొంతం.! మహిళలు మరింత అభివృద్ధి చెందాలంటే బాలిక విద్యను పటిష్ట పరిచి ముందు నుండే సమస్యల పరిష్కార మార్గాలను చూపి చైతన్య పర్చడానికి విద్యావంతులైన మహిళలే ముందుండాలి, స్త్రీల బాధలను అర్ధం చేసుకొని వారిని గౌరవించే విధంగా చట్టాలను మరింత రూపొందించాలి, అన్నిటికంటే మించి ప్రతి కుటుంబంలోని పురుషులైన తమ్ముడు, అన్నా, తండ్రి, భర్త మరియు సమాజంలోని పురుషులు స్త్రీని దేవతగా భావించిన నాడే మహిళలు వాస్తవంగా అభివృద్ధి చెందుతారని చెప్పవచ్చు.! అందుకే మహిళా ఉద్యోగులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రకాల కార్యక్రమాలతో స్త్రీలను గౌరవిస్తున్న రాష్ట్ర అధికారిక గుర్తింపు కలిగిన సంఘం-(TGO) తెలంగాణ గెజిటెడ్ అధికార్ల సంఘం చేస్తున్న కృషి, సేవలు గుర్తింపునిస్తున్నాయి.

వ్యాసకర్త
సయ్యద్ జబీ (లెక్చరర్)
సెక్రటరీ(సిరిసిల్లా జిల్లా)
9949303079

# రాజకీయాలు అన్నీ ఎన్నికల కోసమే!

ప్రస్తుతం దేశంలో రాజకీయాలు అన్నీ ఎన్నికల కోసమే! అనే పరిస్థితి ఏర్పడింది! ఎన్నికల్లో పోటీ చేయడం, గెలువడం అయితేనే ఆ పార్టీకి విలువలు ఉన్నట్లు, లేకుంటే ఆ పార్టీ పని అయిపోయినట్లే అనే పరిస్థితి ఉన్నది.తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు అదే దిశన పయనిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రావడంతో రాజకీయ వేడి రాజుకుంటున్నదట!. ఉత్తర తెలంగాణలో పట్టభద్రుల నియోజకవర్గం తో పాటు టీచర్ల నియోజకవర్గంలో రెండు స్థానాలు బిజెపి కైవసం చేసుకోవడం తో బిజెపిలో నూతన ఉత్సాహం నెలకొన్నది.రాష్ట్ర ప్రభుత్వం పాలన పట్ల ఓటర్ల తీర్పుగా బిజెపి చెప్పుకుంటున్నది.

**అభ్యర్థి ఎంపిక సరిగా లేకే లాస్**

నిజానికి కాంగ్రెస్ పార్టీ ఓటమికి కేవలం అభ్యర్థుల ఎంపిక విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే అనడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మొదటి నుంచి కూడా పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థి ఎంపిక పట్ల పట్టభద్రుల లో, అటు కాంగ్రెస్ సీనియర్ కార్యకర్తల్లో అసంతృప్తి ఉంది. దీనికి తోడు బీసీ వాదం కొనసాగు తున్న నేపథ్యం లో ఒక అగ్రకులానికి చెందిన అభ్యర్థిని, అందులో కార్పొరేట్ విద్యా సంస్థల అధినేత ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేయడం, లాంటి వి కూడా కాంగ్రెస్ కు అననుకూల పరిస్థితులకు కారణం అయ్యింది. ఈ విషయం తెలిసిందే అయినా బయటకు ఎవరూ చెప్పలేకుండ ఉన్నారు.బిఎస్పీ అభ్యర్థి బీసీ కావడం , చాలా కాలంగా అతను ప్రజల్లో ఉండడం వల్ల, అయన కూడా మంచి ఓట్లు సాధించాడు. బీజేపీ అభ్యర్థి విజయం రెండవ ప్రాధాన్యత ఓటుతో నే సాధ్యం అయ్యింది.

**రెండు ఎమ్మెల్సీ సీట్ల గెలుపుతో.**

బీజేపీ రెండు ఎమ్మెల్సీ సీట్లు గెలువగానే తెలంగాణ లో ఇక తాము అధికారం లోకి వచ్చినట్లే అంటూ హంగామా చేసేస్తున్నారు. ఆ పార్టీ కింది స్థాయి నుంచి పైదాకా నాయకులు సంతోషంగా ఉన్నారు.ఇంత తొందర అయితే ఎట్లా? తెలంగాణ లో మాత్రమే కాదు!సౌత్ ఇండియా లోని ఏ రాష్ట్రం లోనూ బీజేపీ కి అధికారం అంతా ఈజీ కాదు! బీజేపీ కిఎన్నికల్లో మరో అనుకూల మైన పరిస్థితి ఏమంటే, బిఆర్ఎస్ తమ అభ్యర్థిని పోటీలో పెట్టక పోవడం కూడా కలిసి వచ్చింది. బిజెపి పంచన చేరే పరిస్థితి చాలా కాలంగా బిఆర్ఎస్ లో కనిపిస్తున్నది. రాష్ట్రం లో బిఆర్ఎస్ కు ఒంటరిగా పోటీ చేసే పరిస్థితి ప్రస్తుతానికి లేదు! భవిష్యత్తు లో పార్టీ బలపడితే తప్ప ఇప్పుడు ఏకేకిన ఒంటరి బలం పుంజుకోవడం, కష్టమే!కాంగ్రెస్ ను ఓడించడం కోసమే బీజేపీ కి బిఆర్ఎస్ మద్దతు ఇచ్చింది అంటూ కాంగ్రెస్ నేతలు, మంత్రులు ఇప్పటికే స్టేట్మెంట్ లు ఇస్తున్నారు. బీజేపీ నేతలు ఖండిస్తున్నారు. బీజేపీలో రెండు ఎమ్మెల్సీ ల గెలుపు జషన్ జోరుగా కొనసాగుతున్నది.

**మిత్రులకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ సీటు ఇస్తుందా.**

మరో వైపు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా, తన మిత్రపక్షం అయిన సీపీఐ కి ఒక ఎమ్మెల్సీ సీటు ను ఇప్పుడు జరుగనున్న ఎమ్మెల్యే ల కోట లో ఇవ్వాలని పట్టుబడుతున్నది. అయితే సీపీఐ కి ఇచ్చే పరిస్థితి ఉంది అంటున్నారు. సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కి ఈ పదవి దక్కే అకాశాలు ఉన్నాయి. అటు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వం లోని టీజేఎస్ కు కూడా ఒక ఎమ్మెల్సీ స్థానం అడుగుతున్నారు. ఒక వైపు కాంగ్రెస్ పార్టీ ని దురుస్తు చేసే పనిలో ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ బిజిగా ఉన్నారు. రాష్ట్రం లో మొత్తంగా పరిస్థితి హాట్ హాట్ గా ఉంది.

**అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వస్తారా.**

అసెంబ్లీ సమావేశాలకు, మాజీ సిఎం బిఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తున్నారు, అంటున్నారు. దీనికి బిఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం చూపిస్తున్నారు. అయితే ఆయన వస్తె కొంత బిఆర్ఎస్ కే మంచిది! ప్రజల సమస్యల మీద అయన ఫోకస్ పెట్టినట్లు ఉంటుంది, భవిష్యత్తుకు దిశానిర్దేశం అవుతుంది, అంటున్నారు. మరో వైపు మజ్లిస్ కూడా ఎమ్మెల్సీ పదవి కోసం పోటీ పడుతున్నది. కాంగ్రెస్ మద్దతు తో పాటు ఇటు బిఆర్ఎస్ మద్దతు మజ్లిస్ కోరే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ లో అంతర్గత లొల్లి ఉండనే ఉంటుంది కదా?

**రిజర్వేషన్‌ల పెంపు.**

కుల గణన చేసిన ప్రకారం బీసీ రిజ్వేషన్ల పెంపు,ఎస్సీ వర్గీకరణ తదితరము ల పై నిర్ణయాలు తీసుకుంటున్నారు. బిఆర్ఎస్ , బీజేపీ లు కాంగ్రెస్ పార్టీనీ, ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డినీ ఇరకాటం లో పెట్టాలని చూస్తున్న పరిస్థితులు, మొత్తంగా రాష్ట్రం అంతా రాజకీయం వేడెక్కింద నే భావన కలిగించే విధంగా మీడియా ప్రచారం, డిబేట్లు మొదలు అయిపోయాయి! కాంగ్రెస్ పని అయిపోయింది, అనే వారు ఉన్నారు.బీజేపీ ది ఇక హవా షురూ అనేవారు ఉన్నారు! ఇదే మరి లేని గాలి నీ సినిమాల షూటింగ్ సమయాల్లో పెద్ద పెద్ద ఫంఖాలు పెట్టినట్లు పెట్టీ సృష్టించడమే.....అనక తప్పదు!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223.

# జిహాద్ అంటే పవిత్ర యుద్ధమా?

సత్యం చెప్పులు తొడుక్కునేలోపు అసత్యం భూప్రదక్షిణం చేసి వస్తుందనేది నానుడి.నేటి ఆధునిక ప్రపంచంలో అత్యంత వక్రీకరణకు, అపార్థాలకు గురైన పదం జిహాద్.చాలామంది జిహాద్ అంటే పవిత్ర యుద్ధం అని భావిస్తుంటారు.ఈ అర్థాన్ని యూరప్ సామ్రాజ్య వాదం ముస్లింలను హింసావాదులుగా, ఇస్లాంను రక్తపాతం సృష్టించే మతంగా ప్రచారం చేయడం అనే లక్ష్యంతో కొనసాగిస్తుంది. దేశీయంగా ఉన్న మతతత్వ శక్తులు కూడా ఇవే ఉద్దేశంతో గోబెల్స్ ప్రచారం చేస్తుంటాయి.

నిజానికి జిహాద్ అనే పదం 'జహద్'అనే పదం నుండి వచ్చింది.అరబ్బీ నిఘంటువు ప్రకారం దీని అసలు అర్థం శ్రమించడం లేదా కృషి చేయడం అని వస్తుంది.దీనిలో అంతర్గత జిహాద్, బహిర్గత జిహాద్ అని రెండు రకాలున్నాయి.ఇందులో అంతర్గత జిహాద్దే ఉన్నత స్థానం.ఇదొక మేధకు సంబంధించిన ఆధ్యాత్మిక, నైతిక,భౌతికపరమైన ఓ ప్రయత్నం.మనిషి తన మనసులోని మాలిన్యానికి,చెడు ఆలోచనలకు వ్యతిరేకంగా తనను తాను సంస్కరించుకోవడానికి చేసే నిరంతర కృషి.మానవుడు తన మనోవాక్కాయ కర్మలను పరిశుద్ధ పర్చుకుంటూ సత్యాన్ని స్థాపించడ మే దీని పరమోద్దేశ్యం.ఇక బహిర్గత జిహాద్ అంటే మనిషి అన్యాయానికీ, పీడనకు వ్యతిరేకంగా ఆత్మరక్షణ కోసం ప్రతిఘటిం చడం .అయితే ఈ పదాన్ని దుర్వినియోగం చేయడంలో పాకిస్తాన్ ఐయస్ఐ దుష్ట పాత్ర నిర్వివాదాంశం..పవిత్ర యుద్ధం పేరుతో ఐసిస్ వంటి ఉగ్రవాదాలు సాగిస్తున్నదంతా ఇస్లాంకు వ్యతిరేకమే. అరబ్బు ప్రపంచంలోని ఆయిల్ వనరుల కోసం అమెరికన్ సామ్రా జ్యవాదం, ఇజ్రాయిలీ జియోనిజం సృష్టించిన వాటి ముద్దుబిడ్డే ఐసిస్.తమ దోపిడీకి ఎదురుతిరిగిన పాలకుల్ని మట్టుబెట్టడం కోసం,తామే సృష్టించుకున్న శత్రువుతో యుద్ధం చేసే సాకుతో ఆ ప్రాంతంలో తిష్టవేయడం,వనరులు దోచుకోవడం వంటి కుట్రల న్నాయి. ఇస్లామిక్ జిహాద్ పేరుతో ఐసిస్, ఐయస్ఐ వంటి సంస్థలు సాగిస్తు న్న మారణకాండ, బాంబులు పెట్టడం,అమాయకుల్ని చంపడం పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలకే వ్యతిరేకం.

"అన్యాయంగా ఏ వ్యక్తి ఏ వ్యక్తిని హత్య చేసినా అతను సమస్త మానవ జాతిని హత్య చేసినట్లే.ఏ వ్యక్తి ఏ వ్యక్తిని రక్షించినా అతను సమస్త మానవ జాతిని రక్షించినట్లే

"-పవిత్ర ఖుర్‌ఆన్

"ఇతరుల ధనం,ప్రాణాలకు నష్టాన్ని కలిగించేవాడు నిజమైన దైవ విశ్వాసి కాజాలడు" -దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. నిజమైన ముస్లిం పకృతి అంత ఉన్నతంగా జీవించాలి. పకృతి కులమతాల వ్యత్యాసాలు లేకుండా ఎలా సమస్త మానవాళిని సమంగా ఆదరిస్తుందో అలా జీవించాలి.మానవులంతా పరస్పరం సహోదరులేనని పవిత్ర ఖుర్‌ఆన్ చెప్తోంది. కజిహాద్ అంటే వ్యక్తిగతంగా,సమాజపరంగా గుణాత్మకమైన మార్పును తీసుకురావడం,సాటి మానవుల్ని ప్రేమించడం,పగ,ప్రకోపాలకు దూరంగా ఉండటమే.విద్య కోసం కృషిసల్పడం,చివరికి మొక్కకు నీరు పోయడం కూడా జిహాదే.జిహాద్ అంటే పవిత్ర యుద్ధం కాదు పవిత్ర జీవనం అని మనం చాటి చెప్పాలి.

- కవి కరీముల్లా

# తెలంగాణలో మహిళా విద్య-సమస్యలు, అవకాశాలు



విద్య అనేది అభివృద్ధికి పునాది అని ఎప్పుడూ చెప్పబడుతూనే ఉంది. కానీ, భారతదేశంలో లక్షలాది మంది మహిళలకు ఇది ఇప్పటికీ నెరవేరని వాగ్దానంగా మిగిలిపోయింది. మహిళల అక్షరాస్యత పెరుగుదలలో దేశం పురోగమించినా, సామాజిక, ఆర్థిక, సంస్థాగత అడ్డంకులు వారి విద్యను పూర్తిగా సాధ్య పడనీయక పోతున్నాయి. వేగంగా అభివృద్ధి చెందాలనుకుంటున్న తెలంగాణ రాష్ట్రం ఈ విషయంలో విస్మయకరమైన స్థితిని ఎదుర్కొంటోంది. ప్రభుత్వం మహిళా విద్యను ప్రోత్సహించేందుకు నినాదాలు చేస్తుండగా, డేటా మాత్రం విద్య, ప్రవేశం, నాణ్యత విషయంలో స్త్రీలకు ఉన్న అంతరాలను స్పష్టంగా చూపుతోంది.

తెలంగాణలో మహిళా అక్షరాస్యత రేటు 66.6 శాతంగా ఉంది (జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే - ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 ప్రకారం), ఇది జాతీయ సగటు 70.3శాతం కంటే తక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉండి, మహిళా అక్షరాస్యత 60శాతం కంటే తక్కువగా ఉంది. ప్రభుత్వం 'కల్యాణ లక్ష్మి', 'అమ్మ ఒడి', బాలికల కోసం ప్రత్యేక విద్యా ప్రోత్సాహకాలు వంటి పథకాలను అమలు చేసినా, మహిళల మాధ్యమిక, ఉన్నత విద్యలో వెలితి కొనసాగుతోంది. యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్ఈ) నివేదిక ప్రకారం చూసినా రాష్ట్రంలో 28శాతం బాలికలు 10వ తరగతి పూర్తయ్యే లోపు చదువు మానేస్తున్నారు. 12వ తరగతి తర్వాత ఈ సంఖ్య మరింత పెరుగుతోంది. ప్రధాన కారణాలుగా సామాజిక ఒత్తిళ్లు, ఆర్థిక సమస్యలు, తొందరపాటు పెళ్లిళ్లు కనిపిస్తున్నాయి.

తెలంగాణలో మహిళా విద్యకు ప్రధాన అడ్డంకిగా చిన్న వయస్సులో వివాహాల వ్యవస్థ కొనసాగుతూనే ఉంది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 ప్రకారం, రాష్ట్రంలో 23.5శాతం మంది మహిళలు 18 సంవత్సరాల లోపు పెళ్లి చేసుకుంటున్నారు, ఇది జాతీయ సగటు 23.3 శాతం కంటే ఎక్కువ. పితృస్వామ్య సంప్రదాయాలు ఈ పరిస్థి తిని కొనసాగించడమే కాకుండా, బాలికల భవిష్యత్తు కోసం విద్యకు బదులుగా పెళ్లిని ఎక్కువ మంది తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతేగాక, పెళ్లయిన మహిళలు ఇంటి పనుల బాధ్యతలు, కుటుంబ ఆశలు మధ్య ఉన్నత విద్యను కొనసాగించ లేక పోతున్నారు.

ఆర్థిక పరమైన పరిమితులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ప్రభుత్వం ప్రాథమిక విద్యను ఉచితంగా అందించినా, రవాణా, యూనిఫార్మ్‌లు, కోచింగ్ ఫీజులు, ఆన్‌లైన్ విద్య కోసం అవసరమైన సదుపాయాలు వంటి అదనపు ఖర్చులు తక్కువ ఆదాయ గల కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. కోవిడ్-19 సమయంలో ఈ అసమానత మరింత స్పష్టమైంది. పట్టణ బాలికలకు ఆన్‌లైన్ విద్యకు కొంత సదుపాయం ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో ఇది దాదాపుగా అందుబాటులో లేకపోయింది. ఏఎస్ఇఆర్-2022 నివేదిక ప్రకారం, గ్రామీణ తెలంగాణలో 36శాతం బాలికలకు ఆన్‌లైన్ విద్యను పొందే అవకాశం లేకపోయింది. ఫలితంగా, విద్యలో తీవ్రమైన లోటు ఏర్పడింది.

రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, ఎక్కువగా తక్కువ సామర్థ్యం గల విద్యార్థినులే చేరే విద్యాసంస్థలు, మరింత ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఉపాధ్యాయుల కొరత, కనీసంగా వసతులు లేని పాఠశాల భవనాలు, మరుగుదొడ్ల కొరత, బాలికల భద్రతపై విపరీతమైన నిర్లక్ష్యం ...ఈ సమస్యలను పెంచుతున్నాయి. తెలంగాణ సోషల్ డెవలప్‌మెంట్ రిపోర్ట్ ప్రకారం, రాష్ట్రంలోని 32శాతం ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల కోసం ప్రత్యేక, శుభ్రంగా నిర్వహించే మరుగుదొడ్లు లేవు. దీనివల్ల బాలికల హాజరు ప్రభావితమవుతోంది, ముఖ్యంగా వయోధర్మం సమయంలో. ఈ సమస్యలన్నీ బాలికలను చదువు మానేయించేలా చేస్తున్నాయి.

తెలంగాణలో ఉన్నత విద్యలో మహిళల స్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. రాష్ట్రంలో ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) ఎక్కువగా ఉన్నప్పటికీ, మహిళలకు ఇది సమానంగా లేనిది. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్హీఈ)-2021-22 నివేదిక ప్రకారం, తెలంగాణలో ఉన్నత విద్యలో నమోదైన విద్యార్థులలో మహిళలు కేవలం 47శాతం మాత్రమే. ముఖ్యంగా ఎస్‌టీఈఎం (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మాత్మాటిక్స్) విభాగాల్లో మహిళల నమోదు 30శాతం కన్నా తక్కువగా ఉంది. రవాణా సౌకర్యాల లేకపోవడం, హాస్టల్ సౌకర్యాల కొరత, ఆర్థిక సాయం లేని పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్యను మరింత అసాధ్యంగా మార్చింది.

తెలంగాణలో విద్య పూర్తి చేసుకున్న మహిళల ఉపాధి అవకాశాల పరిస్థితి మరింత దిగజారింది. ఉన్నత విద్య పూర్తి చేసినప్పటికీ మహిళల వృత్తి ప్రవేశం చాలా తక్కువగా ఉంది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్)-2022 ప్రకారం, రాష్ట్రంలోని మహిళా కార్మిక పాల్గొనిక రేటు కేవలం 23.5శాతం, ఇది పురుషుల 73శాతం కంటే తక్కువ. అంటే, మహిళలు డిగ్రీలు పొందినప్పటికీ వాటిని ఆర్థిక స్వాతంత్ర్యంగా మార్చుకోవడం కష్టంగా మారింది. ఉద్యోగ అవకాశాల లేమి, కుటుంబ అడ్డంకులు, కార్యాలయాల్లో లింగ వివక్ష వంటి అంశాలు దీనికి కారణంగా కనిపిస్తున్నాయి.

ఈ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వ, సామాజిక సహకారంతో బహుముఖ చర్యలు అవసరం. బాల్య వివాహాల నిరోధన కోసం చట్టాలను కఠినంగా అమలు చేయాలి. బాలికల విద్యను కొనసాగించేందుకు మెరుగైన పథకాలు, స్కాలర్షిప్‌లు అందించాలి. కేవలం పాఠశాల విద్యనే కాకుండా, ఉన్నత విద్య, ముఖ్యంగా వృత్తి విద్యలో మహిళల ప్రోత్సాహానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలి. డిజిటల్ లెర్నింగ్, విద్యా గ్యారంటీ స్కీములు, రెసిడెన్షియల్ స్కూల్స్ వంటి ప్రయత్నాలు గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచవచ్చు.

ఈ పరిస్థితిలో తెలంగాణలో కొన్ని ప్రగతిశీల మార్పులు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మహిళ విద్యా కేంద్రాలు ప్రారంభించి మహిళల నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహిస్తోంది. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, వ్యవసాయ శిక్షణా కేంద్రాలు, మహిళా స్వయం సహాయక గ్రూపులు విద్యార్థినులలో ఆర్థిక స్వాతంత్ర్యానికి మార్గం చూపుతున్నాయి.

కానీ, ఇది సరిపోదు. మహిళా విద్యను ప్రోత్సహించకపోతే సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు. సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళల విద్య ఆ దిశగా తొలి మెట్టు కావాలి.

దండెబోయిన అశోక్ యాదవ్,
గెజిటెడ్ హెడ్మాస్టర్, పెద్దమదూర్,జనగాం.
9440521990




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం
08.03.2025


ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణలో 21 మంది

## ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీలు, ఇద్దరు డీఐజీలు,

మిగతా 4లో..



## కళ్లెదుట జలదోపిడీ జరుగుతున్నా స్పందించరా..?

హరీశ్‌రావు

హైదరాబాద్(జనంసాక్షి): కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం తీసుకెళ్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లుండి చూడలేకపోతున్నారని, ఇలాంటి మొద్దునిద్ర సీఎంను నేనెప్పుడూ చూడలేదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు.

మిగతా 4లో..

# నేడు స్త్రీశక్తికి శ్రీకారం

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఇందిరా మహిళాశక్తి మిషన్



- మహిళల ఆర్థిక స్వేచ్ఛ, ఉపాధి కల్పన, సంపద సృష్టిపై సర్కారు దృష్టి
- 31 జిల్లాల్లో మహిళలకు పెట్రోల్ బంకులు అప్పగించేందుకు ఒప్పందం
- మహిళా సంఘాల కోసం తొలి విడతలో 50 ఆర్టీసీ అద్దె బస్సులు
- 14వేల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకానికి నోటిఫికేషన్
- పరేడ్ గ్రౌండ్‌లో పథకాలు ప్రారంభించనున్న చేయనున్న సీఎం రేవంత్

**రాష్ట్రంలో మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళా అభివృద్ధి, సంక్షేమంతో పాటు సాధికారత లక్ష్యంగా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా గత ఏడాది వివిధ పనులు చేపట్టిన సర్కారు, ఈ ఏడాది ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025 పేరుతో అన్ని రంగాల్లోని మహిళలకు ప్రాధాన్యత నిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వేదికగా నేడు ఇందిరా మహిళా శక్తి మిషన్-2025 విడుదల చేసేందుకు సన్నాహం చేస్తున్నారు.**

హైదరాబాద్(జనంసాక్షి) రాష్ట్రవ్యాప్తంగా లక్షమందికి తగ్గకుండా మహిళలను సమీకరించి భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ సభలోనే ఈ మిషన్ ను విడుదల చేయనున్నారు. ఈ మిషన్‌లో మహిళా స్వయం సహాయక బృందాల విజయాలు, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించారు. ప్రధానంగా మహిళల ఆర్థిక స్వేచ్ఛ,

మిగతా 4లో..

## సౌత్ అంటే భాజపాకు కక్ష

- దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గించే కుట్రలు
- డీ లిమిటేషన్‌తో సీట్ల తగ్గింపునకు ఎత్తులు
- దక్షిణ భారతంలో బిజెపికి 29 ఎంపి సీట్లే
- ఎక్కడా అధికారంలో లేకపోవడంతో కక్షతీర్చుకునే ప్రయత్నం.. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో సీఎం రేవంత్

న్యూఢిల్లీ(జనంసాక్షి): దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎక్కడా అధికారంలో లేమని, రామని తెలుసుకునే ఇలా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. జనాభా ప్రాతిపదిక పేరుతో అన్యాయం చేసేందుకు మోదీ ఎత్తులు వేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు డీలిమిటేషన్ అంశంపై రేవంత్ రెడ్డి

మిగతా 4లో..

సమగ్రసర్వేపై సామాజికవేత్తలతో

# స్వతంత్ర హోదాతో కమిటీ

## సలహా కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి): సమగ్ర కుటుంబ(ఆర్థిక , రాజకీయ, విద్య, సామాజిక, న్యాయ) సర్వే ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధ్యయనానికి సామాజికవేత్తలతో స్వతంత్ర హోదాతో కమిటీ ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సమగ్ర సర్వే సమాచారాన్ని విశ్లేషణ చేసి చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు.

మిగతా 4లో..

### ఉద్యోగులు బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదు

- రూ.పదివేల కోట్ల పెండింగ్ బిల్స్ క్లియర్ చేశాం
- ఏప్రిల్ నుంచి ఉద్యోగుల బకాయిలు లేకుండా చూస్తాం
- ఉద్యోగుల జేఏసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



## నేడు అఖిలపక్ష భేటీ

- ముఖ్యఅతిథిగా హాజరు కానున్న సీఎం రేవంత్
- కిషన్‌రెడ్డి, బండిలను ఆహ్వానించిన భట్టి

హైదరాబాద్(జనంసాక్షి): పార్లమెంట్ మలివిడత సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో పెండింగ్ సమస్యలపై గళమెత్తేందుకు ఎంపిలు ఏకతాటిపై నడవాలని ప్రభుత్వం కోరుకుంటోంది. ఈక్రమంలో ప్రజాభవన్‌లో శనివారం అఖిలపక్ష ఎంపీల

మిగతా 4లో..



## తిరగబడదాం రండి

**‘డీలిమిటేషన్’కు వ్యతిరేకంగా కేంద్రంపై యుద్ధం ప్రకటించిన స్టాలిన్**

**ఏడు రాష్ట్రాల సీఎంలకు లేఖ**

చెన్నై(జనంసాక్షి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్రంపై పోరాడుతున్నారు. ఈ విషయంపై తాజాగా ఏడు రాష్ట్రాల సీఎంలకు లేఖ రాశారు.కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ కసరత్తుకు వ్యతిరేకంగా ‘జాయింట్ యాక్షన్ కమిటీ’ ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు. ఇటీవల తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో జరిగిన తీర్మానం ఆధారంగా ఈ లేఖలు రాశారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ్ బెంగాల్, ఒడిశాకు వీటిని పంపారు. సమష్టి కార్యాచరణ కోసం మార్చి 22న చెన్నైలో సమావేశానికి హాజరుకావాలని కోరారు. అలాగే ఈ రాష్ట్రాలకు చెందిన సీనియర్ నేతలు, అధికార, ప్రతిపక్ష నాయకులను ఆయన ఆహ్వానించారు. "డీలిమిటేషన్ అనేది సమాఖ్యవాదంపై చేస్తోన్న దాడి. ఇది పార్లమెంట్‌లో మన హక్కులకు కోత పెట్టి, జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించడమే అవుతుంది. ఈ అన్యాయాన్ని మేం సహించబోం" అని స్టాలిన్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన 2026లో జరగనుంది. ఇందుకు అనుసరించే విధివిధానాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందన్న ఆందోళన రేగుతోంది. జనాభా తక్కువగా ఉండటంతో లోక్‌సభలో వాటి ప్రాతినిధ్యానికి కోత పడుతుందన్న భయాలున్నాయి. కుటుంబ నియంత్రణ పాటించడంలో దక్షిణాది రాష్ట్రాలు సాధించిన విజయమే వాటి పాలిట శాపం కానుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జనాభా నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అధిక జనాభా కలిగిన ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లు లోక్‌సభలో తమ సీట్ల సంఖ్యను ఇప్పటికన్నా పెంచుకోనున్నాయి. ఫలితంగా కేంద్రం నుంచి తమకు రావాల్సిన నిధుల కోసం

మిగతా 4లో..



## అర్హులందరికీ రేషన్‌కార్డులు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

ఖమ్మం(జనంసాక్షి): అర్హులైన వారికి తప్పకుండా రేషన్ కార్డులు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. పేద వారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని 15 నెలలు అయ్యిందని తెలిపారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను కొన్ని పూర్తి చేశాం, మిగిలిన వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3500 ఇళ్లను ఇచ్చే కార్యక్రమం వారంలో

మిగతా 4లో..

ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలించేలా భారాస

## రజతోత్సవ వేడుకలు

- ఏప్రిల్ 27న జరిగే వేడుకలపై ప్రత్యేక సమావేశం
- పార్టీ ముఖ్యనేతలకు కేసీఆర్ దిశానిర్దేశం

సిద్దిపేట(జనంసాక్షి): ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలించేలా భారాస రజతోత్సవ వేడుకలు ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 27న లక్షలాది మందితో వరంగల్‌లో బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీ నేతలతో కేసీఆర్ చర్చలు జరిపారు. పలు కీలక అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ రజతోత్సవాలు, సంస్థాగత అంశాలు, భారాస సభ్యత్వ నమోదు, సంబంధిత అంశాలపై నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు."ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు మరింతగా పోరాడదాం. భారాస.. తెలంగాణ సమాజ రాజకీయ అస్తిత్వ పార్టీ. తెలంగాణకు రక్షణ కవచం భారాస. రజతోత్సవ వేడుకలో తెలంగాణ సమాజమంతా భాగస్వాములే. లోక్‌సభలో భారాస ప్రాతినిధ్యం

మిగతా 4లో..



### ఆర్టీసీ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు

ఆర్టీసీ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2.5 శాతం డీఏను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. డీఏ ప్రకటనతో ప్రతి నెలా ఆర్టీసీపై రూ.3.6 కోట్ల అదనపు భారం పడనుంది.



## 10న గ్రూప్-1 ఫలితాలు వెల్లడి

**ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్**

హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్స్ ఫలితాల వెల్లడికి టీజీపీఎస్సీ తేదీలను ఖరారు చేసింది. ఈ నెల 10వ తేదీన గ్రూప్-1 ఫలితాలను వెల్లడించనుంది. 10 నుంచి 18వ తేదీ మధ్య గ్రూప్-1, 2, 3 ఫలితాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గ్రూప్-2 ఫలితాలకు సంబంధించి 11వ తేదీన జనరల్ ర్యాంకింగ్ జాబితా ప్రకటించనున్నారు. గ్రూప్-3 ఫలితాలకు సంబంధించి 14న జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల చేయనున్నారు. ఈ నెల 17న హాస్టల్ వెల్ఫేర్ తుది ఫలితాలను, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఫలితాలను ప్రకటించనున్నట్లు టీజీపీఎస్సీ

మిగతా 4లో..

## కార్మికుల జాడ కోసం జీపీఆర్‌తో వెతుకులాట

**8 ప్రదేశాలను గుర్తించామన్న అధికారులు**

**ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ముమ్మరంగా సహాయక చర్యలు.. లోపలికి వెళ్లిన 110 మంది సిబ్బంది**

నాగర్‌కర్నూల్‌బ్యూరో(జనంసాక్షి):‘శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) కార్మికుల జాడ గుర్తించేందుకు జీపీఆర్ సహాయంతో సిగ్నళ్లు పంపగా.. 8 ప్రదేశాల నుంచి బలమైన సిగ్నళ్లు ప్రతిబింబించాయి. ఆయా ప్రాంతాలను, లోతును లెక్కకట్టి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి అందజేశాం. ఆయాచోట్ల మార్కింగ్ చేసి రెండుచోట్ల

మిగతా 4లో..





## ఒక్క నియోజకవర్గం కూడా తగ్గదు

**ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో త్వరలో జనగణన**

**వచ్చే పార్లమెంట్ నాటికి మహిళా రిజర్వేషన్లు:కిషన్ రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి): త్వరలోనే మోదీ నేతృత్వంలో జన గణన జరగబోతుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరగబోతుం దన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలు అవుతాయని పేర్కొన్నారు. ఇప్పుడున్న స్థానాల్లో ఏ ఒక్క సీటు తగ్గకుండా అసెంబ్లీ, లోక్ సభ స్థానాల పునర్విభజన జరుగుతుందని వెల్లడించారు. కావాలనే ఇక్కడున్న రేవంత్ సర్కార్.. బీఆర్ఎస్, డీఎంకే పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఏ ఒక్క సీటును కూడా తగ్గించే ఆలోచన తమకు లేదని చెప్పారు. కొంతమంది దక్షిణ భారతంలో ఆల్ పార్టీ మీటింగ్ అంటూ హడావుడి చేస్తున్నారు.. జనాభా లెక్కల సేకరణ చేస్తూ నియోజకవర్గాల పునర్విభజన చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపీ

మిగతా 4లో..

## అమెరికా నుంచి మరో దేశానికి ప్రభాకర్‌రావు

**శ్రవణ్‌కుమార్ కూడా.. ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో మలుపు**

హైదరాబాద్(జనంసాక్షి): సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్ చోటు చేసుకుంది. కీలక నిందితులుగా ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్‌గా పని చేసిన ప్రభాకర్ రావు, ఒక మీడియా సంస్థ అధినేత శ్రవణ్ కుమార్

మిగతా 4లో..



# చర్చలకు సిద్ధమే..

**అణు ఒప్పందంపై భేటీ అవుదామంటూ ఇరాన్‌కు ట్రంప్ లేఖ**



### నాసా వ్యోమగాములను భూమ్మీదకు తీసుకొస్తాం

మస్క్‌కు బాధ్యత అప్పగించానన్న ట్రంప్

వార్త 4లో

న్యూయార్క్(జనంసాక్షి): అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి లేఖ రాసినట్లు చెప్పారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. చర్చలకు వారు అంగీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఇరాన్ ముందు రెండు మార్గాలున్నాయి. సైన్యం, లేదా ఒప్పందం చేసుకోవడం. ఒప్పందానికే నేను ప్రాధాన్యం ఇస్తా. ఎందుకంటే ఇరాన్‌ను దెబ్బతీయాలనుకోవడం లేదు. చర్చలు జరుపుతారని ఆశిస్తున్నా. ఇరాన్‌కు అది చాలా ప్రయోజనకరం" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ మరో అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోవడాన్ని నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఇదే అంశంపై ఇటీవల మాట్లాడిన ట్రంప్.. దాన్ని నిరోధించేందుకు గాను వారితో ఒప్పందం చేసుకోవాలని

మిగతా 4లో..

# నేడు స్త్రీ శక్తికి శ్రీకారం

ఉపాధి కల్పన, సంపదసృష్టి పై ఫోకస్ పెట్టారు. ఐకమత్యమే మహాబలం అనే నానుడిని నిజం చేసేలా ఒకే గొడుగు కిందకు గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలను తీసుకొచ్చేందుకు నిర్ణయించారు. ఈ మేరకు కేబినేట్ సమావేశం ఆమోదించిన విషయం తెలిసిందే. స్వయం సహాయక సంఘాల పరిధిని విస్తృతపరిచేలా సభ్యుల అర్హత వయసు పెంచారు. కిశోర బాలికలు, వయోవృద్ధుల ఆర్థిక భద్రత, సామాజిక మద్దతు కోసం నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు చేయాలని నిర్ధేశించారు. సభ్యుల కనీస వయస్సు 18 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించేందుకు, గరిష్ట వయసు 60 సంవత్సరాల నుండి 65 సంవత్సరాలకు పెంచారు.

**ఈ ఏడాది సాధించిన విజయాలు..**

మహిళా సంఘాలకు రూ.21,632 కోట్ల రుణాలు
2,25,110 సూక్ష్మ, మధ్య తరహా సంస్థల ఏర్పాటు
రూ. 110 కోట్లతో 22 జిల్లాల్లో చురుకుగా ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం
రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు
- గ్రామీణ ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్ తో అనుసంధానించడం కోసం మాదాపూర్ లోని శిల్పారామంలో రూ. 9 కోట్లతో ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభం
మహిళా సంఘాలకు పాఠశాల యూనిఫామ్ కుట్టే పనిని అప్పగించడం ద్వారా రూ. 30 కోట్ల ఆదాయం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు.అమ్మ ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో ఇప్పటికే రూ.634 కోట్ల విలువగల 23,701 పనులు.. మహిళా సంఘ సభ్యులకు రెండు లక్షల రుణ బీమా, 10 లక్షల ప్రమాద బీమా
400 మందికి రూ. 40 కోట్ల ప్రమాద బీమా చెల్లింపు
32 జిల్లాల్లో అందుబాటులోకి 32 మొబైల్ ఫిష్ రిటైల్ ట్రక్కులు, ప్రతి ట్రక్కుపై ఆరు లక్షల సబ్సిడీ
మహిళా సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కి ఏర్పాట్లు
మహిళా సంఘాల ద్వారా 600 ఆర్టిసి అద్దె బస్సుల నిర్వహణ
32 జిల్లాల్లో మహిళా సమాఖ్యల పెట్రోల్ బంకులు
తెలంగాణ మహిళా శక్తికి మరింత ఊతమిచ్చేలా ఇందిరా మహిళ శక్తి మిషన్ – 2025

# సౌత్ అంటే భాజపాకు కక్ష

కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్న వేళ 'ఇండియా టుడే' నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడారు. 'దక్షిణాదిలో భాజపాకు తగిన ప్రాతినిధ్యం లేదు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఆ పార్టీ సాధించిన 240లో దక్షిణాదిలో గెలిచింది కేవలం 29 స్థానాలే. దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా ఆ పార్టీ అధికారంలో లేదు. ఏపీలో జూనియర్ భాగస్వామిగా ఉంది. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని భాజపా భావిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా డీలిమిటేషన్‌కు సిద్ధమవుతోందని రేవంత్ రెడ్డి అన్నారు.కేంద్రం ఆదేశాల మేరకే దక్షణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమగ్రంగా అమలు చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. మరో 30ఏళ్లు డీలిమిటేషన్ పక్రియను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ఏవిధంగా పెరుగుతుందో చూడాలన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రో రేటా విధానంలో సీట్ల పెంపు చేపడితే యూపీలో ప్రస్తుతం ఉన్న 80 సీట్లు 120కి పెరుగతాయన్నారు. తమిళనాడులో 39 నుంచి 60కి మాత్రమే చేరుతాయని అభిప్రాయపడ్డారు. కేవలం దక్షిణాదిలోనే కాదని ఉత్తరాదిలోని పంజాబ్ వంటి రాష్ట్రాలకూ డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి బిమారీ రాష్ట్రాలకు మాత్రమే దీంతో లబ్ది జరుగుతుందని తెలిపారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా పలువురు ముఖ్య నేతలను కలవనున్నారు. మరోవైపు.. 'ఇండియా టుడే' మీడియా సంస్థ నిర్వహించిన కాంక్లేవ్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ.. మీరు కన్ఫ్యూజ్ అయినట్టే మేము మూడు లక్షల కోట్లే అప్పు అనుకున్నాం.. కానీ లెక్కలు చూస్తే రూ.7 లక్షల కోట్లు అప్పు ఉందని అన్నారు. కేసీఆర్ మూడు లక్షల కోట్ల అప్పే అని చెప్పారన్నారు. తెలంగాణలో 21 వేల కోట్లు రైతులకు రుణమాఫీ.. మూడు నెలల్లో చేసింది తమ ప్రభుత్వమేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని వెల్లడించారు. సౌత్ ప్రాతినిధ్యం తగ్గించే పనిలో బీజేపీ ఉందని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణకు సౌత్ ఇండియా ప్రజలు కట్టుబడి ఉన్నారు.. ఇప్పుడు జనాభా ప్రకారం నియోజక వర్గాల విభజన అంటే ఎలా..? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మోడీ జన గణన చేస్తున్నారు.. దాంట్లో కుల గణన కూడా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ అని తెలిపారు. ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తాం అంటున్నామని చెప్పారు. మరోవైపు.. భాషను బలవంతంగా రుద్దొద్దని సూచించారు. ఎక్కువ మంది మాట్లాడే భాష హిందీ.. రెండో భాష తెలుగు అని చెప్పారు. సివిల్స్‌లో తెలుగుని తొలగించారని తెలిపారు. కాంగ్రెస్ కు యూత్ కాంగ్రెస్.. మహిళా కాంగ్రెస్ అనుబంధ సంఘాలు ఉన్నాయని వెల్లడించారు. కానీ మోడీకి ఈడీ, సీబీఐ, ఇన్‌కం టాక్స్‌లు అనుబంధ సంఘాలని విమర్శించారు.కాంగ్రెస్ ప్రజాస్వామ్యం ఎక్కువ.. అద్వానీ, మురళీమనోహర్ జోషి లాంటి వాళ్లను పక్కన పెడితే సైలెంట్‌గా ఉన్నారు.. తమ పార్టీలో రాజ్యసభ సీటు ఒక్కసారి ఇవ్వకపోతే జంతర మంతర్ లో ధర్నా చేస్తారు.. అంత ప్రజాస్వామ్యం ఉంటుంది కాంగ్రెస్ పార్టీలోనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బీజేపీలో అది సాధ్యమేనా అని అన్నారు. అదానీ 100 కోట్లు వెనక్కి ఇవ్వాలని పార్టీ చెప్పలేదు.. తాను భద్రాచలంలో రాముడి గుడి ఉందని చెప్పా.. మోడీ, అమిత్ షాలను పిలిచా ఇప్పటి వరకు రాలేదన్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లో ఒలంపిక్స్ నిర్వహించండి అని తాను లేఖ రాశానని తెలిపారు. అహ్మదాబాద్ కంటే తమ దగ్గర ఇన్ఫ్రాస్టక్చర్ ఎక్కువ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## అమెరికా నుంచి మరో దేశానికి ప్రభాకర్‌రావు

అమెరికా నుంచి మరో దేశానికి వెళ్లినట్టు అధికారులు గుర్తించారు. రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేయడానికి కావల్సిన ప్రక్రియను సీఐడీ పూర్తి చేసి సీబీఐకి అందజేసింది. త్వరలోనే సీబీఐ రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వనుంది. రెడ్ కార్నర్ నోటీస్ సీబీఐ ఇవ్వగానే ఏ దేశంలో ఉన్న దొరికిపోతారని పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్ పోలీసులు పంపిన రెడ్ కార్నర్ నోటీస్ వినతిని సీబీఐకి సీఐడీ పంపించింది. కాగా.. ఈ కేసులో నిందితులుగా ఉన్న ప్రభాకర్ రావు, శ్రవణ్ కుమార్ అమెరికాలో తలదాచుకున్న విషయం తెలిసిందే. వీరిని విచారణ జరిపితే ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలు వాస్తవాలు బయటపడతాయని హైదరాబాద్ పోలీసులు భావించారు. అయితే వారిని అమెరికా నుంచి హైదరాబాద్ రప్పించేందుకు.. అలాగే వీరిద్దరినీ తమకు అప్పగించాలని ఇప్పటికే సీబీఐకి సీఐడీ అధికారులు లేఖ రాశారు. సీబీఐకు కావాల్సిన సమాచారాన్ని అందజేశారు. సీబీఐ రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చిన తర్వాత అమెరికాలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకోవాలనే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పుడు ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు అమెరికా నుంచి వేరొక దేశానికి పారిపోయారని సమాచారం ఉంది. దీంతో హైదరాబాద్ పోలీసులు, సీఐడీ అధికారులు దీనిపై దృష్టి సారించారు. సీబీఐకి మరో లేఖను రాసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చేందుకు ఇప్పటికే ప్రక్రియ అంతా పూర్తి అయ్యింది. హైదరాబాద్ పోలీసులు సీఐడీకి సమాచారం ఇస్తే.. ఆ ప్రక్రియను పూర్తి చేసిన సీఐడీ.. దాన్ని సీబీఐకి అందజేసింది. రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చే అధికారం సీబీఐకి ఉన్న నేపథ్యంలో ఈ వారంలోనే రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒక్కసారి రెడ్ కార్నర్ నోటీసులు ఇస్తే నిందితులు ఏ దేశంలో ఉన్నా కూడా వారిని కస్టడీలోకి తీసుకునే ఛాన్స్ ఉంటుంది. గత కొంతకాలంగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముందుకు సాగని పరిస్థితి. ఈ కేసులో అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ ప్రణీత్ రావు, టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగా పనిచేసిన రాధాకిషన్ రావును అదుపులోకి తీసుకుని విచారణ జరిపి వారిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. కొద్దిరోజుల క్రితమే వీరంతా కూడా బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ క్రమంలో ప్రభాకర్ రావు, శ్రవణ్ కుమార్‌ను విచారిస్తే ఇందులో రాజకీయ నేతల ప్రమేయానికి సంబంధించి ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంటుంది. ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైన వెంటనే వీరిద్దరూ కూడా అమెరికాకు పారిపోయారు. ఇప్పుడు అమెరికా నుంచి మరోదేశానికి పారిపోయారనే సమాచారం హైదరాబాద్ పోలీసులకు అందింది. రెడ్ కార్నర్ నోటీసులు ఇచ్చాక ఏ దేశంలో ఉన్నా కూడా వీరిద్దరినీ అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది.

## కార్మికుల జాడ కోసం జీపీఆర్‌తో వెతుకులాట

తవ్వకాలు జరిపితే యంత్ర పరికరాలు బయటపడ్డాయి. ఆ ప్రాంతాలను వదిలేసి మిగతా ఆరు చోట్ల తవ్వకాలు చేపట్టాలని సూచించాం. త్వరలోనే సానుకూల ఫలితం వస్తుందని ఆశాభావంతో ఉన్నాం' అని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్‌ఐ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. తమ బృందంతో కలిసి వారంపాటు సహాయ చర్యల్లో పాల్గొని ఆయన కార్యాలయానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడి అనుభవాలను తెలిపారు. "గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) ద్వారా ఎలక్ట్రోమాగ్నటిక్ కిరణాలను పంపించి వస్తువులను గుర్తిస్తాం. ఏరోస్పేస్‌లో ఈ రాడార్ సాయంతో శత్రువుల విమానాలను గుర్తిస్తారు. ఆకాశంలో విమానం వంటి ఆబ్జెక్ట్ ఒకటే ఉంటుంది. వాటిని తాకి తిరిగి వచ్చిన సిగ్నళ్లను బట్టి ఆబ్జెక్ట్‌ని కచ్చితంగా గుర్తించడం సాధ్యం అవుతుంది. ఈ సిగ్నళ్లను భూమి లోపలికి పంపించి అక్కడి పొరల్లో ఏం ఉందో గుర్తించే ప్రయత్నం చేశాం. సొరంగంలో కార్మికుల జాడ గుర్తించేందుకు 200 మెగాహెర్ట్జ్ సిగ్నళ్లను పంపించాం. సిగ్నళ్లను ట్రాన్స్‌మిట్ చేసినప్పుడు భూమి పొరల్లోకి వెళ్లి.. ఏవైనా అడ్డంకులు ఏర్పడితే కిరణాలు వెనక్కి వస్తాయి. వచ్చే కిరణాల తాకిడినిబట్టి లక్షిత వస్తువు ఎక్కడ ఉందనేది మ్యాప్ చేస్తాం. సొరంగం శిథిలాల్లో డ్రిల్లింగ్ యంత్రం భాగాలు ఉన్నాయి. తిరిగి వచ్చిన సిగ్నళ్లలో వీటిని తాకి వచ్చినవి కూడా ఉన్నాయి. టన్నెల్ లోపల నుంచి కాకుండా.. ఎక్కడ కూలిందనేది కొండ పైనుంచి కూడా గుర్తించే ప్రయత్నం చేశాం. టైమ్ డొమైన్ ఎలక్ట్రో మాగ్నటిక్ ద్వారా భూమి పొరలు ఎలా ఉన్నాయనేది చూశాం. 200 మీటర్ల లోతు వరకు చూడగలిగాం. కొండపై నుంచి 500 మీటర్ల లోతులో సొరంగం ఉంది. మరింత అధ్యయనం చేయాలని ప్రభుత్వం కోరితే చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని సత్యనారాయణ వివరించారు.

**లోపలికి వెళ్లిన 110 మంది సిబ్బంది**

దోమలపెంట: కూలిన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ రెస్క్యూ ఆపరేషన్ నేటితో 14వ రోజుకు చేరుకుంది. 8 మంది కార్మికుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. క్యాడవర్ డాగ్స్ బృందం టన్నెల్‌లోకి వెళ్లింది. తవ్వేందుకు అవసరమైన సామగ్రిని లోకోమోటర్ తీసుకెళ్లింది. సామగ్రితో పాటు 110 మంది సిబ్బంది లోనికి వెళ్లారు. 15 ఫీట్ల లోపల ఉన్నా గుర్తించడం క్యాడవర్ డాగ్స్ ప్రత్యేకత. అన్వేషణ అనంతరం ఈ బృందం మధ్యాహ్నం టన్నెల్ నుంచి తిరిగి రానుంది. సంఘటనా స్థలిలో పరిస్థితులను నాగర్‌కర్నూల్ కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు.

## ఒక్క నియోజకవర్గం కూడా తగ్గదు

కార్యాలయంలో జరిగినకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి.. అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ స్థానాల్లో ఒక్కటి కూడా వదిలిపెట్టవద్దు.. కుటుంబ రాజకీయాలు వద్దు.. ఇది మంచి సంప్రదాయం కాదని కిషన్ రెడ్డి సూచించారు. మహిళను శక్తిగా కొలిచే సంప్రదాయం ఒక్క భారత్‌లోనే ఉందని అన్నారు. ఇంటిని నడిపే మాతృమూర్తి మహిళ అని పొగిడారు. పార్టీలో ఎలాంటి బాధ్యతలు ఇచ్చిన అద్భుతంగా మహిళా మోర్చా నేతలు పని చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మహిళలు బాగా పని చేశారు.. దేశ సరిహద్దుల్లో రక్షణ విభాగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే అత్యధిక మహిళా పైలట్లు ఇండియాలో ఉన్నారు.. ముస్లిం మహిళల కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేసిన ప్రభుత్వం మోదీది అని కిషన్ రెడ్డి తెలిపారు. ప్రసూతి సెలవులు 26 వారాలకు పొడిగించిన ఘనత మోదీ సర్కార్‌ది అన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లునే ఆమోదించారని పేర్కొన్నారు. మరోవైపు.. 2014-2019 తొలి తెలంగాణ ప్రభుత్వంలో మహిళా మంత్రి లేకుండా పాలన సాగిందని ఆరోపించారు. ఎక్కువ మంది మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జె కట్టి మండుటెండల్లో మహిళలు పాల్గొన్నారు.. కాంగ్రెస్ కూడా బీఆర్‌ఎస్ లానే పాలన చేస్తోందని మండిపడ్డారు. ఫ్రీ బస్ ఇచ్చిన రేవంత్.. అందులో తిరుగుతూ మిగిలిన హామీలు అమలు చేసినట్లు ఫీల్ అవ్వమని మహిళలకు చెబుతున్నారన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు రావాల్సిన అవసరం ఉంది.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 90 శాతం మహిళా టీచర్లు, గ్రాడ్యుయేట్లు బీజేపీకి ఓటు వేశారని తెలిపారు. మహిళలు పిడికిలి బిగించి రేవంత్ సర్కారును నిలదీయాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## సమగ్రసర్వేపై సామాజికవేత్తలతో స్వతంత్ర హోదాతో కమిటీ

శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాల యంలో సలహా కమిటీ సభ్యులతో ఆ యన సమావేశం అయ్యారు. జస్టిస్ సుదర్శ న్ రెడ్డి చైర్మన్ గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మన్ గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్ గా వ్యవహరిస్తారు అని తెలిపారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ సుఖదేవు, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, శాంత సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్య భంగ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్ ఉంటారని తెలిపారు. ఈ నిపుణుల కమిటీ సర్వే నివేదికను నెల రోజుల్లో ప్రణాళిక శాఖకు అందజేయాలని తెలిపారు. ఈ సామాజిక ఆర్థిక సర్వేను దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉన్నత భావంతో మార్గదర్శనం చేశారని తెలిపారు. సమాజంలో సామాజిక న్యాయానికి పునాది వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సర్వే జరిపించింది అన్నారు. ఈ గొప్ప కార్యక్రమంలో చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వరాదనే ఆలోచనతో లోతుగా అధ్యయనం చేసి భాగస్వాములు అందరితోనూ సర్వేపై ముందస్తుగా సమావేశాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్ గా ఏర్పాటు చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా సర్వే జరిపించినట్లు తెలిపారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా, అపోహలకు తావు లేకుండా ఉండటం కోసం దేశంలో, రాష్ట్రంలో సామాజిక స్పృహ కలిగిన మేధావులను సమగ్ర కుటుంబ సర్వే అధ్యయనంలో భాగస్వాములను చేసి స్వతంత్ర హోదా కల్పించినట్లు తెలిపారు. సమావేశంలో ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇస్తాం

ప్రారంభమవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా తులం బంగారం కొంత ఆలస్యమవుతుందని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టించిందని విమర్శించారు. వాటన్నింటినీ గాడిన పెడుతూ తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ఎక్కడ తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని ఆలస్యమైనా నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## 10న గ్రూప్-1 ఫలితాలు వెల్లడి

అధికారులు వెల్లడించారు రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసింది. అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా వెల్లడికి టీజీపీఎస్సీ తుది పరిశీలన కొనసాగిస్తోంది. షెడ్యూల్ ప్రకారం.. మార్చి 10న గ్రూప్-1 ఫలితాల విడుదల, అదే రోజు అభ్యర్థుల ప్రొవిజినల్ మార్కుల వివరాలనూ వెల్లడించనుంది. అనంతరం ఆయా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది. మార్చి 11న గ్రూప్-2 జనరల్ ర్యాంకింగ్ జాబితాను ప్రకటించనుంది. 14న గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ జాబితాను కమిషన్ వెల్లడించనుంది. 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ తుది ఫలితాలు విడుదల చేయనున్నారు.

## ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలించేలా భారాస రజతోత్సవ వేడుకలు

లేకుండా పోయింది. భారాస ఎంపీలు లేకపో వడంతో రాష్ట్ర హక్కులకు భంగం కలుగు తోంది. తెలంగాణ ప్రజాప్రయోజనాలకు కేంద్రం, రాష్ట్రాలు దెబ్బతీస్తున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరులను తిప్పి కొట్టాలి" అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

## నాసా వ్యోమగామలను భూమ్మీదకు తీసుకు వస్తాం

**మస్క్‌కు బాధ్యత అప్పగించానన్న ట్రంప్**

**వాషింగ్టన్(జనంసాక్షి):** నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను త్వరలో భూమి మీదకి తీసుకువస్తామని అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రకటించారు. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు 9 నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ ఇద్దరు వ్యోమగాములు తిరిగి వచ్చినపుడు, వారిని పలకరించడానికి తాను సిద్ధంగా ఉంటానని ట్రంప్ అన్నారు. ఓవల్ ఆఫీసులో గురువారం కీలక ప్రకటన చేశారు. 'మేము మిమ్మల్ని ప్రేమిస్తున్నాం. తీసుకువెళ్లడానికి వస్తున్నాం' అని వ్యోమగాములకు సందేశం పంపామని అన్నారు. వారిని భూమిపైకి తీసుకు వచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. వ్యోమగాములను సురక్షితం గా భూమిపైకి తీసుకువచ్చే బాధ్యతను ఎలన్ మస్క్‌కు అప్పగించినట్లు తెలిపారు. రాబోయే రెండువారాల్లో మస్క్ వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకువచ్చే స్పేస్ ఎక్స్ క్యాప్సూల్‌ను సిద్ధం చేస్తున్నారని అన్నారు.

## చర్చలకు సిద్ధమే..

అనుకుంటున్నానని చెప్పారు. ఇదిలాఉంటే, ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా.. 2018లో ట్రంప్ హయాంలోనే దాన్నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.

## తెలంగాణలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

ఇద్దరు నాన్ కేడర్ ఎస్పీలు ఉన్నారు. మిగిలిన 14 మంది ఎస్పీలకు స్థాన చలనం కల్పించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం అదనపు డీజీ (పర్సనల్)గా అనిల్ కుమార్. ఎస్పీఎఫ్ డైరెక్టర్‌గా ఆయనకు అదనపు బాధ్యతలు సీఐడీ ఐజీగా ఎం.శ్రీనివాసులు వరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్ నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య రామగుండం సీపీగా అంబర్ కిషోర్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధుశర్మ భువనగిరి డీసీపీగా ఆకాంక్ష యాదవ్ మహిళ భద్రతా విభాగం ఎస్పీగా చేతన నార్కొటిక్ బ్యూరో ఎస్పీగా రూపేష్ కామారెడ్డి ఎస్పీగా రాజేష్ చంద్ర సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్ రాజన్న సిరిసిల్ల ఎస్పీగా జీఎం బాబా సాహెబ్ వరంగల్ డీసీపీగా అంకిత్ కుమార్ మంచిర్యాల డీసీపీగా ఎ.భాస్కర్ సూర్యాపేట ఎస్పీగా కె.నర్సింహా హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీగా శిల్పవల్లి ఎస్ఐబీ ఎస్పీగా సాయి శేఖర్ పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్ సీఐడీ ఎస్పీగా రవీందర్

## ఉద్యోగులు బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదు



హైదరాబాద్(జనంసాక్షి):ప్రభుత్వ ఉద్యోగులు వారి బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదని,ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పదివేల కోట్ల బకాయిలను చెల్లించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగులు దాచుకున్న డబ్బు కోసం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను అర్థం చేసుకొని ఒక నిర్ణయం తీసుకున్నామన్నారు. ఐదు వేల కోట్ల బిల్స్ పెండింగ్లో పెట్టి వెళ్లిందని, గత 14 నెలల కాలంలో కొంత బకాయిలు జమ అయ్యాయని వివరించారు. పాత, కొత్త పెండింగ్ బిల్స్ 10,000 కోట్లు తమ ప్రభుత్వం క్లియర్ చేసిందని తెలిపారు. మరో ఎనిమిది వేల కోట్ల బకాయిలు మిగిలి ఉన్నాయి అని వివరించారు. ఏప్రిల్ మాసం నుంచి ఎలాంటి బకాయిలు లేకుండా చూస్తామని, అట్లాగే దానితోపాటు ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న 8,000 కోట్ల పాత బకాయిలు రానున్న ఏప్రిల్ నుంచి ప్రాధాన్యత క్రమంలో ప్రతినెల 500 నుంచి 600 కోట్ల వరకు ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్స్ క్లియర్ చేస్తామన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారి సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నెలలో ఏ తేదీలో జీతాలు పడతాయో అర్థం కాని పరిస్థితి ఉండేదని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల క్రమం తప్పకుండా ఒకటో తారీఖున జీతభత్యాలు చెల్లిస్తున్నామని, రాష్ట్రంలో దాదాపు 13 లక్షల మంది (ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్) సిబ్బంది ఉన్నారని తెలిపారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ తదితర బిల్లును మాత్రమే పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరలో క్లియర్ చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల అర్థికేతర సమస్యలు పరిష్కరించడానికి వివిధ క్యాబినెట్ సభ్యులు ఉన్నాయని ఆ సమస్యలు కూడా త్వరలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని వివరించారు. తమది ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ నాన్ గెజిటెడ్, గెజిటెడ్, వివిధ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు, మున్సిపల్, వైద్య ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆధ్వర్యంలో నేడు అఖిలపక్ష భేటీ

సమావేశం ఏర్పాటు చేసి, అన్ని పార్టీలకు ఆహ్వానం పంపించింది. కేంద్రంలో పెండింగ్ సమస్యల పరిష్కారం ఎంజెడాగా ఈ సమావేశం జరగనుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరుకానున్నారు. అలాగే కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లకు ఆహ్వానం పంపారు. అలాగే తెలంగాణ ఎంపీలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి ఆహ్వానించారు.అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలోనే నిర్ణయించారు. జానారెడ్డి, భట్టి విక్రమార్క నేతృత్వంలో కమిటీని వేసి ఈసమావేశాన్ని నిర్వహించి రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన వాటాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై అఖిలపక్షంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా కేబినెట్‌లో తీర్మానం చేయడంతో పాటు భట్టి, జానా నేతృత్వంలో కమిటీని కూడా వేసింది. వెంటనే రంగంలోకి దిగిన కమిటీ.. స్వయంగా అన్ని పార్టీలకు సంబంధించిన ఎంపీలకు భట్టి ఫోన్‌లు చేసి సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఆల్ పార్టీ ఎంపీల సమావేశం నిర్వహించనున్నారు. భట్టి, జానారెడ్డి నేతృత్వంలో జరుగనున్న ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి కూడా హాజరుకానున్నారు. బీజేపీకి సంబంధించిన ఎంపీలను కూడా సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అందులో ప్రధానంగా కేంద్ర మంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు కూడా ఆహ్వానాన్ని పంపారు. స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి వారిని సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. పార్లమెంటులో తెలంగాణ నుంచి బిజెపికి 8, కాంగ్రెస్‌కు 8మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారు. అలాగే ఎఐఎం నుంచి అసదుద్దీన్ ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బిఆర్ఎస్‌కు కేవలం రాజ్యసభలో మాత్రమే సభ్యులు ఉన్నారు.

## తిరగబడతాం రండి

డిమాండ్ చేసే సత్తా దక్షిణాది రాష్ట్రాలకు తగ్గిపోతుందనే ప్రచారం జరుగుతోంది. పర్యవసానంగా ఉత్తర-దక్షిణ విభేదాలు, ప్రాంతీయ ఉద్రిక్తతలు పెచ్చరిల్లే ప్రమాదముంది. తాము నిర్లక్ష్యానికి గురవుతున్నామనే భావన దక్షిణ భారత రాష్ట్రాల్లో వ్యాపిస్తోంది. అందుకే జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను తమిళనాడు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుతం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ఈ అంశంలో కేంద్రంతో పోరాడుతోంది. పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## కళ్లెదుట జలదోపిడీ జరుగుతున్నా స్పందించరా..?

బనకచర్ల ద్వారా 200 టీఎంసీల కృష్ణా నీళ్ల తరలింపు కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర చేస్తుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల ద్వారా గోదావరి వరద జలాలనే తీసుకువెళ్తున్నాం, తెలంగాణకు నష్టం లేదు అని ఏపీ నీళ్ల మంత్రి అంటే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ మౌనం వహించడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉందన్నారు. గోదావరి, కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను ఏపీ ఇష్టారాజ్యంగా తరలలించే కుట్రలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఉత్తం కుమార్ రెడ్డి సహా ఒక్క నాయకుడికి పట్టింపు లేదు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. "బనకచర్ల తో తెలంగాణకు ఏమి నష్టం" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా మాట్లాడి మూడు రోజులైనా ఒక్కరూ గట్టిగా స్పందించలేదు. తెలంగాణ నీటి ప్రయోజనాలు ఈ సర్కారుకు పట్టవా అక్రమంగా నీటిని తరలించుకు పోతుంటే మొద్దు నిద్రలో ఉంటారా..? చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదా? చంద్రబాబుతో బీజేపీ, రేవంత్ దోస్తీ చేస్తూ తెలంగాణను మోసం చేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బాబు, రేవంత్, బీజేపీ మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి? బిఆర్ఎస్ పార్టీ గొంతెత్తినా మీకు చలనం కలగదా? కాంగ్రెస్, బిజెపి తీరు తెలంగాణ తాగు, సాగు నీటి రంగానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నది. కనీసం మీడియాలో వస్తున్న కథనాలను చూసైనా కదలండి. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి. కేంద్రాన్ని నిలదీయండి. రేవంత్ సహా బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వీడండి! అని హరీశ్‌రావు సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాండవించిన మంచినీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, మంచినీటి సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ తాగునీటి కష్టాలపై హరీశ్‌రావు స్పందించారు.



## తెలంగాణ ఉద్యోగుల జేఏసీతోనే ప్రభుత్వ సంస్థల బలోపేతం

- సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డిలను సన్మానించిన డీసీఏ, టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యోగుల జేఏసీతోనే రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థల బలోపేతం సాధ్యమని తెలంగాణ రెవెన్యూ సంఘాల నేతలు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం కొత్త పోస్టుల మంజూరు చేస్తూ ఉందన్నారు. గ్రామ స్థాయిలో 10,954 గ్రామ స్థాయి పరిపాలన అధికారులు (జీపీఓ), కొత్త డివిజన్లకు, మండలాలకు 361 పోస్టుల మంజూరు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు రాష్ట్ర క్యాబినేట్ గురువారం ఆమోద ముద్ర వేయడానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి కృషి ఫలితమేనన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులకు, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాతచౌహాన్, కోశాధికారి మల్లేశం, సీసీఎల్ఏ అధ్యక్షులు రాంబాబు, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ధర్మన్‌గౌడ్, తదితరులు ఘనంగా సత్కరించారు.

# గౌండ్ల లొట్టికి 'టూరిజం' చిల్లు

- కల్లు గీత సంక్షేమ ఆస్తులు టూరిజం చేతిలోనే..
- వారి ఆస్తులతో పర్యాటక శాఖ వ్యాపారం
- నీరా సెంటర్లతో ప్రభుత్వానికే ఆదాయం

*పేరుకు కల్లుగీత కార్మికుల సంక్షేమం.. నైపుణ్య శిక్షణ.. ఉత్పత్తుల విక్రయం.. నిజానికి వచ్చే ఆదాయమంతా ప్రభుత్వ శాఖకు.. ఇదీ టూరిజం శాఖ తీరు. గౌడ్ల సంక్షేమానికి కేటాయించిన గౌడ కార్పొరేషన్ టూరిజం శాఖకు నిధిగా మారింది. గౌడ కులస్తుల సంక్షేమం అటుంచి కనీసం ఆ కార్పొరేషన్ నుంచి ఎటువంటి లబ్ది జరగకపోవడం గమనార్హం.*

– హైదరాబాద్ సిటీ, మార్చి 07 (జనంసాక్షి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గౌడ్‌ల సంక్షేమానికి 2021-22 సంవత్సరానికి రూ.25 కోట్ల 20 లక్షలు బీసీల బడ్జెట్ లో భాగంగా గౌడ కార్పొరేషన్‌కు కేటాయించింది. బీసీ కార్పొరేషన్ సంక్షేమ శాఖ, గీత కార్పొరేషన్ ఈ రెండు వీరి దగ్గర ఉన్న రూ.20 కోట్ల 20 లక్షలు టూరిజం శాఖ వారికి బదిలాయించారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లో 20 గుంటల స్థలంలో నీరా భవనం నిర్మించాలని టూరిజం శాఖ వారు గౌడ బడ్జెట్‌లోని మొదటి దఫాలో రూ.12.20 కోట్లు తీసుకొని భవన నిర్మాణం చేశారు. ఇందులో నీరా, తాటి ఉత్పత్తులు, కుల వృత్తులలో భాగంగా ఉన్నటువంటి సాంప్రదాయక వంటకాలు, స్టాల్స్ మాత్రమే ఈ భవనంలో చేసుకోవాలని, ఈ వర్గాలకే ఇవ్వాలని నిబంధన పెట్టి విడుదల చేశారు. గీత కార్పొరేషన్ ద్వారానే రాష్ట్రంలోని సొసైటీలు, టిఎఫ్టిలు గీత కార్మికుల మెంబర్షిప్ కలిగి ఉంటుంది. ఈ రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం రెండు లక్షల 18 వేల మంది కల్లుగీత కార్మికులు సభ్యత్వం కలిగి ఉన్నారు. హైదరాబాద్ నగరానికి పరిమితం కాకుండా మండల కేంద్రాల వరకు దీనిని తీసుకువెళ్లి గౌడ వృత్తిదారులకు, యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఇది ఏర్పాటు చేశారు. టూరిజం శాఖకు ఇవ్వడం వల్ల టూరిజం శాఖ వ్యాపారం చేసుకుని లబ్ధి పొందింది తప్ప ఇందులో గౌడ్ కులస్తులకు జరిగిన ఎలాంటి లబ్ధి లేదు.



టూరిజం నుండి గౌడ్‌లకు ఇస్తే ఐదు లక్షల మందికి ఉపాధి అవకాశాలు ప్రతి జిల్లా మండల కేంద్రంలో లభిస్తాయి. ప్రభుత్వం ఉపాధి చూపించడమే కాదు ఉన్న ఉపాధి మార్గాన్ని అభివృద్ధి చేస్తే ఐదు లక్షలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దీనివల్ల చెట్లు ఇచ్చేవాళ్ళు, కల్లు తీసేవాళ్లు, ట్రాన్స్‌పోర్ట్ చేసేవాళ్లు, అందులో పని చేసే వాళ్ళు , స్టాల్స్ నిర్వహించేవారు ఇలా ఇంతమంది లబ్దిపడతారు. ప్రభుత్వం వాళ్లు దీన్ని తీసుకెళ్లి టూరిజానికి అప్పగించడం వల్ల టూరిజం వారే వ్యాపారం చేసుకున్నారు తప్ప గౌడ్ లకు ఎలాంటి లబ్ధి జరగలేదు. రూ.25 కోట్ల 20 లక్షలు మొత్తం గౌడ్‌ల సంక్షేమానికి కేటాయిస్తే హైదరాబాదు నీరా భవనానికి రూ.12 కోట్లు 20 లక్షలు, భువనగిరి దగ్గర ఉన్న నందనంకు రూ.8 కోట్లు,సర్వేల్, చారకొండ, మురిపల్లి, బుద్వేల్ లో సెంటర్ లు పెట్టడానికి రూ.5 కోట్లు కేటాయించారు. రవాణా, వాహనాలు,నిర్వహణ, మిషనరీ వీటన్నిటికీ మొత్తంగా రూ. 25 కోట్లు కేటాయించారు. భువనగిరి నందనం దగ్గర రూ. 8 కోట్లు పెట్టి నీరా ప్లాంట్ ఒకటి పెట్టారు. సేకరణ కేంద్రాలుగా మొరిపల్లె, సర్వేల్, చారకొండ ప్రాంతాలు ఉన్నాయి. అక్కడ కొద్దిగా స్థానిక గౌడ్ ల వారికి లబ్ధి చేకూరింది. హైదరాబాద్ నీరా కేఫ్ నిర్వహణ గీత కార్పొరేషన్‌కు అప్పజెప్తే దాని నుండి వచ్చిన ఆదాయం ప్రతి మండల కేంద్రంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఇలాంటి సెంటర్ లు ఏర్పాటు చేస్తే ఇంకా ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. టూరిజం వారికి ప్రభుత్వం ఆదాయం కేటాయించడం వల్ల వారు వ్యాపారం చేసి ఆదాయం సమకూర్చుకున్నారు తప్పితే





మళ్లీ వీడికి ఎక్కడ గొంగళి అక్కడే అన్నట్టుగా మారింది. గౌడ్ లకు కేటాయించిన బడ్జెట్ ఫలాలు గౌడ్ లు అనుభవించలేకపోతున్నారు. వారు వ్యాపారం చేస్తున్నారు తప్ప ఎవరి సంక్షేమానికి ఉపయోగించడం లేదు. వాళ్ల వ్యాపారాలు కూడా గౌడ యువతకు ఇవ్వకుండా వేరే కులాలకు టెండర్లు లేకుండా లోపాయికార ఒప్పందాలతో వ్యాపారాలు చేసుకుంటూ కమర్షియల్ హెూటల్ లాగా మార్చారని గౌడ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

### కోట్లు సంపాదించారు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లో 20 గుంటల స్థలంలో నీరా భవనంలో టర్మెంటాల్,బంకెట్ హాల్, ఇతర హాళ్లని, పరిసర ప్రాంతాన్ని ప్రైవేటు వ్యక్తులకి ఫంక్షన్లకి మీటింగ్స్ కి అవసరాల రీత్యా బుకింగ్ చేసుకొని వ్యాపారం చేస్తూ రూ.కోట్లు సంపాదించుకున్నారు. ఏ నీరా ప్రాసెస్ కోసం నీరా కేంద్రం ఏర్పాటు చేసి గౌడ్‌లకు పెద్ద ఎత్తున ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని భేఖాతరు చేస్తూ టూరిజం శాఖ వారు ఇక్కడ ఇతర స్టాల్స్ ను ప్రైవేటు కమర్షియల్ వారికి ఇచ్చే అందులో నీరా స్టాల్స్‌ను కూడా మార్చి6న, 2025 వరకు కాంట్రాక్టు ఇచ్చారు.

## ఇల్లీగల్ ఒప్పందాన్ని బయటపెట్టాలి

**ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు**



నీరా భవనాన్ని ఒక ప్రైవేటు కమర్షియల్ హెూటల్‌లాగా మార్చే ప్రయత్నం టూరిజం వారు చేస్తున్నారు. సంవత్సరానికి రూ.25 లక్షలు ఆదాయం కలిగిన టెండర్‌కు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా టూరిజం ఎండి ప్రకాష్ రెడ్డి శంకర్ రెడ్డికి లోపాయికార ఒప్పందం చేసుకుని గంపగుత్తగా అప్పజెప్పారు. దీని మూలంగా రూ.కోట్ల వ్యాపారం చేసుకోవడానికి ఆస్కారం ఏర్పడింది. ఇల్లీగల్‌గా చేసిన ఒప్పందాన్ని టూరిజం వారు బయటపెట్టాల్సిన అవసరం ఉంది. గౌడ సంఘాలు పోరాటాలు చేసి భవనం నిర్మించినందుకు గ్లాసులు, చెట్లు, తాటి చెట్టు ఎక్కే మనిషి నమూనాలు, తాటి ఉత్పత్తుల నమూనాలు ఇవన్నీ ఉన్నటువంటి దాన్ని శంకర్ రెడ్డి నాలుగు నెలలు తన చేజిక్కించుకొని అన్ని తీసివేశారు. దీనిమీద గౌడ సంఘాలు ఆందోళనలను చేపడితే తనకు టెండర్ క్యాన్సిల్ చేస్తున్నామని టూరిజం వారు శంకర్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఇల్లీగల్‌గా ఎంఓయు చేసుకోవడం టెండర్ లేకుండా అంతర్గత ఒప్పందం చేసుకొని వారి బినామీల వ్యాపారాలు ఏంటో టూరిజం శాఖ వారు ఎండి ప్రకాష్ రెడ్డి ఓఎస్‌డి సంజయ్ ఏంజి రమేష్ నాయకుల పాత్ర ఉందని సమాచారం ముగ్గురు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఈ భవనం గౌడ సంక్షేమ కోసం కేటాయించిన బడ్జెట్ తో నిర్మాణం చేశారు బేషరతుగా గీత కార్పొరేషన్ కు టూరిజం శాఖ వారు అప్పగించాలి. టూరిజం శాఖ మంత్రి గీత కార్పొరేషన్‌కు అప్పజెప్పమని సర్క్యులర్ ఇచ్చినా, బీసీ వెల్ఫేర్ మినిస్టర్ టూరిజం శాఖ అధికారికి గీతా కార్పొరేషన్ వారికి బతలాయించమని సిఫార్సు చేసినా, ఎక్సైజ్ రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ టూరిజం శాఖకు లేక రాసి మీరు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, 2024 ముందు ఎలా ఉందో అలానే ఉండాలని చెప్పినప్పటికీ కూడా ఎండి ప్రకాశ్ రెడ్డి సొంత నిర్ణయం తీసుకొని వ్యాపారం చేస్తున్నాడు. బీసీ వెల్ఫేర్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ తాను చొరవ తీసుకుని టూరిజం ఎక్సైజ్ మినిస్టర్ జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి ఒక సర్క్యులర్ ఎండి ప్రకాష్ రెడ్డి చేతులమీదుగానే విడుదల చేశారు. అందులో గీత కార్పొరేషన్ కి మేము బదిలా ఇస్తామని మాత్రమే ఉంది. కానీ వ్యాపార లావాదేవీలు, ఫైనాన్స్ మ్యాటర్ లు, 75% టూరిజం కి చెందాలన్న షరతులు ఏమి లేవు. భవనం మీకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వం. మీకు కావాలంటే 13,759 ఎస్ఎఫ్టి కలిగిన భవనం ఒక్క ఎస్ ఎఫ్ టికి రూ.100 చొప్పున సంవత్సరానికి రూ.లక్షలు ఇస్తామని, తీసుకుంటే తీసుకోండి లేకపోతే నీరా భవనాన్ని కూల్చివేస్తామని, ఇది టూరిజం శాఖకు సంబంధించిన స్థలం కాబట్టి మా స్థలంలో మీరు కట్టినందుకు ఈ భవనాన్ని కూల్చివేస్తామని ప్రిన్సిపల్ సెక్రెటరీకి బీసీ వెల్ఫేర్ మినిస్టర్ కి టూరిజం మినిస్టర్ కి ఒక లెటర్ ఎండి ప్రకాష్ రెడ్డి పంపారని సమాచారం తెలిసింది. మంత్రులు చెప్పిన వినకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, సంక్షేమానికి విరుద్ధంగా గౌడ బడ్జెట్ కు ఫలితాలు అందించకుండా అడ్డుకుంటున్న టూరిజం శాఖ జీఎం, ఏజీఎం, ఎండి, ఓఎస్డి వీళ్ళందర్నీ సస్పెండ్ చేయాలి.

## బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎంపీ ఆకస్మిక తనిఖీ



భువనగిరి, మార్చి 7 (జనంసాక్షి) : యాదాద్రి భువనగిరి జిల్లాలో బీబీనగర్ కేంద్రంగా ఉన్న ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బీబీనగర్ (ఎయిమ్స్, బీబీనగర్) ను భువనగిరి పార్లమెంటు సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రతి రోజు ఇన్ పేషెంట్ అవుట్ పేషెంట్లు ఎంతమంది వస్తున్నారు, వాళ్లకు ఎటువంటి ట్రీట్మెంట్ అందుతుంది? అవసరమైన పేషెంట్ లకు ఆపరేషన్లు చేస్తున్నారు? లేదా? అని ఆరా తీసారు. క్యూ లైన్ లో నిల్చున్న ప్రతి పేషెంట్ పలకరిస్తూ, డాక్టర్ లు సమయానికి వస్తున్నారా, అని ఎక్యుమెంట్స్ ఉన్నాయా? సౌకర్యాలు ఎలా ఉన్నాయి? అడిగి తెలుసుకున్నారు. ఎయిమ్స్‌లో సిబ్బంది నియామకం జరుగుతుందా? జరిగితే ఏ ప్రాతిపాదికన జరుగుతుంది? దీనిని ఏ ఏజెన్సీ నిర్వహిస్తున్నది? దీనిలో లోకల్ వాళ్ళ కి ఎంత వరకు ప్రాధాన్యత ఇస్తున్నారు? అని ప్రశ్నించారు. సిబ్బంది నియామకంలో అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటివి జరగకుండా పారదర్శకంగా ఉండాలని అన్నారు. మిగతా సివిల్ వర్క్స్ ఎంత వరకు పూర్తి అయ్యింది? పూర్తి కాకా పోతే ఎప్పటి వరకు పూర్తి అవుతుంది? పేషెంట్‌లకు అని సౌకర్యాలతో బిల్డింగ్‌లు అందుబాటులోకి ఎప్పుడు వస్తాయి? అని అడిగారు. బిల్డింగ్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తామని గంతల చెప్పిన వాయిదాల దాటిపోయాయని గుర్తు చేస్తూ తర్వగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అభిషేక్ అరోరా, డిప్యూ డైరెక్టర్ డాక్టర్ విపిన్ వర్గీస్ ఉన్నారు.

## వీఆర్ఏ వారసులను వీఎల్ఏ పోస్టుల్లో నియమించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ





హైదరాబాద్, మార్చి 7 (జనంసాక్షి) : 61 సంవత్సరాలు దాటిన వీఆర్ఏ వారసులకు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నియమిస్తున్న విఎల్ఏ పోస్టుల్లో అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ రాశారు. గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి 10,950 విలేజ్ లెవల్ అధికారుల (వీఎల్ఓ)ను నియమించాలని తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 61 సంవత్సరాల వయస్సు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలిస్తామని 81, 85 జీవోలను 2023, జులై ఆగస్టు మాసాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిందని, జీవోలు వచ్చి రెండేళ్ళు కావస్తున్నా 61 సంవత్సరాల వయస్సు దాటిన 3,797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వకుండా కాలయాపన చేశారని గుర్తు చేశారు. తండ్రి ఉద్యోగం కొడుకుకు తప్పకుండా వస్తుందనే ఆశతో, ఆస్థి పంపకాల్లో భాగంగా ఉన్న కొద్దిపాటి భూమి అన్నదమ్ములకు ఇచ్చారని, భూమి లేనివారు లక్షలాది రూపాయలు వడ్డీలకు అప్పులు తెచ్చి ఇచ్చారని, ప్రస్తుతం అప్పులు కట్టలేక, ఉద్యోగాలు రాక ఆర్థిక ఇబ్బందులతో, మనోవేదనతో వీరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనికి కారణం వారసులకు ఉద్యోగాలిస్తామని తెచ్చిన జీవోను ప్రభుత్వాలు అమలు చేయకపోవడమేనని పేర్కొన్నారు. వీరి సమస్యల అధ్యయనం కోసం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా కమిటీని నియమించి యేడాది దాటినా సమస్య నేటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వీరిపట్ల మానవతా దృక్పథంతో స్పందించి 61 సంవత్సరాల వయస్సు పైబడిన వీఆర్ఏ వారసులను ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నియమంచబోయే వీఎల్ఏ ఉద్యోగాల్లో అవకావం ఇవ్వాలని కోరారు.

## విద్యార్థులను చితకబాదిన పీఈటీ

మేడ్చల్, మార్చి7 (జనంసాక్షి) : కీసర ప్రభుత్వ పాఠశాలలో పీఈటీ ఆనంద్ దాష్టీకంతో 8మంది పిల్లలు జ్వరం బారిన పడ్డారు. ఒంట్లో బాగాలేదన్నా వినకుండా 8 మంది విద్యార్థినిలను చితకబాదాడు పీఈటీ. గేమ్స్ పీరియడ్‌లో ఆటలాడేందుకు రాలేదనే కారణంగా ఆ విద్యార్థినిల పట్ల కర్కషంగా ప్రవర్తించాడు. వారిని ఏకంగా కరెంట్ వైర్‌తో చితకబాదాడు. 8వ తరగతి చదువుతున్న ప్రణతి, వైశాలి, కావ్య, నవ్య, చరన్య, అర్చన, బ్లేస్సి, కీర్తనలను పీఈటీ దారుణంగా కొట్టాడు. కొట్టొద్దని విద్యార్థినిలు వేడుకున్నప్పటికీ పీఈటీ వినిపించుకోలేదు. తీవ్రమైన దెబ్బలతో ఇంటికి చేరుకున్న ఆ ఎనిమిది మంది విద్యార్థినిలు స్కూల్లో జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పలేదు. అయితే కరెంట్ వైర్‌తో కొట్టడంతో విద్యార్థులకు జ్వరం బారిన పడ్డారు. ఉన్నట్టుండి వారికి జ్వరం రావడంతో అనుమానించిన తల్లిదండ్రులు వారి ఒంటిపై చూడగా.. గాయాలను చూసి పేరెంట్స్ షాక్‌కు గురయ్యారు. అసలేం జరిగిందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. దీంతో పీఈటీ అరాచకం బయటపడింది. ఆడపిల్లలను కరెంట్ వైర్‌తో కొట్టడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే విద్యార్థినిల తల్లిదండ్రులు స్కూల్ వద్దకు చేరి ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పీఈటీ ఆనంద్ స్కూల్‌కు దుమ్మా కొట్టేశాడు. ఈ ఘటనపై జిల్లా విద్యాధికారి స్పందించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేసారు. తల్లిదండ్రుల ఆందోళనతో స్కూల్ వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కబెట్టేందుకు ప్రయత్నించారు. తమ పిల్లలను చితకబాదిన పీఈటీపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేసారు.

## పెంచాల్సిన వేతనాలు తగ్గించడమేంది?

- ఉద్యోగులకు డీఏలివ్వరు.. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచరా?
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ శానిటేషన్ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కరోనా మహమ్మారి కాలంలో ప్రాణాలను ఫణంగా పెట్టి అందించిన సేవలు మరువలేనివని, ఆనాటి నుండి నేటి వరకు వేతనాలు పెంచాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో మున్సిపల్ డ్రైవర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లకు చెల్లిస్తున్న వేతనాలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు పెంచకపోగా ఉన్న వేతనాల్లో భారీగా కోత విధించడం ఎంత వరకు సమంజసం? అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు శానిటరీ ఇన్ స్పెక్టర్లకు నెల వేతనం రూ.22 వేలు చెల్లిస్తుండగా, ఆ వేతనాన్ని రూ.16,600లకు తగ్గించడం దుర్మార్గమని, అట్లాగే డ్రైవర్లకు సైతం ఇదే విధంగా కోత విధించడం ఎంత వరకు న్యాయం? అని ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 5 డీఏలు పెండింగ్ లో ఉన్నప్పటికీ వాటిని చెల్లించడం లేదు. జీపీఎఫ్ లో దాచుకున్న సొమ్మును కూడా డ్రా చేసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఆఖరికి రిటైర్డ్ మెంట్ బెన్ ఫిట్స్ ఇవ్వకుండా కాళ్ల చెప్పులరిగేలా ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటూ ఉద్యోగులను వేధిస్తున్నారని తెలిపారు. తక్షణమే చేసిన పొరపాటును సరిదిద్దుకుని మున్సిపల్ డ్రైవర్లు, శానిటేషన్ వర్క్ ఇన్ స్పెక్టర్ల వేతనాలను సరి చేయడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది అందరికీ వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు.

## కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

- బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత



నల్లగొండ, మార్చి7 (జనంసాక్షి) : నల్లగొండ ప్రభుత్వ అస్పత్రిలో ఈ నెల 4వ తేదీన కిడ్నాప్‌కు గురైన బాలుడిని టూటౌన్ పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని టూటౌన్ పోలీసులకు మార్గదర్శనం చేస్తూ ఛేధిచారు. ఎస్పీ పవార్ తెలిపిన వివరాల ప్రకారం బాలుడి తల్లి, ఫిర్యాదుదారు అయిన షమీమున్నీసా గత మూడేళ్ల నుంచి తన భర్త మహ్మద్ అహ్మద్, తన ఇద్దరు పిల్లలు.. కొడుకు అబ్దుల్ రహ్మాన్ (3), కూతురు అలీన (5) లతో కలిసి కడు పేదరికంతో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త పెయింటింగ్ పనికి వెళ్తూ కుటుంబ అవసరాలు తీరుస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన సాయంత్రం 4 గంటలకు బాలుడు అబ్దుల్ రహ్మాన్ ఆసుపత్రి ఆవరణలో ఐస్ క్రీమ్ బండి దగ్గర ఆడుకుంటుండగా నార్కట్‌పల్లి మండలం మాంద్ర గ్రామానికి చెందిన రాపోలు సీతారాములు (40) ఆ బాలుడిని మచ్చిక చేసుకుని మాయమాటలు చెప్పి, కిడ్నాప్ చేసి తీసుకుపోయాడు. బాలుడు కనిపించ కపోవడంతో తల్లిదండ్రులు చుట్టు ప్రక్కల వెతికారు. ఆచూకి లభించక పోవడం తో నల్లగొండ టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ నాగరాజు వెంటనే రంగం లోకి దిగారు. జిల్లా శరత్ చంద్ర పవార్ కూడా బాలుని ఆచూకీ కోసం ఆరు పోలీస్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ టూ టౌన్ సీఐ రాఘవరావు పర్యవేక్షణలో బాలుడి ఆచూకీ కనుగొన్నారు. నల్లగొండ టూ టౌ౦ రావుల నాగరాజు తన సిబ్బంది సాగర్ల శంకర్, లావూరి బాలకోటి, జానకి రామ్‌తో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలోని టీవీ కెమెరాలు పరిశీలించి నేరస్థుడిని గుర్తించారు. నేరస్తున్ని పట్టుకుని విచారించగా అతని చిన్నమ్మ కూతు రు ముద్దముల అరుణకు ముగ్గురు కూతుర్లు జన్మించారని, మగ సంతానం లేకపోవడంతో ఆమె కోసం బాలుడిని కిడ్నాప్ చేసినట్టు ఒప్పుకున్నాడు. దాంతో పోలీసులు అరుణ నుంచి బాలుడిని తీసుకుని తల్లిదం డ్రులకు అప్పగించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ కావాలి

- అప్పుడే క్రీడాకారులకు అవకాశాలు



హైదరాబాద్, మార్చి7 (జనంసాక్షి) : ఓట్ల కోసం పథకాలు కాకుండా క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. అందుకు క్రీడా పాలసీని ప్రకటించాలి. మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేసేందుకు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం కనీసం ఇప్పటి నుంచయినా ప్రయత్నించాలి. బాల్యంలోనే క్రీడాంశాలపై మక్కువ కల్పించి ప్రత్యేక స్పోర్ట్స్ స్కూళ్లను తెలవాలి. అందుకు ఎంత ఖర్చయినా వెరవకుండా ముందుకు సాగాలి. ఇవాళ ఇంట్లో ప్రతి మగపిల్లాడికి బ్యాట్ పట్టడం తప్ప మరో క్రీడ తెలియకుండా పోతోంది. క్రికెట్ మాత్రమే కాదు.. బ్యాడ్మింటన్ సహా అనేక ఆటలు ఉన్నా యన్న సంగతి ముందుగా తెలియ చెప్పాలి. మన ఒకప్పుడు హాకీ క్రికెట్ కంటే మిన్నగా అభిమానుల ఆదరణకు నోచుకుంది కానీ.. తర్వాత భారత జట్టు ప్రదర్శన లాగే దానికున్న ఆదరణా పడిపోయింది. అది మన జాతీయ క్రీడ అయినా దానిని పక్కన పెట్టేశాం. హాకీతో పాటు మిగతా ఆటలన్నీ కూడా ఉన్నా వాటిని ఆదరించుకోవడం లేదు. నిరాదరణ కారణంగానే కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర క్రీడలన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రైవేట్ ప్రోత్సాహంతో సింధులాంటి వాళ్లు షటిల్ బ్యాడ్మింటన్ పట్టల మక్కువ పెంచుకోవడంతో ఇప్పుడు దీనికి ఆదరణ పెరగగలదు. గత కొన్నేళ్లలో బ్యాడ్మింటన్ అంచెలంచెలుగా ఎదిగి, ఆదరణ పెంచుకుని.. ఇప్పుడు దేశంలో లక్షల మంది ఆ ఆట ఆడేందుకు ముందుకొచ్చేలా.. కోట్ల మంది కీలక మ్యాచ్‌లను వీక్షించేలా చేయగలిగింది. ఇందులో పుల్లెల గోపీచంద్ పాత్ర అత్యంత కీలకం. బ్యాడ్మింటన్ బంగారు భవిష్యత్తుకు గట్టి పునాది వేశాడు గోపీచంద్. అతను నెలకొల్పిన అకాడమీ ఇప్పుడిప్పుడే వేళ్లూను కుంటోంది. దేశంలో బ్యాడ్మింటన్ ముఖచిత్రాన్నే మార్చేసిన ఘనత గోపీచంద్‌ది. ద్రోణాచార్య లాగా తర్ఫీదు ఇచ్చి మెరికల్లాంటి షటిలర్లను తయారు చేస్తున్నాడు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ గొప్ప పురోగతి సాధించింది. ఇప్పటికే ఆడేందుకు, చూసేందుకు మంచి ప్రత్యామ్నాయంగా మారిన బ్యాడ్మింటన్‌పై ఆసక్తి రెట్టింపవుతుందనడంలో సందేహం లేదు. అయితే ఈ స్ఫూర్తి కొనసాగాలంటే, మరిన్ని పతకాలు రావాలంటే ప్రభుత్వాల క్రీడా విధానాంలో మార్పుల రావాలి. కోచ్‌లను,క్రీడాకారులను ప్రోత్సహించాలి. అందుకే చైనా తరహాలో భారత్ ప్రభుత్వం కూడా క్రీడలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధంగా తయారవ్వాలి. సింధు మ్యాచ్‌లను చూసినప్పుడు కలిగిన అనుభూతి ఇప్పుడు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి నింపుతుందనడంలో సందేహం లేదు.

# ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది కేసీఆర్

- ఎమ్మెల్యే బాలు నాయక్
- బిజెపితో అంతర్గతంగా రాజీపడ్డ బిఆర్ఎస్
- పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపికి ఓటేసిన బిఆర్ఎస్
- త్వరలోనే బిఆర్ఎస్ పార్టీ కుప్పకూలుతుంది
- ఎమ్మెల్యే బాలు నాయక్



**కొండమల్లేపల్లి, మార్చి 7 (జనంసాక్షి) :** కేసుల భయంతో బీజేపీతో రాజీపడి కేసీఆర్ బిఆర్ఎస్ ను త్వరలో బిజెపిలో కలపడం ఖాయమని మాజీ మంత్రి కేటీఆర్ అహంకారపు మాటలు మానాలని ఇష్టం వచ్చినట్లు కాంగ్రెస్ పార్టీని దూషిస్తే ఊరుకునేది లేదని కేటీఆర్, హరీష్ రావులను ఎమ్మెల్యే బాలు నాయక్ హెచ్చరించారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో దశలవారీగా బిజెపి అభ్యర్థులను గెలిపిస్తున్న బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సరైంది కాదన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది కేసీఆర్, కేటీఆర్ అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. కేసీఆర్ కనీసం ఎస్ఎల్బీసీ ప్రాజెక్టుకు కరెంట్ బిల్లు చెల్లించలేదని విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ మాటలు పూర్తి అబద్దాలు, గ్లోబెల్స్ ప్రచారమేనని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ద్వారా 30 టీఎంసీల నీళ్లు వచ్చేవని కానీ బీఆర్ఎస్ హయాంలో పనులు పూర్తి చేయకుండా వదిలిపెట్టారని మండిపడ్డారు. ఆ పనులు పూర్తి చేసి ఉంటే నల్గొండలో నాలుగు లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేవని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్నిఅందరికీ చూడటానికి అనుమతిస్తున్నామని ఎవరినీ తమ ప్రభుత్వం అడ్డుకోవడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రెండు, మూడు నెలల్లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పున ప్రారంభిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కోసం రూ. 27,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరాకు కూడా నీరందించలేదని ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీకి కరెంట్ కట్ చేస్తే డీ ఓటరింగ్ చేయలేక పనులు ఆగిపోయాయని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల కోసం అత్యంత నిపుణులు కలిగిన 11 ఏజెన్సీలను తీసుకువచ్చి సమర్థవంతంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. కేటీఆర్ చెప్పిన మాటలు అబద్ధాలు అని ఆ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. వారివెంట మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఏ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహా, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పెద్దిశెట్టి సుధాకర్, సయ్యద్ దస్తగిర్, ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మాజీ జడ్పిటిసి సలహాదారులు పసునూరి యుగేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎంఏ కైసర్ ఖాన్, మాజీ ఎంపిపిలు మేకల శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, బిక్కు నాయక్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయిని సుభాష్ రెడ్డి, నీలా లక్ష్మయ్య, గౌరు గోపాల్, సిపిఐ నాయకులు సుదర్శన్ రెడ్డి, గంధం సురేష్, నీలం శ్రీనివాస్ యాదవ్, లాలు నాయక్, కోట్ల జగదీశ్ పటేల్, నారాయణ యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నేర్చుకోవాలన్న తపనతో ముందుకు సాగండి





- ఎస్పీ రోహిత్ రాజు

**చర్ల, మార్చి 7 (జనం సాక్షి) :** నేర్చుకోవాలని తపన ఉంటే ఎంతటి స్థాయికి అయినా వెళ్ళొచ్చని ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. చర్ల పోలీస్ స్టేషన్లో శుక్రవారం సాయంత్రం జరిగిన వాలీబాల్ పోటీల ముగింపులో ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ తో కలిసి ఆయన ప్రసంగించారు. మన్యంలో మెరికల్లాలాంటి క్రీడాకారులు ఉన్నారన్నారు. జీవితంలో గెలుపోటములు సహజమన్నారు. చదువులు, క్రీడల్లో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలన్నారు. చేసే పనిలో ఎంజాయ్ చేసే సత్తా ఉంటే భవిష్యత్తులో అనుకున్న లక్ష్యాలను సిద్ధించగలుగుతారన్నారు. ఛత్తీస్గఢ్లోని మారుమూల ప్రాంతాల నుంచి సైతం వచ్చి ఇక్కడ పోటీలో పాల్గొనడం వారి క్రీడా స్ఫూర్తికి నిదర్శనం అన్నారు. సరిహద్దు దండకారణ్యంలోని పెదవుట్లపల్లి నుంచి ఇద్దరు నేషనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన యువకులు ఉండటం ఎంతో స్ఫూర్తిదాయకాన్ని ఇస్తుందన్నారు. క్రీడల్లో ఎలా అయితే రాణిస్తున్నారో.. చదువులోనూ పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి బాటలు వేయటంతో పాటు వారికి ఎలాంటి సాయం అందించాలన్న జిల్లా పోలీస్‌శాఖ ముందుంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. మారుమూల గ్రామాల్లో రోడ్ల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల ఏర్పాటులో పోలీస్ శాఖ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. మావోయిస్టులకు ఎలాంటి పరిస్థితుల్లో సహకరించవద్దన్నారు. ఆదివాసీ ప్రజల్లో మావోయిస్టు పార్టీ ఆదరణ కోల్పోయింది అన్నారు. ఈ పోటీల్లో 59 టీములు పాల్గొన్నారు. ప్రథమ విజేతగా చీమలపాడు ద్వితీయ విజేతగా సుందరయ్య కాలనీ, తృతీయ విజేతగా మామిడిగూడెం, నాలుగో స్థానాన్ని ఛత్తీస్గఢ్‌కి చెందిన పెదవుట్లపాడు జట్టు విజయాన్ని సాధించాయి. ప్రజల అభివృద్ధిలో పోలీసుల భాగస్వామ్యం తప్పక ఉంటుందన్నారు. యువత క్రమశిక్షణతో ముందుకు సాగడం ద్వారా భవిష్యత్తులో వారు ఆశించిన విజయాలను సాధించుకోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా పోటీలో గెలుపొందిన వారికి నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. సిఆర్పిఎఫ్ 141 అసిస్టెంట్ కమాండెంట్ రాజకుమార్, సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా నూతన ఎస్పీగా పారితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 7 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా ఎస్పీగా పారితోష్ పంకజ్ బదిలీ పై వచ్చారు. ఇంతకు ముందు ఎస్పీగా పనిచేసిన చెన్నూరి రూపేష్ తెలంగాణ ఏంటి నార్కోటి బ్యూరో హైదరాబాద్ కు బదిలీ కాగా సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

## రేవల్లిలో బంగారం, వెండి దొంగతనం

**రేవల్లి, మార్చి 07 (జనంసాక్షి) :** దర్గాను దర్శించుకుని వచ్చేలోపే, ఇంట్లో ఉన్న సొమ్ముని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. ఈ ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలం కేంద్రంలోని చోటుచేసుకుంది. ఎస్ఐ వివరాల్లోకెళ్తే.. మండల కేంద్రానికి చెందిన అన్నలదాసు లక్ష్మి (50) మాసయ్య దంపతులకు ముగ్గురు కూతుర్లున్నారు. పెద్దకూతురు వివాహం జరిగింది, మిగతా ఇద్దరు కూతుర్లు హైదరాబాదులో చదువుతున్నారు. దంపతులిద్దరూ ఇంటి దగ్గరే కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం 6న భర్త తెల్కపల్లిలోని తనబంధువుల పెండ్లికి వెళ్లారు. బాధితురాలు రేమద్దుల గ్రామంలోని ముస్లిం దర్గాను దర్శించుకోవడానికి వెళ్ళి, సాయంత్రం అందాజ 4గంటల సమయంలో ఇంటిదగ్గర నానబెట్టిన దుస్తులు ఉతుకుతుండగా, ఇంటి ముందున్న తప్పెట కిష్టమ్మ వచ్చి, ఇంటికి తాళం వేయకుండా ఎక్కడేళ్లారని అడగడంతో కంగుతిన్న లక్ష్మి, వెళ్లి చూసేసరికి ఇంట్లో ఉన్న బీరువాలో మూడుమాసాల బంగారం, 35 తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్లోని బాధితురాలు శనివారం ఇంటితాళం వేసి ఎప్పటిలాగే బాత్రూంలోని తాళంచేయి పెట్టేవారని, ఇదంతా తెలిసిన వారే చేసిఉండొచ్చని అనుమానంతో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వనపర్తి నుండి డాగ్ స్క్వాడ్ పిలిపించడం జరిగింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

## 70 అడుగుల మావోయిస్టుల స్మారక స్థూపాన్ని కూల్చివేసిన భద్రత బలగాలు

**చర్ల, మార్చి 7 (జనం సాక్షి) :** చత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల 70 అడుగుల స్మారక స్థూపాన్ని భద్రత బలగాలు శుక్రవారం నేలమట్టం చేశాయి. జిల్లాలోని పూజారికాంకేరు బేస్ క్యాంప్ నుంచి నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ కోసం వెళ్లిన బలగాలు సమీప తాబేలు బట్టి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు గతంలో ఏర్పాటు చేసిన 70 అడుగుల స్మారక స్థూపాన్ని నేలమట్టం చేశాయి. అక్కడ అడవుల్లో భద్రత బలగాలు మావోయిస్టుల వేటను కొనసాగిస్తున్నాయి.
ఉసురు పోలీస్ స్టేషన్ పరిధిలోని మావోయిస్టు బెటాలియన్ కీలక ప్రాంతమైన పూజారు కాంకేర్ లో ఇటీవల సిఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో బేస్ క్యాంపును భద్రతా బలగాలు ఏర్పాటు చేశాయి. అనంతరం సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, కోబ్రా బలగాలు నిత్యం మావోయిస్టుల కోసం ఇక్కడ అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ కొనసాగిస్తున్నాయి.

# ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి

- ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుని అర్జున్ అవార్డు గ్రహీత గుత్తా జ్వాల



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 7 (జనం సాక్షి) :** మహిళలను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ప్రముఖ బ్యాట్మెంటన్ క్రీడాకారిని, అర్జున అవార్డు గ్రహీత గుత్తాజ్వాల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లో టీజీఓ జిల్లా కమిటీ, మహిళా, శిశు, దివ్యాంగ వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సమావేశానికి ప్రముఖ బ్యాట్మెంటన్ క్రీడాకారిని, అర్జున అవార్డు గ్రహీత గుత్తా జ్వాల ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ... మహిళలు సమాజం పట్ల అవగాహనతోపాటు తమ హక్కులపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... నా జీవితంలో మొదటి గురువు తన తల్లి అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి, వైస్ చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన వారిలో కలెక్టర్ సిసి నరేందర్, డిపిఆర్ఓ సిబ్బంది సతీష్ కుమార్ లతో పాటుగా వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు. బొమ్మారాస్ పేట్ ఆశ్రమ పాఠశాల మహిళల ఉపాధ్యాయులు చేసిన బంజార నృత్యం, భరత నాట్యం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. మహిళా దినోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, సిడబ్ల్యూసి చైర్ పర్సన్ వెంకటేష్, డిపిఓ జయసుధ, డిపిఆర్ఓ చెన్నమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నల్లమల్ల నుంచి భారీగా అక్రమ రేషన్ బియ్యం దందా

- ప్రతినెల వేల క్వింటాళ్ల యదేచ్ఛగా సరఫరా
- అచ్చంపేటలో తెల్లవారుజామున పట్టుబడ్డ రేషన్ బియ్యం



**అచ్చంపేట, మార్చి 7 (జనంసాక్షి) :** అచ్చంపేట నియోజకవర్గంలో యదేచ్ఛగా రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు అనే చందంగా అంతా సాఫీగా కొనసాగుతుంది. గత కొంతకాలంగా ఈ దందా అడ్డు అదుపు లేకుండా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు రెవెన్యూ పోలీస్ శాఖ చూసి చూడనట్టుగా చేతులు తడుపుకొని వదిలేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ నేపథ్యంలో అప్పుడప్పుడు ఒకటి రెండు కేసులు నమోదు అవుతుంటాయి కానీ ఈ దందాకు అసలు మూల సూత్రధారి మాత్రం చేతికి ఏమాత్రం తన అనుచర గణాన్ని ముందుకు నడిపించి కేసులు వారిపైనే అయ్యేవిధంగా అంతా సాఫీగా కొనసాగుతుంది. సరిగ్గా మూడు నెలల క్రితం అంతే కదా అచ్చంపేట పట్టణంలోని ఒక ఇంట్లో దాదాపు 30 కింటాల బియ్యం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వారం పది రోజులు కొంత స్తబ్దతగా ఉన్న వ్యాపారం తిరిగి యధావిధిగా అక్రమ బియ్యం దందా కొనసాగుతూనే ఉన్నది. తిరిగి మరోసారి అచ్చంపేట పట్టణంలో గాంధీ వీధి పాత బజారు ఒక రేషన్ షాపు నుండి 26 బస్తాల బియ్యాన్ని ఒక బులెరా వాహనంలో శుక్రవారం తెల్లవారుజామున తరలిస్తున్న విషయం పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే పోలీసులు అక్కడ చేరుకొని వారిని అదుపులోకి తీసుకొని తెలకపల్లి ప్రాంతానికి చెందిన శ్రీకాంత్, బల్మూరు మండలంలోని తుమ్మనిపేట గ్రామానికి చెందిన ఉస్మాన్ పాషాల కేసు నమోదు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ ఫోను ద్వారా తెలిపారు.

## మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



**శివ్వంపేట, మార్చి 7 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం శివ్వంపేటలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా 2025 జనవరి 1 నుండి వేతనాలు చెల్లిస్తామని ప్రకటించిన విధంగా వేతనాలు ఇవ్వాలని, అలాగే ఎస్టీవోలతో నిలిచిపోయిన బకాయి వేతనాలు విడుదల చేయాలన్నారు. అదేవిధంగా పంచాయతీల బ్యాంక్ ఖాతా పై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా, పిఎఫ్, ఈఎస్ఐ సౌకార్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారంతా కలిసి మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డికి డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామి, వసంత, బాలకృష్ణ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## భవన కార్మికులు వలస బాట



**బిజినేపల్లి, మార్చి 7 (జనం సాక్షి) :** నిర్మాణ పనులు ఎక్కడికి అక్కడ నిలిచిపోవడంతో పని లేక పుటకడవక భవన కార్మికులు వలస బాట పట్టారని భవన నిర్మాణ కార్మికుల సంఘం సోప్పరి బాలస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పాలెంలోని భవన నిర్మాణ కార్మిక గ్రామ సంఘ సభ్యులతో కలిసి శుక్రవారం ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. గ్రామాలలో ఇసుక సరఫరా లేకపోవడంతో నిర్మాణ పనులను యజమానులు ఎక్కడికక్కడ నిలిపి వేసుకున్నారు. దీంతో పని లేక పూట గడవక హైదరాబాద్ కు వలస వెళుతున్నారని తెలిపారు. ఇంటి నిర్మాణం చేస్తున్న యజమానులు సైతం ఇసుక లేక లక్షలు పెట్టుబడి పెట్టి సామాగ్రి తెచ్చి వృధాగా పెట్టుకున్నట్లు వాపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు ఇసుక రవాణాపై ఆంక్షలు ఎత్తేసి ఇసుక సరఫరా చేబడితే కార్మికులకు యజమానులకు మేలు జరుగుతుందని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద కుర్మయ్య, గోవర్ధన్ గౌడ్, గోపాల్, చెన్నయ్య, నరసింహ తదితరులు ఉన్నారు.

# ప్రజా పాలనలో తీరని రైతుల కష్టాలు

- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి
- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల మహా రాస్తారోకో..



**సూర్యపేట ప్రతినిధి, మార్చి 7 (జనంసాక్షి) :** ప్రజా పాలనలో ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని గొప్పలు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం రైతుల కష్టాలు తీర్చడంలో విఫలమైందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి విమర్శించారు. ఈరోజు సూర్యాపేట దంతాలపల్లి రహదారిపై ఆత్మకూరు(ఎస్) మండలంలోని నంద్యాల గూడెం స్టేజి ఎస్సారెస్పీ కాలువ వద్ద శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో వరిగంటలు చేత పట్టుకొని గంటన్నర పాటు భారీ రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంట పొలాలు కాపాడటానికి పూర్తిస్థాయిలో ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటి విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. చివరి భూములకు నీళ్లు అందకపోవడంతో రైతులు వేసిన పంట పొలాలు పూర్తిస్థాయిలో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోతున్న పంట పొలాలను రక్షించుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారని అన్నారు. ప్రతి మండలం నుండి సుమారు 700 నుండి వేయి ఎకరాల వరకు పంట పొలాలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. వరి పొలాలు పొట్ట దశలో ఉండి పంట చేతికొచ్చే సందర్భంలో నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే రైతుల గుండెలు తరుక్కుపోతున్నాయని తెలిపారు. ఒకపక్క భూగర్భ జలాలు అడుగంటిపోయి బావులు,బోర్లలో నీళు సక్రమంగా రాక మరోపక్క ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటి విడుదల లేక రైతాంగం తీవ్ర ఆందోళనలు పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇటీవల కాలంలో రైతాంగం రోడ్ల మీదికి వచ్చి ఎస్సారెస్పీ కాలువ ద్వారా పూర్తిస్థాయి నీళ్లు విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని ధర్నాలు రాసారోకోలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం గానీ ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులుగాని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. సూర్యాపేట జిల్లాలో ఉన్నటువంటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి నీటి విడుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో తుంగతుర్తి సూర్యాపేట నియోజకవర్గంలోని మండలాలకు నీటి విడుదల లేక రైతాంగం సతమతం అవుతున్నారని వెంటనే అధికార పార్టీ శాసనసభ్యులు చొరవ తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ నీటిపారుదల శాఖ అధికారులు నీటి విడుదల కోసం ప్రణాళిక రూపొందించి రైతుల పంట పొలాలు కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంట పొలాలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో సర్వే నిర్వహించి ప్రతి ఎకరానికి 30 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకటరెడ్డి రైతు సంఘం జిల్లా నాయకులు అవిరే అప్పయ్య, నాయకులు గుండు చిన్న లింగయ్య ,రాచకొండ సైదులు, మూల విజయ రెడ్డి ,రైతులు గుండు వెంకన్న గుండు రమేష్ కేశబోయిన మల్ల య్య, రామయ్య, ముదిరెడ్డి జానకి రెడ్డి ,కంచర్ల ఉపేందర్ రెడ్డి, గుగులోతు నాగు, బానోతు లింగయ్య, ఆవుల గురవయ్య, నంద్యాల నరేష్ రెడ్డి, నంద్యాల వెంకటరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# ఇటుక బట్టీలు వద్దని రోడ్డెక్కిన గ్రామస్తులు

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఇటుక బట్టీలు
- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం
- పట్టించుకోని అధికారులు



**చింతపల్లి, మార్చి 7 (జనం సాక్షి) :** చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామంలో సుమారు 200 ఎకరాల్లో గ్రామం చుట్టుముట్టు ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడం వల్ల దానివలన గ్రామంలో ఇటుక బట్టీలు తయారు చేయడానికి ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. కాని నసర్లపల్లి గ్రామంలో నిర్వాహకులు ఏ ఒక్క నిబంధన కూడా పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపణలు చేస్తూ జూలై 4న అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే 6న ఇటుక బట్టీలు తయారు చేసే ప్రాంతానికి వెళ్లిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుకల తయారీని వెంటనే నిలిపివేయాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ మరుసటి రోజు నుంచి వాళ్ళ పనిని కొనసాగిస్తున్నారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా పెట్టిన ఇటుక బట్టీల తయారీదారులపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. కానీ రెండు నెలల క్రితం అధికారులు స్వయంగా పర్యవేక్షించినప్పటికీ బట్టీల యజమానులపై చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంటే అంతర్గతంగా అధికారులకు ఇటుకబట్టీ నిర్వాహకులకు ఒప్పందం కుదిరినట్లు విమర్శలు గ్రామస్తులు నుంచి వినిపిస్తున్నాయి. అనారోగ్య సమస్యలు అనేవి ఏర్పడినవి చిన్నపిల్లలకు, వృద్ధులకు, గర్భిణీ స్త్రీలకు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ బారిన పడటం అనేది జరుగుతుంది. గ్రామపంచాయతీ నుంచి ఎటువంటి పర్మిషన్ లేనందున వాటిని తీసివేయాలని పలుమార్లు గ్రామపంచాయతీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు ఎమ్మార్వో, ఎంపీడీవో, ఆర్డీవో, కలెక్టర్, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు, నాటు సారా గ్రామ ప్రజలకు ఓపిక నశించి హైదరాబాద్ నాగార్జున రహదారిపై గ్రామ పెద్దలు యువకులు కలిసి పెద్దఎత్తున రోడ్డుపై ధర్నా చేశారు,, సుమారు గంటసేపటి తర్వాత ఉద్రిక్తత నెలకొనడంతో వాహనాలకు ఇబ్బంది కావడంతో, పోలీసులు, ఎమ్మార్వో విచ్చేసి వచ్చే మంగళవారం రోజున ఏడి మైనింగ్, పొల్యూషన్ బోర్డ్, లేబర్ డిపార్ట్మెంట్, తెలియజేస్తామని తెలిపారు, మళ్లీ స్పందించకపోతే ఇంకా పెద్ద ఎత్తున ధర్నా చేయడం అనేది జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుమతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గుండ్లపల్లి వెంకటయ్య, నల్ల శ్రీకాంత్ జాంభవ్, నల్ల వెంకటయ్య, తోడేటి రవి, శ్రీశైలం, డీలర్ వెంకటయ్య, రాసిక శివ, రాసిక విష్ణు, నల్ల వెంకటరమణ, కోడిదల వెంకటయ్య, డబ్బా కొట్టు ఆంజనేయులు, నల్ల అంజయ్య, ఎలిమినేట్ శేఖర్, నల్ల శ్రీను, ఆదినారాయణ, శిరముని రాజు, షేక్ నజీర్, షేక్ అబ్బాస్, వేణు, శ్రీకాంత్ ఎలిమినేటి సైదులు, పల్లె మొగులను, నల్ల సైదులు, నల్ల రమేష్, నల్ల మధు, నీలం గణేష్,తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సమస్తం నీవే..
# మహిళా సాధికారిత..!



మహిళల సంఘటిత పోరాటాలకు, హక్కుల సాధనకు అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రతి ఏటా మార్చి 8వ తేదీన ఘనంగా నిర్వహించుకుంటున్నాం. దేశంలో మహిళలు శక్తి వంతంగా ఎదగక పోవడానికి రాజకీయ సాధికారత శూన్యం అనే భావన ప్రగతిశీల మహిళాలోకం అసంతృప్తితో రగులుతుంది. రాజకీయ సాధికారిత అనేది ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో మహిళలకు లింగ సమానత్వం కోసం ఉత్తమ మద్దతునిచ్చే విధానంగా గుర్తించడం లేదు. ప్రభుత్వాలు విధాన రూపకల్పనలో, పార్లమెంటు స్థానాల్లో మహిళల సంఖ్యకు కోటా ఉన్న నిశ్చయాత్మక కార్యాచరణ రూపొందించినప్పటికీ, మోడీ ప్రభుత్వం మహిళా బిల్లు తెచ్చి 2029 వరకు ఫలాలు అందకుండా కట్టడి చేయడం పితృస్వామ్య పీడనగా భావించాలి. 2017 నాటికి, తక్కువ, సింగిల్ హౌస్ పార్లమెంట్ స్థానాలను కలిగి ఉన్న మహిళల ప్రాతినిధ్యం ప్రపంచ సగటు 23.6 శాతం. మహిళల ఓటు హక్కులు , వాయిస్ అభిప్రాయాలు, ఎన్నికయ్యే సరసమైన అవకాశంతో పదవికి పోటీ చేసే సామర్థ్యాన్ని పెంచడానికి మరిన్ని సిఫార్సులు చేయబడ్డాయి. మహిళలు అంటే పిల్లల సంరక్షణ, గృహ బాధ్యతలు అనే భావం విడనాడలేదు.కాబట్టి, వారు కార్మిక మార్కెట్లోకి ప్రవేశించడానికి, వారి వ్యాపారాలను నిర్వహించడానికి అంతంత మాత్రం అవకాశాలు దక్కినా, చట్ట సభల్లోకి రావాలని ఉత్సాహం చూపుతున్న మహిళలు రాజకీయ రంగానికి దూరం కావడం తప్పడం లేదు. ఆయా స్వేచ్ఛ ఉన్న ఇంటిలో సైతం తనను తాను ఎంచుకునే సామర్థ్యం కలిగి పురుషాధిక్యత సమాజం వెసలుబాటు ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న చాలా మంది పురుషులు మహిళలకు అన్యాయం చేసే సామాజిక నిబంధనలను భంగపరచడానికి వెనుకాడతారనే విమర్శ ఉంది.

పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలలో ప్రతి వ్యక్తీ ఏదోఒక పని చేస్తే తప్ప కుటుంబం గడవని అనివార్య పరిస్థితుల్లో మహిళలందరూ మనుగడ కోసం వివిధరకాల శ్రమలు, ఉద్యోగాలు చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో, వివిధ పరిశ్రమల్లో, షాపింగ్ మాల్స్ లో, ప్రభుత్వ రంగంలోని వివిధ విభాగాల్లో, విద్య, వైద్యం వంటి సేవా రంగాల్లో, ఐటీ రంగంలో వివిధ స్థాయిల్లో వారు పనిచేస్తున్నారు. మెజారిటీ శ్రామిక మహిళలు ఎలాంటి హక్కులూ లేని, దోపిడీ, పీడనలతో నిండిన అసంఘటిత రంగంలో అతి తక్కువ వేతనాలతో, శ్రమదోపిడీకి గురవుతూ వెట్టిచాకిరీ చేస్తున్నారు. ఉద్యోగము, కుటుంబ బాధ్యతల్ని సమన్వయం చేసుకోవడంలో నిత్యం శారీరక, మానసిక ఒత్తిడి, సంఘర్షణల్లో జీవిస్తున్నారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేసే మహిళల నుండి ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేసే మహిళలదాకా పనిప్రదేశాల్లో తీవ్రమైన వివక్షకు, లైంగిక వేధింపులకు, హింసాత్మక లైంగికదాడులకు నిత్యం గురవుతున్నారు.వివిధ రంగాల్లో మహిళలు అత్యున్నత శిఖరాలను అధిరోహించారని, సాధికారత సాధించారని గొప్పలు చెబుతూ, కోట్లాదిమంది మహిళల కఠోర వాస్తవ జీవన పరిస్థితులను మరుగున పడేస్తున్నారు. మహిళా సాధికారత, సమానత్వానికి సంబంధించిన అనేక అడ్డంకులు సాంస్కృతిక ప్రమాణాల ఫలితం.లింగ అసమానత వల్ల ఎదురయ్యే సమస్యల గురించి చాలా మంది మహిళలు తెలుసుకుంటే, మరికొందరు మాత్రం దానికి అడ్డుపడ్డారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే రాజకీయ పార్టీల ప్రయోజనాల కోసం పాలకులు చేస్తున్న ఆర్థిక,రాజకీయ,సాంస్కృతిక విధ్వంసం మహిళల జీవితాలను రోజురోజుకి మరింత సంక్లిష్టం చేస్తూ,దుర్భర స్థితిలోకి నెడుతున్నాయి.స్వేచ్ఛగా ,ఆత్మగౌరవంతో జీవించాలన్న తపస్సుకు భంగం కల్గిస్తున్నాయి.మహిళా బిల్లు తెచ్చినా స్పష్టత లేక,రిజర్వేషన్లు ఖరారు కాక అట్టడుగు వర్గాల మహిళలు రాజకీయ సాధికారిత సాధించాలంటే సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు దేశంలో అగ్రగామిగా నిలచిన మహిళా స్వయం సహాయక సంఘాలు కొన్నేళ్లుగా ప్రభుత్వ అలసత్వం,నిధుల కొరత కారణంగా కుంటుపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా రేవంత్ ప్రభుత్వం 63 లక్షల మంది మహిళలను విజయవంతమైన వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ధ్యేయంతో ఇందిరా మహిళాశక్తి పథకానికి రూపకల్పన చేసింది. గత ప్రభుత్వాలు డ్వాక్రా మహిళలకు అందించిన ప్రోత్సాహం కన్నా మరిన్ని రెట్లు ఎక్కువగా మహిళలను ప్రోత్సహించి,ఆర్థిక సాధికారిత కల్పించేందుకు చర్యలు తీసుకున్నది.ఈ పథకం ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా తీర్చి దిద్దాలని కంకణం కట్టుకున్నది. అర్హత గల మహిళలకు వ్యాపార అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తోంది.మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ఉమ్మడి ప్రాసెసింగ్ కేంద్రాలతో పాటు, ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక చిన్న తరహా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయడం ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఏటా 5,000 గ్రామీణ సంఘాలు లేదా ప్రాంతీయ స్థాయి సమాఖ్యలకు లబ్ది చేకూరే విధంగా కార్యాచరణ ఖరారు చేసింది.వచ్చే ఐదు సంవత్సరాలలో లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందించేందుకు ఇప్పటికే బ్యాంకర్లకు ప్రభుత్వం దిశా నిర్దేశం చేసింది. ఈ దిశగా బ్యాంకులు కూడా మహిళా సంఘాలను ప్రోత్సహించాలని తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది.ఈ నిధులు మైక్రో, స్మాల్ ఇండిస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు సహాయపడి మహిళలు పారిశ్రామికవేత్తల స్థాయికి ఎదిగేందుకు దోహదపడుతుందని స్పష్టత ఇచ్చింది.రాబోయే ఐదు సంవత్సరాల్లో 25,000 సంస్థలకు వీటిని విస్తరింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్షంగా పెట్టుకుంది.దేశ వ్యాప్తంగా మహిళా శక్తి, సాధికారితకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చూస్తున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒక అడుగు ముందుకేసి మహిళా సాధికారితకు పెద్ద పీట వేస్తోంది.స్త్రీ ఎక్కడ గౌరవించబ డుతుందో ఆ రాష్ట్రం పరిఢవిల్లు తుందంటే అతిశయోక్తి కాదు.



డాక్టర్ సంగని మల్లేశ్వర్,
విభాగాధిపతి, జర్నలిజం శాఖ,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
సెల్ : 9866255355

# ఉత్పత్తి, రక్షణ సాంకేతికతలో ఆస్ట్రేలియాతో ముందడుగు



## ఆస్ట్రేలియా కంపెనీల ప్రతినిధులతో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

(ప్రత్యేక ప్రతినిధి/జనంసాక్షి)

బొగ్గు మైనింగ్ లో అధికోత్పత్తి, యంత్రాలు, ఆధునిక రక్షణ సాంకేతికతలో ఆస్ట్రేలియా కంపెనీలతో ముందడుగు వేస్తామని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో శుక్రవారం సాయంత్రం జరిగిన 13 ఆస్ట్రేలియా కంపెనీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ రానున్న కాలంలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని, కనుక భారీ ఖనిజ ఉత్పత్తి యంత్రాలను, అత్యాధునిక రక్షణ, భద్రత వ్యవస్థలను సింగరేణి సమకూర్చుకునే ఉద్దేశంతో ఉందన్నారు. అలాగే సోలార్ విద్యుత్తు ఉత్పాదనను కంపెనీ భారీగా పెంచే ఆలోచన చేస్తుందని, విద్యుత్తును నిల్వ ఉంచుకునే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంలకు కూడా తమ వద్ద అవకాశం ఉంటుంది అన్నారు. ఇంకా సింగరేణి సంస్థ చేపట్టనున్న పలు వ్యాపార విస్తరణ చర్యలను కూడా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ వ్యాపార విస్తరణ చర్యలకు అవసరమైన యంత్రాలు, వ్యవస్థల ఏర్పాటుకు ఆస్ట్రేలియన్ కంపెనీలు సహకరించవచ్చని సూచించారు. ఆస్ట్రేలియా కంపెనీల ఉత్పత్తులను పరిశీలించి మేలైన, లాభదాయకమైన వాటికి అవకాశం ఇవ్వటం జరుగుతుందన్నారు.

లాంగ్ వాల్ టెక్నాలజీ, ఇతర సాంకేతికతల్లో, ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓబీ బొగ్గు తవ్వకాన్ని మరింత సమర్థంగా

నిర్వహించేందుకు, ఉత్పాదకత పెంచేందుకు అవకాశం ఉన్న యంత్ర పరిజ్ఞానం అవసరమై ఉందన్నారు అలాగే మెరుగైన దంపుల భద్రత, సమాచార వ్యవస్థలకు కూడా తమ వద్ద అవకాశం ఉందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ విదేశాల్లో ఖనిజాల ఉత్పత్తికి సిద్ధంగా ఉందని, ముఖ్యంగా కీలక ఖనిజాలను ఉత్పత్తి చేయడానికి లాభసాటి భాగస్వామ్యాన్ని సింగరేణి కోరుకుంటుందని తెలియజేశారు. ఆస్ట్రేలియా దేశం నుంచి విచ్చేసిన 13 కంపెనీల ప్రతినిధులు తమ తమ ఉత్పత్తులను సాంకేతికతలను గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సింగరేణి సంస్థ తరఫున సీఎండీ ఎన్.బలరామ్ తో పాటు డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (పిఅండ్ పి) కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్, జీఎం కో-ఆర్డినేషన్ ఎస్డిఎం సుభాని, జీఎం (సిపిపి) మనోహర్, ఒరిసెంట్, విల్సన్ మైనింగ్ సర్వీసెస్, మైన్సైట్, డీటీఎన్ ఏసియా పసిఫిక్, ఆర్ఎం ఈ గ్లోబల్, మినరల్ టెక్నాలజీస్, తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.




## పని ప్రదేశాలలో లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు

### ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఉత్సవాలు

వనపర్తి క్రైమ్ మార్చి 07(జనంసాక్షి)

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి లోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎమ్మార్ సునీత మాట్లాడుతూ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.మహిళలు అన్ని రంగాలలో అత్యున్నతమైన స్థానంలో ఉండాలని కోరారు. మహిళలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచిత న్యాయ సేవలు అందిస్తుంది అని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వీ రజని మాట్లాడుతూ మహిళా హక్కులు చట్టాల గురించి వివరించారు.పని ప్రదేశాలలో మహిళలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రైవేటు ప్రభుత్వ ఇతర కార్యాలయాల్లో కచ్చితంగా నలుగురితో కూడిన ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. నలుగురిలో ఇద్దరు మహిళలు ఉండాలని ఈ కమిటీలో సంస్థలోని సీనియర్ మహిళ ప్రిసైడింగ్ ఆఫీసర్ గా నియమించబడుతారు ఏ మహిళ అయినా లైంగికంగా వేధించబడితే ఈ కమిటీలో ఫిర్యాదు చేస్తే నిజానిజాలు పరిశీలించి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటుందన్నారు. బాధితురాలు యొక్క సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు, పని ప్రదేశాలలో లైంగికంగా వేధించబడిన మహిళలు ధైర్యంగా కార్యాలయంలో ఉన్న ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలలో ఫిర్యాదులు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కే కవిత, బి రవికుమార్,వై జానకి బి శ్రీలత పాల్గొన్నారు.

## సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం

రంగారెడ్డి (జనంసాక్షి) :



మహిళలు అన్ని రంగాలలో సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మార్పు అనేది ఇంటి నుండే ప్రారంభం కావాలని అన్నారు. విశ్వంలో చాలా గ్రహాలు ఉన్నాయని, భూమి పైన మాత్రమే ప్రాణం ఉన్న జీవులు జీవిస్తున్నాయని, అందులో మానవ జీవితం చాలా ఉత్తమమైందని తెలిపారు.

# రాష్ట్రంలో బీజేపీనే ప్రత్యామ్నాయం

బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ

నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి)



రాష్ట్రంలో ఇప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకత మొదలైందని రానున్నది రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వమే నని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ అన్నారు.శుక్రవారం మారికల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నామాజీ బిజెపి సీనియర్ నాయకులు నర్సన్ గౌడ్ తో కలిసి మాట్లాడుతు రాష్ట్రంలో జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో బిజెపిని గెలిపించారనిఅన్నారు. ఉపాధ్యాయులు ,యువకులు బిజెపి వైపు నిలబడ్డారనీ అన్నారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బిజెపి అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం అనిర్వచనీయం అన్నారు.అదిలాబాద్,నిజామాబాద్,మెదక్,కరీంనగర్ 4 ఉమ్మడి జిల్లాలు 44 అసెంబ్లీ నియోజకవర్గాలలో 254000 గ్రాడ్యుయేట్లు ఓట్లేయగా 56 మంది అభ్యర్థులు పోటీపడితే బిజెపి అభ్యర్థిపై అనేక ఫేక్ న్యూస్ ప్రచారం చేశారన్నారు.కాంగ్రెస్ అభ్యర్థి కొరకు ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు తీవ్రంగ ప్రయత్నం చేశారనీ, వామపక్షాలు అధికారపక్షానికి మద్దతు ఇచ్చినా. బిఎస్పి అభ్యర్థికి బిఆర్ఎస్ మద్దతు ఇచ్చినా పోరాడి గెలిచిన బిజెపి శ్రేణులను నడిపిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్ కు అభినందనలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు.ఈ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టినా పట్టభద్రులు,ఉపాధ్యాయులు ,యువకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వం మోసానికి ప్రతీకారం తీర్చుకున్నారనీ అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ

పథకాలకు ప్రజలకు అందరికీ అందుతున్నాయని అన్నారు. బిజెపి చెప్పిందే చేస్తుందని ప్రజలు దేశవ్యాప్తంగా విశ్వసిస్తూ బిజెపిని ఆదరిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు వేణు గోపాల్,భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# సమానత్వం కోసం సాగిన సమరమే మహిళా దినోత్సవం



## కెవిపిఎస్ మహిళా కన్వీనర్ బాలమణి

### మనువాదం - దళిత మహిళల హక్కులు అంశంపై సెమినార్

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,మార్చి7(జనంసాక్షి):

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో రైతు సంఘం కార్యాలయంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.మహిళలకు శాలువాలు కప్పి సన్మానాలు సత్కరించడం జరిగింది.ఈ సందర్భంగా కె వి పి ఎస్ మహిళా కన్వీనర్ బాలమణి మాట్లాడుతూ మహిళా దినోత్సవం అంటే కేవలం సంబరం మాత్రమే కాదు అది సమానత్వం కోసం సాగిన సమరమే ఉమెన్స్ డే గా గుర్తించాలని అన్నారు.పని గంటలు తగ్గాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని ప్రదేశాల్లో మహిళలలకు భద్రత కల్పించాలని అంతర్జాతీయంగా మహిళలోకం గర్జించిన రోజు అని, అది మహిళ మహోజ్వల పోరాట దినం అని అన్నారు.ఆ మహిళా ఉద్యమానికి జర్మనీదేశానికి చెందిన వీరనారి క్లారా జెట్కిన్ నాయకత్వం వహించారని తెలిపారు. 1910 మార్చి 8న న్యూయార్క్ లో జరిగిన ఇంటర్నేషనల్ ఉమెన్స్ కన్వెన్షన్ తమను మనుషులుగా గుర్తించాలని తమ పనికి తగిన వేతనం ఇవ్వాలని పని గంటలు తగ్గాలని సుమారు 130 దేశాలను ఆహ్వానించి ఆమె నాయకత్వంలో ఏర్పడిన సమావేశ దినమే ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే అని వివరించారు. సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు సాటి మనిషిగా గౌరవం దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మతాలన్నీ మహిళను మనిషిగా గుర్తించలేదని,వంటింటి కుందేలుగా మార్చాయని ,ద్వితీయశ్రేణి పౌరురాలుగా మార్చాయని ఘాటుగా వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కందికొండ గీత రాణి,స్వాతి, బాలమణి, పద్మ, శైలజ,

కురువమ్మ, లక్ష్మమ్మ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పట్ల దాడులపై ఎంపి మల్లురవి స్పందించాలి




## బాధితులకు సత్వర న్యాయం చేయాలి : బిఎస్పీ డిమాండ్

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,మార్చి7(జనంసాక్షి)

: నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో నిరుపేద దళితులపై కాంగ్రెస్ పార్టీ నాయకులు జరుపుతున్న దాడులపై నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి స్పందించాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పీ) ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, జిల్లా ఇంచార్జ్ పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్, నాగర్ కర్నూల్ అసెంబ్లీ ఇంచార్జ్ కొత్తపల్లి కుమార్ లు మాట్లాడుతూ తాడుర్ గ్రామానికి చెందిన నిరుపేద దళిత మహిళా మేరమ్మ 2020వ సం.రంలో ఒక జేసిబి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిందనీ అన్నారు. తను 31 నెల కంతులు పూర్తిగా కట్టిందని, మిగిలిన 13 నెల కంతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ద్వారా కట్టాలని పెండింగ్ లో ఉంచిన మాట వాస్తవమని అన్నారు. ఐతే సీజింగ్ ఎజెంట్ అనీ చెప్పుకుని బిజినాపల్లి మండల కేంద్రానికి చెందిన పవన్ అనే వ్యక్తి మేరమ్మ వద్దు అంటూన్న, అడ్డుపడుతున్న, ఆమెకు ఇష్టం లేకున్నా, తన కొడుకు ఇంటి దగ్గర లేడు అనీ చెప్తూన్నా బలవంతంగా ఫోటోస్, వీడియోస్, తెల్ల కాగితంపై నాలుగు అక్షరాలు రాయించుకుని గత 4 నెలలుగా ఒక నిరుపేద మహిళా జెసిబి నీ - అక్రమంగా అనధికారికంగా పవన్, అల్లీపూర్ వెంకటస్వామి, అమృత్ రెడ్డి, రామకృష్ణలు తమ వద్ద ఉంచుకోవడాన్ని బిఎస్పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తూందనీ పేర్కొన్నారు. ప్రభుత్వం ఒకవైపు మహిళా దినోత్సవం జరుపుతూ, మహిళలకు ఆర్టీసీ బస్సులు లీజుకు ఇస్తామని చెబుతుంటే, ఇక్కడేమో దళిత మహిళా దగ్గర కాంగ్రెస్ పార్టీ నాయకులు జెసిబి లు గుంజుకుంటున్నారని దుయ్యబట్టారు. నాగర్

కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి ఈ సంఘటనపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పార్టీలు ఏవైనా న్యాయం మాత్రం ఆ పాలక కులానికేనా అని ప్రశ్నించారు. మేరమ్మ కు అన్యాయం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత మహిళ కుమారుడు చక్రవర్తి, బిఎస్పి వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు మిద్దె మహేష్, అసెంబ్లీ మాజీ అధ్యక్షులు మహేష్ యాదవ్, అసెంబ్లీ కమిటీ ప్రధాన కార్యదర్శి మడుపు నాగేష్, అసెంబ్లీ కమిటీ మెంబర్ హర్ష ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్..పేరెంట్స్ పరేషాన్..

- అకాడమిక్ ఇయర్ ముగియకముందే కొత్త ఏడాది భారాలు
- తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్న ప్రైవేట్ స్కూళ్లు
- వచ్చే సంవత్సరం పుస్తకాలు ఇప్పుడే కొనాలని ఒత్తిడి
- చోద్యం చూస్తున్న అధికారులు



**అబ్దుల్లాపూర్మెట్, మార్చి 7 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల వ్యవహారశైలి తల్లిదండ్రులకు నానాటికీ భారంగా మారుతోంది. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఇంకా తరగతులు పూర్తికాకముందే, ప్రస్తుత విద్యా సంవత్సరం పరీక్షలు కూడా జరగకముందే, కొన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజు చెల్లింపుల గురించి తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. కొన్ని స్కూల్స్ అయితే వచ్చే సంవత్సరం బుక్స్, యూనిఫాంలను ఇప్పుడే కొనాలని తల్లిదండ్రులకు మెసేజ్లు, ఫోన్ కాల్స్ ద్వారా ప్రెజర్ పెడుతున్నాయి. "ఇప్పుడే రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే సీట్ కన్ఫర్మ్ కాదు" అనే మాటలతో భయపెడుతున్న యాజమాన్యాలున్నాయి. దీనితో తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు.

### తల్లిదండ్రుల ఆవేదన

"ఇప్పుడే పరీక్షలు కూడా పూర్తవ్వలేదు. ఇంకా ఏం ఫీజు చెల్లించాలి? పిల్లల ఫలితాలు కూడా తెలియకముందే నెక్స్ట్ ఇయర్ అడ్మిషన్ చేయమంటున్నారు. ఇది ఎంతవరకు న్యాయమో?" అని కొంతమంది తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు స్కూల్ యాజమాన్యాలు పాఠ్యపుస్తకాలు కూడా స్కూల్ నుంచే కొనాలని ఒత్తిడి తెస్తున్నాయన్నారు. "అదే పుస్తకాలు బయట మార్కెట్లో తక్కువ ధరకు లభిస్తున్నా, స్కూల్లో అయితే మూడు రెట్లు ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు" అంటూ ఒక తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.

### ప్రభుత్వ చర్య ఏంటీ?

ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల అక్రమ విధానాలను నియంత్రించేందుకు ఇప్పటికే కొన్ని నిబంధనలు ఉన్నప్పటికీ, అమలు కఠినంగా జరగడం లేదు. గతంలో ప్రభుత్వ విద్యాశాఖ ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై గరిష్ట పరిమితిని నిర్ధేశించాలని యోచించినా, అది అమల్లోకి రాలేదు. తల్లిదండ్రులు ఈ తరహా ఒత్తిళ్లకు గురి కావద్దని, స్కూల్ యాజమాన్యాల అన్యాయాలకు తలొగ్గకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

# ప్లాట్ నకిలీ పత్రాలు సృష్టించి ఫోర్జరీ చీటింగ్ కేసులో నిందితుల అరెస్టు



**రాజేంద్రనగర్, మార్చి 7 (జనంసాక్షి) :** నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, అమ్మకానికి పెట్టి విక్రయించిన నిందితులను ఫోర్జరీ చీటింగ్ కేసులో రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఓపెన్ ప్లాట్ కోసం నకిలీ పత్రాలను సృష్టించి ఏకంగా అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకున్నారు. అసలు యజమాని ఫిర్యాదుతో రాజేంద్రనగర్ పోలీసులు గత వారం నుంచి శ్రమించి నిందితుల ఆట కట్టించి 7 గురుని అరెస్టు చేశారు. మొత్తం 15 మంది నిందితులుగా పోలీసులు తేల్చారు. శుక్రవారం రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ డిసిపి కార్యాలయంలో తెలిపిన వివరాల ప్రకారం గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్లోని పద్మశ్రీ హిల్స్లో ప్లాట్ నెం. 206/పి, 207లో 600 చదరపు గజాలు వినీతా చౌదరి పేరుతో ఉంది. ఆమె హైదరాబాద్ లోని సోమాజిగూడ లో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం చెన్నైలో నివాసం ఉంటున్నారు. 2005 సంవత్సరంలో, ఆమె ఓపెన్ ప్లాట్ నెం. 206/పి ప్లాట్ నెం. 207, మొత్తం 600 చ.అ, వి. సంజీవ రెడ్డి నుండి నిందితుడు గుండాడ నగేష్ ఫిర్యాదుదారుడికి తెలిసి ప్లాట్ను సందర్శించేవాడు. నిందితులు గుండాడ నగేష్, జీయస్ ఇమ్మాన్యుయేల్ రియల్ ఎస్టేట్ బ్రోకర్లు. ఆ భూమి వినీతా చౌదరి కి చెందినదని, ఆమె ఆ స్థలాన్ని సందర్శించడం లేదని గుండాడ నగేష్ జీయస్ ఇమ్మాన్యుయేల్కు తెలియజేశారు. ఈ అవకాశాన్ని చేజిక్కించుకున్న జీయస్ ఇమ్మాన్యుయేల్, గుండాడ నగేష్ కలిసి భూమిని మోసపూరితంగా విక్రయించేందుకు కుట్ర పన్నారు. వారి నేరపూరిత కుట్రలో భాగంగా, జ్యూస్ ఇమ్మాన్యుయేల్, దివాకర్ వర్మ గుండాల నగేష్ ప్లాట్కు సంబంధించి నకిలీ పత్రాన్ని సృష్టించి, దివాకర్ వర్మకు అనుకూలంగా జనరల్ పవర్ ఆఫ్ అటార్నీని రూపొందించారు. అనంతరం మూసాపేటలోని జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో ధ్రువీకరించారు. తరువాత, దివాకర్ వర్మ రూ. 2.63 కోట్ల మొత్తానికి సుభాషిణికి అనుకూలంగా సేల్ డీడ్ని అమలు చేశాడు. తదనంతరం, నిందితురాలు సుభాషిణి చెప్పిన భూమిని బాధితులు శ్రీనివాస్ రెడ్డి , భరత్ రెడ్డిలు ప్రాతినిధ్యం వహిస్తున్న ధ్రువంతీర కన్స్ట్రక్షన్స్కి, వల్లి మధ్యవర్తిత్వంతో మొత్తం 4.26 కోట్ల కి విక్రయించారు. ఇతర నిందితులు వేర్వేరు పాత్రలు పోషిస్తూ నేరాల కమిషన్లో చురుకుగా పాల్గొన్నారు. మొత్తం అమ్మకం ఆ మొత్తాన్ని నిందితులకు పంచారు. ఇప్పటివరకు 07 మంది నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.1 కోటి 69 లక్షలు, ఫార్చునర్ కారు, ఎస్ యు 700, ఎస్ క్రాస్ కార్,7 సెల్ ఫోన్స్, ఫోర్జడ్ డాక్యుమెంట్ కాపీలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిందితులు నేరాల ద్వారా వచ్చిన ఆదాయం నుండి ఒక ఫార్చ్యూనర్ వాహనాన్ని కొనుగోలు చేశాడని మిగతా నిందితుల బ్యాంక్ అకౌంట్లో సీజ్ చేశామని త్వరలో పట్టుకుంటామని డిసిపి వెల్లడించారు. భూములో ప్లాట్లో కొనుగోలు చేసేటప్పుడు ఫేక్ డాక్యుమెంట్లు వ్యక్తులను చూసి మోసపోవద్దని, లింక్ డాక్యుమెంట్లలో యజమాని అడ్రస్ ఉంటుందని దాని ఆధారంగా విచారణ జరిపి కొనుగోలు చేయడంలో జాగ్రత్త వహించాలని వ్యక్తులను వారి హుందా తనాన్ని చూసి మోసపోవద్దని డిసిపి శ్రీనివాస్ సూచించారు.

# జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలి

- కౌలు రైతుల సమస్య పరిష్కరించాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ



**తాండూరు, మార్చి 7 (జనంసాక్షి) :** జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పేర్కొన్నారు. శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా పట్టణంలో ని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. రుణమాఫీ చట్టం చేయాలని, కౌలు రైతుల సమస్య పరిష్కరించాలన్నారు. కంది రైతులకు మద్దతు ధరలకే కంది మార్కెట్లో కొనుగోలు చేయాలని, డిమాండ్ చేశారు. కేంద్ర పాలకులు ప్రధానమంత్రి మోడీ తీసుకొచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం వల్ల ప్రస్తుతమున్న వ్యవసాయ మార్కెట్లన్నీ రద్దు అవుతాయి. కోట్లకు పడగలు ఎత్తిన కార్పోరేట్ కంపెనీలు వారి ఏజెంట్లు రైతుల దగ్గర అతి తక్కువ ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఈ విధానాన్ని తీసుకువచ్చారు. ఇది రైతు వ్యతిరేక విధానమని, దీన్ని వెంటనే ఉపసంహరించు కోవాలన్నారు దేశవ్యాపతంగా రైతాంగం రెండవ దశ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. మోడీ తీసుకొచ్చిన విధానం వల్ల రానున్న రోజులలో కంది మార్కెట్ ఉండదన్నారు. మార్చి 13 వ తారీకున హైదరాబాద్ ఇందిరా పార్కు లో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మహిళా సమాఖ్య నాయకురాలు విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ రైతులను రక్షించుకోవడం అన్నం తినేఅందరి బాధ్యత అని గుర్తు చేశారు. రైతులకు మద్దతుగా అన్ని తరగతులకు చెందిన వారు నిలబడాలని రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న మోడీ దుర్మార్గాన్ని ఓడించాలని కోరారు. వికారాబాద్ జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ జిల్లాలో రైతాంగ ఉద్యమాన్ని నిర్మిస్తామని అందుకు గ్రామ గ్రామాన రైతుల సభ్యత్వం నమోదు కార్యక్రమంలో పాల్గొని గ్రామ మండల కమిటీలు ఏర్పాటు చేస్తామని, రైతులు, రైతు మహిళలు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘంలో చేరాలని కోరారు.. ఈ ధర్నా కార్యక్రమంలో బుగ్గప్ప విమలమ్మ ,మంగమ్మ ,లాలయ్య, వెంకటయ్య , లక్ష్మయ్య ,సావిత్రి ,మహబూబ్,తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో అవకాశాలిస్తాం



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 7 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలు నామినేటెడ్ పదవుల్లో మహిళలకు సముచిత అవకాశాలు కల్పిస్తామని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగుల అంజలియాదవ్ స్పష్టం చేశారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆవుసుల భవాని ఆద్వర్యంలో మెదక్ లోని ద్వారకా గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు, స్టాఫ్ నర్స్ లను ఘనంగా సత్కరించారు. అనంతరం అంజలీయాదవ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు ఎక్కడ పోటీ చేసిన వారికి సపోర్ట్ చేస్తామన్నారు. మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మార్చి 8న ప్రభుత్వమే అధికారికంగా హైదరాబాద్ లో మహిళా దినోత్సవ వేడుకలు జరుపుతుందన్నారు. త్వరలోనే జిల్లాలో మహిళా కాంగ్రెస్ కమిటీలు వేస్తామని తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కష్టపడి పనిచేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని, మంచి అవకాశాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని, మాజీ ఎంపిపి అరుణ మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి సులోచన, గోదల జ్యోతి, జిల్లా నాయకులు హరిత నర్సింగ్ రావు,స్వరూప తదితరులు ఉన్నారు.

# బ్యాంక్ అధికారులు సరైన భద్రత ఏర్పాటు చేసుకోవాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 7 (జనంసాక్షి) :** బ్యాంకుల వద్ద బ్యాంక్ అధికారులు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా ఎస్పి యోగేష్ గౌతం అన్నారు. శుక్రవారం ఉదయం నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లా పరిధిలోని అన్ని బ్యాంకుల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బ్యాంకుల వద్ద భద్రతపై తగిన సలహాలు భద్రత పరమైన సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల పలు ప్రాంతాలలో బ్యాంకులలో జరిగిన దొంగతనాలను ఉద్దే శించి,అలాంటి సంఘటనలు నారాయణపేట జిల్లా నందు జరగకుండా బ్యాంకు అధికారులు తమ తమ బ్యాంకులకు సంబంధించి పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాంకుల లోపల, వెలుపల అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు తరచుగా పనిచేస్తున్నాయా లేదా అని చెక్ చేసుకోవాలని సూచించారు. బ్యాంకు అధికారులు ఎమర్జెన్సీ సమయంలో డయల్ 100 లేదా 24/7 నారాయణపేట పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670399 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. బ్యాంకుల వద్ద లోపల ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బ్యాంకు పరిసరాల్లో, ఏటిఎంల వద్ద పెట్రోలింగ్ పెంచడం జరిగిందని, ప్రతి ఏటీఎం బ్యాంకుల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసి పోలీసులు ప్రతిరోజు తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, సైబర్ నేరాలను అరికట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐలు శివ శంకర్, రామ్ లాల్, రాజేంద్రర్ రెడ్డి, సైదులు, ఎస్ఐలు, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 7 (జనంసాక్షి) :** మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడినప్పుడే చరిత్రను మార్చిన వారవుతారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురష్కరించుకొని కలెక్టరేట్ లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారితో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవం అంటే ముందుగా గుర్తొచ్చేది అమ్మ అని, అమ్మను స్మరించుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మహిళా శక్తి గురించి మాటలు, పాటలు, పద్యాల రూపంలో చెప్పటం చాలా ఎమోషనల్ గా ఉందన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ అమ్మను గుర్తుంచుకోవాలని అన్నారు. నేటి రోజుల్లో మహిళలు అన్ని రంగాలలో ముందు ఉన్నారని వ్యవసాయం, వృత్తి నైపుణ్యం, పారిశ్రామిక , వ్యాపార రంగాలలో, కళలలో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ముందుండి జిల్లాను అభివృద్ధి పథంలో ముందు ఉంచాలని కోరారు. సమాజంలో మహిళలకు సమాన హక్కులు కల్పించడం జరిగిందని,అలాగే రాజ్యాంగంలో కూడ మహిళలకు ఫండమెంటల్ రూల్స్, మహిళల హక్కులు చట్టాలు రూపొందించి మహిళలకు సముచిత స్థానం కల్పించారని అన్నారు. నేటి మహిళా దినోత్సవం థీమ్ మహిళలకి అలాగే బాలికలందరికి హక్కులు, సమానత్వం, సాధికారితను సాధించుటకు థీమ్ పై ఏర్పాటు చేసిన సిగ్నేచర్ క్యాంపెయిన్ పై జిల్లా కలెక్టర్, అధికారులు సంతకం చేశారు. తదుపరి మహిళా అధికారులను సన్మానించారు. మహిళలకు నిర్వహించిన ఆటలపోటీలలో గెలిచిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి శాఖ అధికారి నరసింహారావు, షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి లత, మెప్మా పిడి రేణుక దేవి, టౌన్ ప్లానింగ్ అధికారిని మాధవి, జిల్లా లీగల్ కౌన్సిల్ అడ్వకేట్ వాణి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ మాధవి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటా చలం తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు మహర్దశ



**వనపర్తి బ్యూరో, మార్చి 7 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు మహర్దశ చేకూరినట్లు వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి తెలిపారు. గత పదేళ్ల పాలనలో బిఆరెస్ ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టి ప్రభుత్వ ధనాన్ని వృధా చేసిందే తప్ప నిరుపేదలకు కేటాయించిన ఇండ్ల నాణ్యతలో మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. నిరుపేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో, విద్యుద్దీకరణ, తాగునీటి సమస్య, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి నివేదించిన అభ్యర్థన మేరకు స్పందించిన మంత్రి వనపర్తి నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్మించిన 909 డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు గాను 4,66,94,283కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఖిల్లా ఘణపురం మండలంలోని గార్లబండ తండా కు చెందిన 20 డబల్ బెడ్ రూమ్ లకు, కర్నే తండా షాపూర్ కు చెందిన 5 డబల్ బెడ్ రూమ్ లకు,కోతులకుంట తండాకు చెందిన 24 డబల్ బెడ్ రూమ్ లకు,మామిడిమాడ గ్రామానికి చెందిన 40 డబల్ బెడ్ రూములకు, ముందరితండాకు చెందిన 15 డబుల్ బెడ్ రూమ్ లకు,సల్కేలాపురం గ్రామానికి చెందిన 50 డబుల్ బెడ్ రూమ్ లకు,తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన 20 డబల్ బెడ్ రూమ్ లకు, పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన 100 డబుల్ బెడ్ రూమ్ లకు,పెబ్బేరు కు చెందిన 24 డబల్ బెడ్ రూమ్ లకు,పెద్దమందడి మండలం బుగ్గ పల్లి తండా కు చెందిన 17 డబల్ బెడ్ రూమ్,వనపర్తి పీర్లగుట్టకు చెందిన 144 డబల్ బెడ్ రూమ్ లకు,పీర్లగుట్టకు చెందిన 150 డబుల్ బెడ్ రూమ్ లకు,వనపర్తి రాజపేటకు చెందిన 96 డబల్ బెడ్ రూమ్ లకు,వనపర్తి మండలం చిట్యాల కు చెందిన 294 డబులు బెడ్ రూమ్ లకు,నిధులు మంజూరయ్యాయని ఇందుకు సంబంధించిన పనులను వెంటనే చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అడిగిన వెంటనే స్పందిస్తూ నిధులు మంజూరు చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

# రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి
- ఉద్యాన వన పంటల సాగుపై రైతులతో ముఖాముఖి



**యాచారం, మార్చి 7 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాను కూరగాయలు ,పండ్లు, ఆకుకూరల హబ్గా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ , ఉద్యానవన పంటల సాగుపై పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమం లో భాగంగా గడ్డ మల్లయ్య గూడ ,చౌదర్పల్లి, మొండి గౌరెల్లి గ్రామాల రైతులకు వ్యవసాయ ఉద్యానవన మార్కెటింగ్ శాఖల సమన్వయంతో కూరగాయల ఆకుకూర రైతులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొత్తపేట మాదన్న పేట మండిలలో రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇక్కడి ప్రాంత రైతులకు అన్యాయం చేయాలని చూడడం సరైనది కాదన్నారు అధికారులు దళారులకు కొమ్ముకాయ కుండా నిజమైన రైతులకు న్యాయం చేయాలని కోరారు. యాచారం మండలంలోని మూడు గ్రామాలలో కమిటీలు వేసి వారి డిమాండ్ల పరిష్కారం కోసం త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో రంగారెడ్డి జిల్లాకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారని, అదే తరహాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కూరగాయలు పండించే రైతులకు అండగా ఉండేందుకు వారికి రవాణా సౌకర్యం కల్పించేందుకు త్వరలోనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రిని కలిసి సమస్యను వివరిస్తామని తెలిపారు. పోర్ట్ సిటీని అభివృద్ధి చేయడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. వివిధ శాఖల అధికారులు తక్షణమే నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో నీ మార్కెట్ యార్డులో రైతులు కూరగాయలు అమ్ముకునేందుకు వీలు కల్పించాలని గుడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు ఎం సునీల్ కుమార్, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, కేవీ నరసింహారెడ్డి, మరికంటి భవాని, కమిషన్ అధికారులు సంధ్యారాణి, సుజాత, బి హరి వెంకట ప్రసాద్ , ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, యాచారం మండల వ్యవసాయ అధికారి రవినాథ్ ఎంపీడీవో నరేందర్ రెడ్డి, తాసిల్దార్ అయ్యప్ప, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నరసింహ గులాం అక్బర్ , మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, గౌర నరసింహ, రైతులు జోగి రెడ్డి, రాఘవరెడ్డి కె రాములు..వివిధ శాఖల సెక్టార్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- ప్రభుత్వం బిసి రిజర్వేషన్ అమలు పరచడంలో నిర్లక్ష్యం తగదు
- బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంఠ




**తలకొండపల్లి, మార్చి 7 (జనంసాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంఠ డిమాండ్ చేశారు. శుక్రవారం తలకొండపల్లి మండల కేంద్రంలో మండల బీసీ నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం స్పూర్తికి విరుద్ధంగా ప్రస్తుత రాజకీయాలు జరుగుతున్నాయని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో దశాబ్దంపైగా పాలకుల పరిపాలన పరిశీలిస్తే సమైఖ్యాంధ్రాలో బీసీలకు జరిగిన అన్యాయమే మళ్లీ పునరావృతం అవుతోందన్నారు. తెలంగాణలో మళ్లీ సంపన్న వర్గాలే రాజ్యమేలుతున్నాయని బడుగు,బలహీన వర్గాలను యాచించే స్థాయికి పరిమితం చేశారన్నారు. 78 ఏళ్ల స్వతంత్ర్య భారత వనితకు ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగా చూసి,సంక్షేమ పథకాలను ఎరవేస్తున్నారని తెలిపారు. విద్య,ఉపాధి రంగాల్లో దామాషా వాటా దక్కకుండా కుట్రలు చేస్తూ బీసీలను పేదరికంలో నెట్టేస్తున్నారని చెప్పారు. 70 ఏళ్ల నుంచి అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తూ వస్తున్నాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఒక్క బీసీ ముఖ్యమంత్రి కాలేదన్నారు. బీసీల ఓట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారాల్లోకి వచ్చిందని,ఇంకా తాత్సారం చేయకుండా బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసి,జనాభా దామాషా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లను విద్యా,ఉద్యోగ,రాజకీయ రంగాలలో వెంటనే అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మనకు రావలసిన హక్కులను సాధించుకోవడానికి పార్టీలకు అతీతంగా బీసీలందరూ కలసి ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా 48 శాతం రిజర్వేషన్ వెంటనే అమలుపరిచి బీసీ పక్షపాతి ప్రభుత్వం అని నిరూపించుకోవాలని కోరారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రానికి మొట్టమొదటిసారిగా వచ్చిన రాష్ట్ర కార్యదర్శి మణికంఠ,ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి సింగల్ విండో డైరెక్టర్ కటికల శేఖర్ యాదవ్,లింగరావుపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్,చంద్రధన మాజీ సర్పంచ్ బక్కి కుమార్,పాండు ముదిరాజ్,విఠల్ ముదిరాజ్,ప్రకాష్, రాజు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో మహిళలు రాణించాలి

- మహిళా సాధికారతకు చదువు ముఖ్యం
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 7 (జనం సాక్షి) :** అమ్మాయిలు చదివు కుంటే ఇంటికి వెలుగు ఇస్తుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల సమానత్వం మన ఇంటి నుండే ప్రారంభం కావాలన్నారు. ఇంట్లో ఆడపిల్లలను, మగ పిల్లలను సమానంగా చూడాలని సమానంగా చదివించాలని సూచించారు. సమాజంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యమని వారిని అన్ని రంగాలలో పురోగమించేలా చేయడమే ప్రభుత్వ సంకల్పం అన్నారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కలిగి ఉండాలని విద్యా, ఉపాధి ,రాజకీయ రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో మహిళలు కీలక స్థానాలను అధిరోహించాలని సూచించారు.

### చదువే మహిళా సాధికారతకు ప్రధానం

అమ్మాయిలు చదువు ఆ కుటుంబానికి వెలుగును ఇస్తుందని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు తమ కుమార్తెకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ మంచి విద్యను అందించాలని సూచించారు. కేజీబీవీ , గురుకుల పాఠశాలలో వసతి గృహాలలో చదువుతున్న బాలికల భవిష్యత్తు కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మగ పిల్లలను, ఆడపిల్లలను సమానంగా పెంచాలన్నారు బాల్యం నుంచే ఇంట్లో సమానత్వం పెంపొందించాలన్నారు. మగ పిల్లలకు మహిళలను గౌరవించే విధంగా విలువలు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు.

### ఉద్యోగ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగాలి

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ మహిళల సంఖ్య ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగం చేయాలంటే కుటుంబ సభ్యులకు ప్రోత్సాహం చాలా అవసరం అన్నారు. పనిచేస్తున్న ప్రదేశాలలో మహిళలకు సరైన గౌరవం భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజారాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, డిఆర్డిఏ జ్యోతి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిణి వసంతకుమారి, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా సాధికారిత దిశగా ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 7 (జనం సాక్షి) :** ఒక దేశాన్ని భారత మాత అని పిలిచే ఏకైక దేశం మనదని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు.మహిళా సాధికారిత దిశగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్, జిల్లా మహిళా అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ నేడు జిల్లా కేంద్రాలలో జిల్లా స్థాయిలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందనీ, శనివారం హైదరాబాద్ లో రాష్ట్రస్థాయిలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.మహిళా దినోత్సవాన్ని పండగ వాతావరణంలో చేసు కోవడం సంతోషంగా ఉంద న్నారు.ప్రతీ మహిళకు వ్యక్తి గత, కుటుంబ జీవితం ఉం టుందని, ఉద్యోగ పరంగా చాలామంది మహిళలు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఒక మహిళకు మరో మహిళే సపోర్ట్ చేయాల న్నారు. మహిళలంతా చైత న్యమై ఏదైనా అవసరం కలిగిన మహిళకు సాయం అందించాలన్నారు.మహిళా దినోత్సవాన్ని కేవలం రెండు రోజులే కాకుండా నిత్యం చేసు కోవాలన్నారు.ఇతర జిల్లాల మహిళలకు మనం స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లాలోని మహిళ లందరికీ తాను ఒక సోద రుడిలా అండగా ఉంటానని భరోసా ఇస్తూ మహిళా దినో త్సవ శుభాకాంక్షలు తెలిపా రు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో పాటు జిల్లా స్థాయి మహిళా అధికా రులను అందరిని ఆయన శాలువాతో సన్మానించారు.అలాగే మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో గెలు పొందిన విజేతలకు జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయన జ్ఞాపికలను అందజేశారు. జిల్లా అధికారినిలకు కలెక్టర్, ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలను అందజేశారు.అంతకు ముందు కార్యక్రమాన్ని ఉద్దేశించి సభాధ్యక్షురాలు డి డబ్ల్యు ఓ జయ, జెడ్పి డిప్యూటీ సీఈ వో జ్యోతి, ఆర్టీవో మేఘా గాంధీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ సౌభా గ్య లక్ష్మి, కలెక్టరేట్ సూపరిం టిండెంట్ అఖిల ప్రసన్న, డిఆర్డిఓ మొగులప్ప మాట్లాడారు.ఈ కార్యక్రమం లో కలెక్టరేట్ ఏవో జయసుధ, జిసిడిఓ నర్మద, నారాయణ పేట, మక్తల్, మద్దూర్ సిడిపి ఓలు, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారు లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు స్వశక్తితో ఎదగాలి

- మహిళలు చట్టాలపై అవగాహనాతో ధైర్యంగా పోరాడాలి..
- మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలి
- ప్రోత్సహిస్తే ఆకాశమే హద్దుగా విజయాలు
- సీనియర్ సివిల్ జడ్జి కమ్,మండలం న్యాయ సేవా సంస్థ అధికారి చైర్మన్ కే.అనిత



**దేవరకొండ, మార్చి 7 (జనం సాక్షి) :** సంవత్సర కాలంలో మహిళలు సాధించిన విజయాలను స్మరించుకుంటూ ముందు తరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ప్రపంచవ్యాప్తంగా మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటామని సీనియర్ సివిల్ జడ్జి కమ్,మండలం న్యాయ సేవా సంస్థ అధికారి చైర్మన్ కే.అనిత అన్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారు జనం సాక్షితో మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడ పూజించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని, స్త్రీ ఔన్నత్యానికి సమాజంలో వారికి ఉన్న ప్రాధాన్యతకు మన భారతీయ సంస్కృతి ఇచ్చిన గొప్ప గౌరవమని అన్నారు. ఆడపిల్లల పట్ల వివక్షత ఉండకూడదని, తల్లిదండ్రులు ఆడ, మగ అని తేడా లేకుండా చిన్నప్పటి నుంచి సమానంగా పెంచాలని, సామాజిక మార్పు ఇంటి నుండే రావాలని, బాలికలు చదువుకుంటే సమాజం తొందరగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, తల్లిదండ్రులు ఆడ పిల్లలకు ఉన్నత చదువులు చదివిస్తే చాలు సమాజాన్ని గెలుస్తారని అవసరమైతే పదిమందికి ఉపాధి చూపిస్తారని అన్నారు. నేటి యుగంలో మహిళలు ఎలాంటి నిర్ణయమైనా స్వతంత్రంగా తీసుకునే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అక్షరాస్యత పెరిగిన రోజు నిజమైన అభివృద్ధి కనిపిస్తుందని, గ్రామీణ ప్రాంతాలలో మహిళలు అక్షరాస్యులుగా మారినప్పుడే అవకాశాలు అందిపుచ్చుకోగలరని అన్నారు.ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, అమ్మాయిలు చిన్ననాటి నుంచి ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకుని, వాటిని సాధించుకోవడానికి ముందడుగు వేయాలని తెలిపారు ,బాలికలు, మహిళలు, ఆత్మవిశ్వాసంతో, ఏకాగ్రతతో, పట్టుదలతో చదివితే భవిష్యత్తు బంగారు మయం అవుతుందని, భయం వీడితే విజయం సొంతం అవుతుందని అన్నారు.గమ్యం చేరే ప్రయాణంలో ఎలాంటి అడ్డంకులు వచ్చిన దీటుగా ఎదుర్కొని ముందుకు సాగాలని, మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించేందుకు ముందుకు రావాలని, ఇదంతా సాధించాలంటే కుటుంబం నుంచి ప్రోత్సాహం ఉండాలని అన్నారు.

## స్వచ్ఛభారత్ నిర్వహించిన ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, మార్చి 7 (జనం సాక్షి) :** దమ్మపేట మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమన్ని అశ్వారావుపేట నియోజకవర్గం శాసనసభ్యులు జారె ఆదినారాయణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రభుత్వ అధికారులు,పారిశుద్ధ్య కార్మికులు,వివిధ శాఖల సిబ్బందితో కలిసి ప్రధాన రహదారిపై రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాలను తొలగించి రహదారిని పరిశుభ్రంగా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు.పరిశుభ్రత జీవితంలో ప్రతి వ్యక్తికి చాలా ప్రాముఖ్యమైనదని మన పరిసరాలు శుభ్రంగా ఉంటే మన ఆరోగ్యమే కాకుండా మన సమాజం కూడా శుభ్రంగా ఉంటుందని పేర్కొన్నారు.కార్మిక సోదరులు కూడా ఎంతో కష్టపడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పరిసరాల పరిశుభ్రత అనేది కేవలం కొందరి బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశించిన ప్రదేశాలలో ఉంచి పంచాయితీ సిబ్బందికి సహకరించాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ఈ నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

## సూర్యాపేటలో ప్రెస్‌క్లబ్ భవనాన్ని నిర్మించాలి

- టీఎస్ జెఏ రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి యాదగిరి

**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 7 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలో గల పాత మిర్చి యార్డులో అన్ని సౌకర్యాలతో కూడిన జర్నలిస్టు భవనాన్ని నిర్మించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి కమిటీ సభ్యులకు కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు, ఆర్డిఓలకు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలకు వినతి పత్రం అందించే కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు.జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అదే విధంగా వర్కింగ్ లో ఉన్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పోలీస్ భరోసా కార్డులు,ఇంటి స్థలాలు లేదా పక్క ఇంటి నిర్మాణాలు చేపట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని, అన్ని యూనియన్లతో కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సోషల్ మీడియా ఇన్చార్జి ధూపాటి శ్యాంబాబు, రాష్ట్ర కోశాధికారి కొరివి సతీష్ యాదవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం బాలు, సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి రవి, జిల్లా సహాయ కార్యదర్శి తిరుపతి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి లంకెపల్లి రమేష్, పెన్ పహాడ్ మండల అధ్యక్షులు పడిశాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే ఇళ్ల నిర్మాణానికి నిధులు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య



**రాయికోడు, మార్చి 7 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదల ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య పేర్కొన్నారు .శుక్రవారం మండల పరిధిలోని ఆదర్శ గ్రామంగా ఎంపికైన నాగ్వార్ గ్రామంలో నూతనంగా మంజూరైన ఇళ్ల నిర్మాణానికి మండల స్పెషల్ ఆఫీసర్ జగదీష్, ఎంపీడీవో ఎంఎ షరీఫ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నర్సింలు తో కలిసి టెంకాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు చేయలేదని గత పది సంవత్సరాల కంటే ముందు కాంగ్రెస్ ప్రభుత్వమే ఇండ్లు మంజూరు చేసిందని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే మళ్లీ నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు. నాగ్వార్ గ్రామంలో అర్హులైన50 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అన్ని గ్రామాలలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఏపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శి శేఖర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్, ఉప్పరి విట్టల్, జీ విట్టల్, పండరి, శ్రీనివాస్, సాదత్ పటేల్,అనిల్, పలువురు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పొలాలు ఎండుతున్నాయి..రైతులు మండుతున్నారు..



**గంభీరావుపేట, మార్చి 7 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలోని ఎగువ మానేరును ఆనుకొని ఉన్నటువంటి సింగసముద్రం నాలా పెద్ద కాల్వ ఆయకట్టుకు నీళ్ల విడుదల చేయాలని గంభీరావుపేట లింగన్నపేట ప్రధాన రహదారి ఓలాద్రి వద్ద రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగసముద్రం నాలా పెద్ద కాలువ ఆయకట్టు దాదాపు 2000 గాను 100 ఎకరాలకు కూడా నీళ్ల అందడం లేదన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి నీళ్ల విడుదల చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా రైతులకు భారతీయ జనతా పార్టీ మద్దతు తెలియజేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి నీళ్లు ఈ పంటకు వచ్చే విధంగా సహకరించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో బిజెపి మండల శాఖ అధ్యక్షులు గంటా అశోక్ నాయకులు ప్రసాద్ రెడ్డి దేవసాని కృష్ణ పత్తి స్వామి రాజు రైతులు చిట్టంపల్లి రాజు టేకుమల్ల గంధపు రాజు వేశాల రామచంద్రం వేశాల రమేషు చిట్టెంపల్లి అంజయ్య అడువయ్య చిట్టెంపెల్లి స్వామి బాలయ్య దేవయ్య తదితరులు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు. దీనితోపాటు వెంకటాద్రి చెరువు కింద ఉన్న పరిస్థితి ఇలాగే ఉందన్నారు. వెంకటాద్రి చెరువుకు దాదాపు 300 ఎకరాలు పంట పొలాలు వేయగా, చెరువులో నీరు నిండా ఉన్న, నీరు అందడం లేదంటూ కిరణ్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు చెరువులో నిండి ఉన్న ఎందుకు వదలడం లేదు అర్థం కావడం లేదు అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# కందులు, వేరుశెనగ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

- ఎమ్మెల్యే బాలు నాయక్



**కొండమల్లేపల్లి, మార్చి 7 (జనంసాక్షి) :** రైతులు ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కందులు, వేరు శెనగల కొనుగోలు కేంద్రాన్ని దళారుల బారిన పడకుండా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో నా ఫెడ్- మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందులు, వేరు శెనగల కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రహించి వేరు శెనగ క్వింటాలుకు రూ.6783/- కందులు క్వింటాలుకు రూ.7550/- ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతులు దళారులకు, వ్యాపారులకు తమ పంట ఉత్పత్తులు తక్కువ ధరకు అమ్మి నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతుల నుంచి పూర్తి స్థాయిలో ప్రభుత్వం అనుమతించిన మేరకు కందులను కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. ఏమైనా అక్రమాలకు పాల్పడితే కేంద్రాల సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు భరోసా పథకం కింద రైతులకు ఇవ్వాల్సిన 6000 వేల రూపాయల చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. వేరుశనగ, కందులకు గిట్టుబాటు ధరతో పాటు కొనుగోలులో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎక్కడ కూడా జాప్యం చేయకుండా కొనుగోలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఎ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహా, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, నాగార్జున జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మేనేజర్ నాగిళ్ళ మురళి, ఎన్డి సిఎంఎస్ మార్కెటింగ్ ఇంచార్జ్ జెట్టి శివ, శ్రీశైలం, క్వాలిటీ సూపర్వైజర్ సురేష్, మార్కెట్ సెక్రటరీ కిరణ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి జానకిరాములు, సిఈఓ పల్లా తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పెద్దిశెట్టి సుధాకర్, సయ్యద్ దస్తగిర్, ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మాజీ జడ్పిటిసి సలహాదారులు పసునూరి యుగేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎంఏ కైసర్ ఖాన్, మాజీ ఎంపిపిలు మేకల శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, బిక్కు నాయక్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయిని సుభాష్ రెడ్డి, నీలా లక్ష్మయ్య, గౌరు గోపాల్, సిపిఐ నాయకులు సుదర్శన్ రెడ్డి, గంధం సురేష్, నీలం శ్రీనివాస్ యాదవ్, లాలు నాయక్, కోట్ల జగదీశ్ పటేల్, నారాయణ యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు క్రమశిక్షణ, చదువు, సంస్కారాన్ని నేర్పాలి





- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**హైదరాబాద్, మార్చి 7 (జనంసాక్షి) :** మహిళలకు మహిళలే స్నేహితులని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఇలంబర్తి, ఇతర మహిళా ఉన్నతాధికారులతో కలిసి మేయర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... పలు రంగాలలో విజయాలు సాధించి ఉన్నతంగా రాణించిన మహిళా మణులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి మహిళలో ఏదో ఒక నైపుణ్యత ఉంటుందని, దానికి మెరుగు పెట్టి అందులో రాణించాలన్నారు. తల్లిగా ప్రతి మహిళ తమ పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... మహిళలు ఐక్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలుగుతారన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్య విషయంలో శ్రద్ద తీసుకోవానల్నారు. మహిళ బాగుంటేనే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ... సమాజంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఇంటి నిర్వహణను మొదలుకొని ఒక పెద్ద సంస్థను నిర్వహించడం వరకు మహిళలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు ఉన్నతంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి మహిళా తల్లిగా మొదలుకొని అన్ని పాత్రలను అవలీలగా నిర్వహిస్తూ సమాజంలో కీలకంగా మారిందన్నారు. ఈ సందర్భంగా ఆయన బాల్యంలో తన తల్లి ఇంటి నిర్వహణలో ఏవిధంగా కష్టపడేదన్న విషయాన్ని, అదేవిధంగా ఆయన జీవిత భాగస్వామి కో-ఆర్డినేషన్ ను గుర్తు చేసుకున్నారు. ప్రతి మహిళా తన కుటుంబంతో పాటు తన ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంతకు ముందు మహిళా ఉద్యోగులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా 30 సర్కిళ్లలో ఉత్తమ సేవలు అందించిన మహిళా శానిటరీ వర్కర్లను మేయర్, డిప్యూటీ మేయర్, కమీషనర్ ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళా ఉద్యోగులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, సుభద్రాదేవి, అలివేలు మంగతాయారు, సరోజ, గీతా రాధిక, జాయింట్ కమిషనర్ ఉమా ప్రకాష్, సి.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, డి సి ప్రశాంతి వివిధ విభాగాల మహిళా హెచ్.ఓ.డి లు, డి.సి లు, ఏ.ఎం.సి లు, ఉద్యోగిణులు, శానిటరీ మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
శనివారం 08 మార్చి 2025

# కార్మికులకు సొంత ఇంటి పథకం

## పేర్క్స్ పై ఐటి చెల్లింపు

### ఏఐటీయూసీ తో జరిగిన 38 వ స్ట్రక్చర్ సమావేశంలో చర్చ

(ప్రత్యేక ప్రతినిధి/ జనంసాక్షి)



సింగరేణిలో గుర్తింపు ఏఐటీయూసీ నేతలతో సిఎండి లెవల్ లో స్ట్రక్చర్ సమావేశం శుక్రవారం జరిగింది. పలు అంశాల పై, అవగాహన, అంగీకారం కుదిరినట్లు ఏఐటీయూసీ పేర్కొన్నది. 1. పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ ఇవ్వడం వలన కంపెనీకి సంవత్సరానికి 91 కోట్లు ఖర్చు అవుతాయన్నారు అయినప్పటికీ దీనిపై యాజమాన్యం ఇన్ ప్రిన్సిపుల్ అంగీకరించారు. దీనిపై కమిటీ వేశారు. 2. సొంత ఇంటి పథకం అమలు పరచుటకు అంగీకరించారు. దీనిపై విధివిధానాలు రూపొందించడానికి కమిటీలో నిర్ణయించుతామన్నారు. 3. హైదరాబాద్లో కార్పొరేట్ హాస్పిటల్ పెట్టడానికి అంగీకరించారు రిటైర్ అయిన కార్మికులకు మందులు హైదరాబాదులో ఉన్నవారికి సింగరేణి భవన్లో ఇచ్చుటకు అంగీకరించారు రిటైర్ అయిన కార్మికులు కంపెనీ హాస్పిటల్ లో అడ్మిట్ అయిన 40% కట్టింగ్ చేయరు. 4. అన్ని మైన్స్ డిపార్ట్మెంట్లలో కార్మికులకు లాకర్స్, కబోర్డ్స్, ఆఫీస్ లో ఫర్నిచర్స్ ఇచ్చుటకు అంగీకరించారు. 5. సెక్యూరిటీ, హాస్పిటల్స్ సిబ్బంది ఎలక్ట్రిషన్, ఫిట్టర్స్ అన్ని రకాల మజ్దూర్ల డిసిగ్నేషన్స్ ను మార్చుటకు అంగీకరించారు. బదిలీ వర్కర్ బదులు జనరల్ అసిస్టెంట్ ట్రైనీగా ఇస్తారు. 6. డిస్మిస్ అయినా కార్మికులకు 5 సంవత్సరాలలో ఏదైనా ఒక సంవత్సరంలో 100 మాస్టర్లు ఉంటే వారికి ఒక అవకాశం కల్పించుటకు అంగీకరించారు. లోక్ అదాలత్ తీర్పు ప్రకారం ఇచ్చుటకు అంగీకరించారు. 7. జె ఎం ఓ, జటఓ, జేఓసిలకు ఏ గ్రేడ్ లో 5 సంవత్సరాలు ఉన్నవారికి ఈ -1 గ్రేడ్ కు ఎలిజిబులిటీ ఇచ్చుటకు అంగీకరించారు. 8. మారుపేర్లపై పనిచేసిన వారి పిల్లలకు మరియు డేట్ అఫ్ బర్త్ మార్పు కొరకు సర్టిఫికెట్స్ పెట్టిన వారికి మరియు విజిలెన్స్ కేసులు యాజమాన్యం మరియు గుర్తింపు సంఘంతో కమిటీ వేసి పరిష్కరించుటకు అంగీకరించారు. 9. 11 రకాల అలవెన్సు పెంచుటకు అంగీకరించారు. 10. డిస్మిస్ అయినా జే ఎం ఈటి లందరిని వెంటనే తీసుకుంటారు. 11. ఈపీ ఆపరేటర్లకు మిషనరీ గ్రేడ్ ప్రకారం డి, టూ సి, సీ టూ బి ఇచ్చుటకు అంగీకరించారు. 12. సొంత ఇల్లు కట్టుకున్న వారికి క్వాటర్ వెకేషన్ సర్టిఫికెట్ ఇచ్చుటకు అంగీకరించారు. 13. మైనింగ్ స్టాప్ తో పాటు ట్రేడ్స్ మెన్స్ లకు కూడా మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి సర్ఫేస్లో సూటబుల్ జాబ్ ఇచ్చుటకు అంగీకరించారు. 14. గత డైరెక్టర్ పా సమావేశంలో అంగీకరించిన ఎన్-1 తో పాటు అన్ని అంశాలకు చైర్మన్ గారు అప్రూవల్ ఇచ్చారు. వీటిని అమలు చేస్తారు. ఈ సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తగూడెం శాసనసభ్యులు కునంనేని సాంబశివరావు, రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కే సారయ్య, కే వీరభద్రయ్య, వై వి రావు, ముష్కే సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, అక్బర్ ఆలీ, వై రామ్ గోపాల్ పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ 25 శాతం రిబేటును సద్వినియోగం చేసుకోండి

కరీంనగర్ బ్యూరో, 07 (జనంసాక్షి)

: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ నెల 31 లోపు ఆన్లైన్ లో ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం రిబేటు లభిస్తుందని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దరఖాస్తు దారులు ఎల్ఆర్ఎస్ 2020 వెబ్ సైట్ లోకి వెళ్లి పరిశీలించినట్లయితే వారి దరఖాస్తు కు సంబంధించి ఫీజు వివరాలు తెలుస్తాయని జిల్లాలోని కార్పోరేషన్, సుడా, మున్సిపాలిటీలు అన్నీ కలిపి 44 వేల 437 దరఖాస్తులకు ఫీజు నిర్ణయించబడిందని తెలిపారు. ఫీజు నిర్ణయించబడని 1435 దరఖాస్తులు ప్రోహిబిటెడ్ లో లేనట్లయితే మళ్లీ ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకుంటే తిరిగి పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. పది శాతం ప్లాట్లు అమ్మిన వెంచర్స్ కు కూడా మిగితా ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని అన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఆర్ఎస్ లేని ప్లాట్లకు భవిష్యత్తులో ఎలాంటి అనుమతులు కానీ రిజిస్ట్రేషన్ లు కానీ కావని పేర్కొన్నారు. దరఖాస్తు దారులకు ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్లు 9652404978 , 7093750333 కు ఫోన్ చేయవచ్చు అని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపివో ఆంజనేయులు, ఫీల్డ్ ఆఫీసర్లు అజయ్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో 44వేల 437 దరఖాస్తులకు ఫీజు నిర్ణయించబడింది
క్రమబద్ధీకరించుకోని వారికి భవిష్యత్తులో పర్మిషన్లురావు, రిజిస్ట్రేషన్లు కూడా కావు
సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

# వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

పరకాల, మార్చి 7 (జనం సాక్షి):



పరకాల నియోజకవర్గవ్యాప్తంగా రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం లో మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అధికారులు పర్యటించి నీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేయాలి అని,అలాగే ఓవర్హెడ్ ట్యాంకులను క్లీనింగ్ చేయడం,నీటి శుద్ధి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వర్తించాలని అన్నారు. వేసవిలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి, అక్కడ నీటి సరఫరాను పర్యవేక్షించాలి అని,మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫర చేయాలని అన్నారు.వేసవి లో తాగునీటి సరఫరాలో అంతరాయం, సమస్యలు తలెత్తకూడదని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి,అనుమతులు పొందుతూ పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలన్నారు.

# ట్రైబల్ జర్నలిస్ట్ సభ్యులకు శిక్షణలో సహకరిస్తాం

ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా

ఏటూరునాగారం, మార్చి 07(జనంసాక్షి)



ట్రైబల్ జర్నలిస్టులకు ట్రైనింగ్ ఇవ్వడానికి ఐటిడిఎ తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఐటిడిఏ ఏటూరునాగారం పిఓ చిత్ర మిశ్రా అన్నారు. నూతనంగా ములుగు జిల్లాలో ఏర్పడిన ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న ఆధ్వర్యంలో శుక్రవారం ఐటిడిఏ లో పిఓ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందించారు. సానుకూలంగా స్పందించిన ఆమె జిల్లాల యూనియన్ అసోసియేషన్ సభ్యులు డిపిఆర్ఓ తో సమన్వయంగా మెలుగుతూ ప్రణాళికను సిద్ధం చేసి అందిస్తే తదనగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా జిల్లాల కలెక్టర్ల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దీంతోపాటు ఐటీడీఏ తరపున జర్నలిస్టులకు అందించే ప్రోత్సాహకాల విషయంలో బైలా ప్రకారం నడుచుకుంటామన్నారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వై జంక్షన్ సమీపంలోని బిఆర్ గార్డెన్ లో జరిగిన సమావేశంలో రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు బానోత్ వెంకట్ బానోత్, వెంకన్న మాట్లాడారు. ఈనెల 14వ తేదీ వరకు సభ్యత్వాల నమోదు ప్రక్రియను పూర్తి చేసినట్లయితే భీమా కంపెనీ తో మాట్లాడి ఐదు లక్షల ప్రమాద బీమా సభ్యులకు అందేలా ఒప్పందం కుదుర్చుకుం టామన్నారు. జిల్లాలో ఎక్కడైనా ట్రైబల్ జర్నలిస్టులకు సమస్య వచ్చినట్లయితే వెంటనే సమాచారం అందించాలని సంబంధిత సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ట్రైబల్ జర్నలిస్టులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కమిటీ నాయకులు, జిల్లా గౌరవాధ్యక్షులు, భూక్య సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి, కుచ్చంటి చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు, పూనెం ప్రతాప్, కోశాధికారి తుర్శ చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్, సుధాకర్, ఏటూరునాగారం డివిజన్ కమిటీ అధ్యక్షుడు రవీంద్రనాథ్, కార్యదర్శి శివలింగ ప్రసాద్, కేతిరి బిక్షపతి, బానోత్ యోగి, లక్ష్మీనారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.

# విజయాలలో గణితం, సైన్స్ కీలకం

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలు

కరీంనగర్ బ్యూరో, 07 (జనంసాక్షి)



: గణితానికి, సైన్స్ ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన గుర్తింపున్నదని, విజయాలలో కీలకంగా వ్యవహరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తరగతిగదుల్లోని విషయాలను ఎప్పటికప్పుడు సమగ్రంగా విశ్లేషిస్తు వివిధ అంశాలపట్ల పట్టు సాధించాలని కోరారు. పట్టు సాధించిన వారిని వివిధ స్థాయిలలో నిర్వహింపబడే పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా పాఠశాలలో వివిధ అంతర్జాతీయ, జాతీయ సంస్థలతో నిర్వహింపబడే పలు పోటీ పరీక్షలకు ఎంపిక చేయడమే కాకుండా వారికి అన్నిరకాలుగా వనరులను కల్పించాలని తద్వారా ఉత్తమమైన ఫలితాలు వస్తాయని చెప్పారు. ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయిన నేషనల్ టీచర్స్ ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి జాతీయ స్థాయి గణిత ఒలంపియాడ్లో పాఠశాలకు చెందినటువంటి జి. సహర్ష్, 6వ తరగతి, బంగారు పతకం, ప్రశంసా పత్రం, డి. చంద్రహాస్, 6వ తరగతి, బంగారు పతకం, ప్రశంసా పత్రం, యన్.సహర్ష్, 7వ తరగతి, బంగారు పతకం, ప్రశంసా పత్రం, ఇ.లిఖిత్ కుమార్, 7వ తరగతి, రజత పతకం, ప్రశంసా పత్రం, కృష్ణ ప్రతీక్, 9వ తరగతి, బంగారు పతకం, ప్రశంసా పత్రం, జి. హేమంత్ జాదవ్, 9వ తరగతి, రజత పతకం, ప్రశంసా పత్రం, జి. సాయి సంహిత్, 8వ తరగతి, బంగారు పతకం, జాతీయ స్థాయి 2వ ర్యాంకు, జాతీయ స్థాయి సైన్స్ ఒలంపియాడ్ :జి.విభువన్ రామ్, 4వ తరగతి, రజత పతకం, ప్రశంసా పత్రం, డి. అనుశ్రీ, 6వ తరగతి, బంగారు పతకం, ప్రశంసా పత్రం, కృష్ణచైతన్య, 7వ తరగతి, బంగారు పతకం, ప్రశంసా పత్రం, కె. తనీష్ రెడ్డి, 9వ తరగతి, రజత పతకం, ప్రశంసా పత్రం,ఆల్ ఇండియా ట్యాలెంట్ సర్చ్ (ఎ.ఐ.టి.యస్.ఇ) : యన్. వినాయక్, 7వ తరగతి, రజత పతకం, ప్రశంసా పత్రం, జి. సాయి సంహిత్, 8వ తరగతి, రజత పతకం, ప్రశంసా పత్రం విజేతలందరికి పుష్పగుచ్ఛాలను అందజేసి భవిష్యత్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# జోగులాంబ ఆలయ అభివృద్ధికి ప్రణాళికా



## తక్షణ పనుల కోసం కమిటీ ఏర్పాటు

### ఎండోమెంట్స్ శాఖ సమీక్షలో చిన్నారెడ్డి, శైలజ రామయ్యర్, శ్రీధర్

హైదరాబాద్ (జనంసాక్షి)

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ముందుకు సాగాలని, తక్షణ పనుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఎండోమెంట్స్ శాఖ ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ప్రజా భవన్ లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, ఎండోమెంట్స్ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ రాజేంద్ర ప్రసాద్ యాదవ్, ఆగమా శాస్త్ర పండితులు గోవింద హరి, తదితరులు పాల్గొన్నారు. జోగులాంబ ఆలయ సమగ్ర అభివృద్ధికి తాత్కాలిక పనులు, దీర్ఘ కాలిక పనుల జాబితాను సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈనెల 20 వ తేదీ నాటికి తాత్కాలిక, తక్షణ పనులను ఎంపిక చేసి నివేదిక అందజేయాలని కమిటీకి కాల పరిమితిని నిర్ణయించారు. తాత్కాలిక పనులలో భాగంగా ఆలయ ప్రాంగణంలో లైటింగ్, పార్కింగ్, ఆలయ చరిత్రతో ప్రచార బోర్డులు పెట్టాలని, అందుకు బస్సు స్టాండ్స్, రైల్వే స్టేషన్స్, ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేయాలని నిర్ణయించారు. దీర్ఘ కాలిక పనులలో బోటింగ్, టూరిజం అభివృద్ధి, అతిథి గృహాల నిర్మాణాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, ఆర్చిల ఏర్పాటు వంటి పనులు చేపట్టాలని

నిర్ణయించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి పలు సూచనలు చేశారు. అత్యంత ప్రాధాన్యతతో పనులు చేపట్టాలని, లక్ష్యం మేరకు ముందుకు సాగాలని చిన్నారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో సూర్యనారాయణ మూర్తి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఎండోమెంట్స్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, ఆలయ అదుకారులు పాల్గొన్నారు.

# మనువాదం ముసుగులో మహిళలపై అఘాయిత్యాలు

ప్రజా సంఘాల నేతల ఆగ్రహం

వనపర్తి,మార్చి 08 (జనంసాక్షి) :



మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని మనువాదం ముసుగులో వారిపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని సీఐటీయూ, ఐద్వాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో సీపీఎం అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సభకు ఐద్వా జిల్లా అద్యక్షురాలు గద్వాల సాయిలీల అద్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు మండల రాజు, కన్వీనర్ సునీత, ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ .లక్ష్మి అధ్యక్షురాలు గద్వాల సాయిలీల, భాగ్యలక్ష్మి పాల్గొని ప్రసంగిస్తూ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రమ దోపిడీకి హక్కుల అణిచివేతకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం అన్నారు. మార్చి 8న అమెరికా దేశంలోని వివిధ ఫ్యాక్టరీలలో, వస్త్ర పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు చాలా తీవ్రమైన భరించలేని శ్రమ దోపిడీ చేయించేవారు దానికి వ్యతిరేకంగా మహిళలంతా ఒక్కటై 8గంటల పని దినం కావాలని, ఓటు హక్కు కావాలని, సంఘం పెట్టుకునే హక్కు ఒంటి రాజ్యాంగ హక్కులు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటుందని చెప్పుకుంటున్న ఘట్టమే మార్చి 8 అని వివరించారు. సభ్య సమాజం తలదించుకునేలా లైంగిక దాడులు మానవత్వాన్ని మంట గలుపుతున్నాయని అన్నారు. మీడియా, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లో వస్తున్న పెను మార్పులు విష సంస్కృతిని పెంచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 78 ఏళ్ల స్వాతంత్ర రాజ్యాంగ ఫలాలు ఇంకా ఆస్వాదించలేక పోతున్నారు. కులం, మతం గృహ హింస, హత్యలు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టడం లో పాలకులు విఫలం చెందారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేటు, మతోన్మాద అనుకూల విధానాలు మహిళలను సమస్యల సుడిగుండంలోకి నెట్టాయని అన్నారు. పోరాడి సాధించుకున్న మహిళా కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నారు. ఈ సభలో శ్రామిక మహిళలు ఐద్వా మహిళలు, ఉమా, రేణుక, సుగుణమ్మ శ్యామల ,చిట్టెమ్మ, భాగ్య ,పార్వతి, నారమ్మ, మంగమ్మ, నాగమ్మ, పార్వతి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి అండగా స్నేహితులు

కోహెడ, మార్చి 6 (జనంసాక్షి) :



వారంతా చిన్ననాటి స్నేహితులు కలిసిమెలిసి ఆటలాడుకుంటూ చదువుకున్నారు. పెరిగి పెద్దయి ఎవరికి వారు జీవితాలలో స్థిరపడ్డారు. ఇంతలో తమతో చదివిన చిన్ననాటి మిత్రుడు ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి కిందపడి అకాల మృతి చెందాడన్న విషయం తెలిసి చలించిపోయారు. ఎలాగైనా స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకోని బృందంగా ఏర్పడి చేయి చేయి కలిపి చేతనైనంత సాయాన్ని చేయాలనినిర్ణయించుకున్నారు. ఈ మేరకు నగదును సేకరించిన మొత్తాన్ని బ్యాంకు లో డిపాజిట్ చేసి మిత్రుడి భార్యకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే కోహెడ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో పదవ తరగతి తమతో చదివిన చిగురుమామిడి మండలం రేగొండ గ్రామానికి చెందిన చెంచెల సంపత్ ( 2000-2001 )పదవతరగతి బ్యాచ్ కు చెందిన బాల్యమి త్రులంతా కలిసి మృతుని ఆర్థిక పరిస్థితి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి సాయం చేయాలనే సంకల్పంతో ఒక లక్ష రూపాయల నగదు సేకరించి వారి ఇద్దరి ఆడబిడ్డల పేరిట పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ చేసి శుక్రవారం రోజున వారి కుటుంబ సభ్యులకు బాండ్ పేపర్ ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్యోన్యంగా కలసిమెలసి చదువుకున్న మంచి స్నేహితుడిని కోల్పోవడం బాధాకరం అని విచారం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కోహెడ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు ఎడ్ల రమేష్, కనకం రమేష్, ఆరె కిశోర్, వేల్పుల మహేష్ బాబు, బందెల అజయ్, వేముల శ్రీనివాస్,వేముల శ్రీనివాస్, మేకల సంపత్,మేకల అనిల్ తో పాటు తదితరులు ఉన్నారు.

# పల్లె ప్రజల ఆరోగ్యం కోసమే పల్లె దావఖానాలు

పల్లె దవాఖానాలను పరిశీలించిన జాతీయ క్వాలిటీ టీమ్

నాగిరెడ్డిపేట,మార్చి 8 (జనంసాక్షి)




మండలంలోని ఆత్మకూర్ ,బొల్లారం గ్రామాల పల్లె దావఖాన లను శుక్రవారం జాతీయ క్వాలిటీ టీమ్ అధికారులు స్టేట్ క్వాలిటీ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ రాధిక,జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ పద్మజ,క్వాలిటీ ప్రోగ్రామింగ్ మేనేజర్ జహీరా,స్థానిక డాక్టర్ సృజన్ కుమార్ సమక్షంలో పల్లె దవఖానాలను పరిశీలించి పలు సూచనలను చేశారు. స్టాక్ రిజిస్టర్ అటెండెన్స్ రిజిస్టర్ను పరిశీలించి దవాఖాన పరిశుభ్రంగా ఉంచాలని పలు సూచనలు సలహాలు చేశారు. అలాగే వైద్య సిబ్బంది ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి కావలసిన మందులను అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రజల ఆరోగ్యం కోసమే పల్లె దావకానలు తీసుకురావడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు పల్లె దావకాలను సద్వినియోగం చేసుకోవాలని బయట దావకానలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు పెట్టుకోకూడదని సూచించారు. పల్లె ప్రజల ఆరోగ్యం కోసం పల్లె దావకానలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సృజన్ కుమార్ వైద్య సిబ్బంది,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పోరాటాల ఫలితంగా దిగొచ్చిన సర్కారు

**రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**

**హైదరాబాద్ (జనంసాక్షి)**

బీసీలకు విద్య, ఉద్యోగ,రాజకీయ రంగాలలో రిజర్వేషన్స్ కల్పిస్తూ శాసనసభలో మూడు వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం బీఆర్ఎస్ పోరాటాల ఫలితమేనని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బీసీల న్యాయమైన హక్కులు, జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారంలో వాటా సాధనకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పోరాటానికి ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. కులగణన సర్వే అశాస్త్రీయంగా జరిగిందని, నివేదిక తప్పులతడకగా ఉందని తమ పార్టీ లెక్కలతో సహా నిరూపించడంతో ప్రభుత్వం రీసర్వేకు అంగీకరించడాన్ని ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. బీసీలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలంటూ,రాష్ట్ర మంత్రిమండలిలో సముచిత స్థానం లభించకపోవడంపై నిలదీయడం,కామారెడ్డి డిక్లరేషన్ అమలునకు బీఆర్ఎస్ పట్టుపట్టడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.అసెంబ్లీలో కేవలం బిల్లులు ప్రవేశపెట్టి చేతులు దులుపుకోవడంతోనే



సరిపెట్టకుండా,వాటి అమలునకు కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ చిత్తశుద్ధితో పార్లమెంటులో కొట్లాడితే తమ పార్టీ మద్దతునిస్తుందని ఎంపీ వద్దిరాజు చెప్పారు.అదేవిధంగా, కేంద్రంపై మరింత వత్తిడి పెంచి ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయించాలని,రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న 6 పదవులను బీసీలకిచ్చి ప్రాధాన్యత కలిగిన శాఖలు కేటాయించాలని ఎంపీ రవిచంద్ర కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు.

# ఉదయం గజగజ.. మధ్యాహ్నం చిట చిట

**తెల్లవారుజాము కమ్మేస్తున్న మంచు పొరలు**

**ఆదిలాబాద్ జిల్లాలో భిన్న వాతావరణం**

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)**



ఉదయం వేళలో గజ గజ మధ్యాహ్నం సమయంలో ఎండకు చిట చిట జిల్లాలో ఇప్పుడు నెల కొన్న పరిస్థితి. మామూలుగా చలి ప్రభావం శివరాత్రి వరకు ఉండి ఆ తరువాత కొద్ది కొద్దిగా ఎండ ప్రభావం కనిపించడం సహజం. కానీ ఇప్పుడు పరిస్థితి ఇంకోలా కనబడుతుంది. ఇటు చలి అటు ఎండ కలిసి తమ ప్రతాపం చూపిస్తున్నాయి. చలికాలంలో ఏవిధంగా చలి తీవ్రత ఉంటుందో ప్రస్తుతం ఉదయం వేళలో అచ్చం అదేవిధంగా చలి పెడుతుండడంతో జిల్లా ప్రజలు చలికి తాళలేక వణికిపోతున్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు చలి ప్రభావం కొనసాగుతుంది. తిరిగి మధ్యాహం నుంచి ఎండ తీవ్రస్థాయిలో దంచి కొడుతుంది. ఒక దిక్కు చలి ఇంకో దిక్కు ఎండలు తమ ప్రతాపం చూపిస్తుండడంతో అసలేం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఈ ప్రభావంతో కొంతమంది ప్రజలు జ్వరాల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. గత నాలుగు రోజులుగా జిల్లాలో భిన్నమైన వాతావరణం కనిపిస్తుండడంతో ఎక్కడ చూసినా ప్రజలు ఈ విషయం పైనే చర్చించుకుంటున్నారు. చలికాలం ఇపోయిన కూడ ఇంత చలి తీవ్రత ఉండడం విడ్డూరంగా ఉందని అనుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. చలి నుంచి రక్షించుకోవడం కోసం చలి మంటలను ఏర్పాటు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పట్టణాల్లో ఉదయం వేళలో మార్నింగ్ జాగింగ్ చేసేవారు స్వెట్టర్లు ధరించి వాకింగ్ చేస్తున్నారు. ఉదయం ఆరు గంటలైన ఇంకా చీకటిగానే కనిపిస్తుండడం విశేషం. ఒక దిక్కు చలి ఇంకో దిక్కు ఎండ ఎడా పెడా వాయిస్తుండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండ దాటికి ఇళ్లలోంచి బయటికి రాలేక పోతున్నారు. ఈ భిన్నమైన వాతావరణం ఇంకా ఎన్ని రోజులు ఉంటుందో తెలియని పరిస్తితి నెలకొంది. చలి ప్రభావం వల్ల ముఖ్యంగా వయో వృద్దులు, చిన్న పిల్లలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా అంతటా ఇదే వాతావరణ ఛాయలు నెలకొన్నాయి.

**కమ్మేస్తున్న తెల్లటి మంచు పొరలు**

చలి ప్రభావం తీవ్ర స్థాయిలో ఉండటం వల్ల జిల్లాను మంచు పొరలు కమ్మేస్తున్నాయి. తెల్లవారు జాము నుంచి ఉదయం వరకు తెల్లటి మంచు పొరలు అలుముకుంటున్నాయి. వాగులు వంకలు, అడవుల పైన మంచు పొరలు పరుగులు పెడుతూ జిల్లా ప్రకృతి మరింత అందంగా కనిపిస్తుంది.

# మహిళలు అన్నిరంగాల్లో ఉన్నతంగా ఎదగాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ బ్యూరో (జనంసాక్షి)**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని శివాజీ చౌక్ నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపి ప్రారంభించారు. బేటి బచావో బేటి పడావో, మహిళా సాధికారిక నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలందరూ స్వశక్తితో జీవితంలో ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. నేడు ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని అన్నారు. ప్రత్యేకంగా నిర్మల్ జిల్లాలో ఉన్నత స్థాయిలో అధికారులందరూ మహిళలే ఉన్నారని, ఇది చాలా గొప్ప విషయం అని తెలిపారు. మహిళా సాధికారితకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలుపరుస్తున్నాయని, అర్హులైన వారందరూ పథకాలాన్నింటినీ ఉపయోగించుకొని ఆర్థికంగా బలపడాలన్నారు. ఆడపిల్లల కోసం బేటి బచావో బేటి పడావో కార్యక్రమం అమలు పరిచి పది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా గత 45 రోజుల నుంచి జిల్లాలో పలు కార్యక్రమాల ద్వారా మహిళల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళల రక్షణకు తోడ్పడే పలు హెల్ప్ లైన్ నెంబర్లపై అన్ని విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మహిళలు పురుషుల కంటే ఏమీ తక్కువ కాదని, నేటి సమాజంలో అంతరిక్ష రంగంలో కూడా మహిళలు భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. జిల్లాలో జీవితంలో మహిళల ప్రాముఖ్యతపై పురుషులచే వ్యాసర చన పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లాలో మహిళలకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జి. రాధిక, ఆర్డిఓ రత్న కళ్యాణి, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎసిడిపిఓ లు నాగలక్ష్మి, నాగమణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, మెప్మా పీడీ సుభాష్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల పట్ల ఏంటీ నిర్లక్షం?




**నిరసనకు దిగిన ఉపాధి కూలీలు**

**ఝరాసంగం, మార్చి 7(జనం సాక్షి):**

ఉపాధి హామీ పథకంలో తమకు సరిగా కూలీ పని కల్పించడం లేదని, పని చేసిన తరువాత కొలతలు కూడా తమే చేసుకోవాల్సి ఉందని మండల పరిధిలోని తుమ్మన్ పల్లి గ్రామానికి చెందిన సుమారు 30 మంది ఉపాధి కూలీలు శుక్రవారం ఎంపిడిఓ సుధాకర్ కు మొర పెట్టుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుకు వ్యతిరేకంగా కూలీలు ఎంపిడిఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. తమకు నెల రోజుల నుంచి సరిగా కూలీ కల్పించడం లేదన్నారు. కప్పాడ్ గ్రామానికి చెందిన వ్యక్తిని తమ గ్రామానికి ఫిల్డ్ అసిస్టెంట్ గా నియమించడంతో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడన్నారు. పని విషయంలో ఏదైనా అడుగుతే సరైన సమాధానం ఇవ్వడం లేదు. ఇష్టం ఉంటే చేయండి లేదంటే పని మానుకొండని తమకు దబాయిస్తున్నాడని వారు వాపోయారు. ఈ విషయంపై ఫీల్డ్ అసిస్టెంట్ కు ఎంపిడివో ఫోన్ చేసి ఆయన పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు పని కల్పించకపోతే విధుల నుంచి తొలగించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. విధులకు సక్రమంగా హాజరు కాని ఉపాధి హామీ ఈసి ప్రతాప్ రెడ్డి పై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి

**యువతకి స్వయం ఉపాధి అందేలా**

**రుణాలను సత్వరం మంజూరు చేయాలి**

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 7 (జనంసాక్షి)**



ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ బ్యాంకర్లను ఆదేశించారు .శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో డీసీసీ,డీ ఎల్ఆర్సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే సామాజిక పింఛన్లను కొన్ని బ్యాంకులు వివిధ రుణాల కింద జమ్మ చేసుకుంటున్నట్లు సమాచారం అందుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం అందించే పథకాలు సొమ్మును రుణాల కింద జమ చేసుకోవడానికి వీలు లేదని, వెంటనే సంబంధిత లబ్దిదారులకు ఆ సొమ్మును చేర వేయాలని,లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేసే బ్యాంకుల పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.గత సమావేశంలో జిల్లాలో 3 కొత్త బ్యాంకులో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని,ప్రస్తుతం చందుర్తి మండలం మల్యాల గ్రామంలో యూబిఐ బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయని, రుద్రాంగి మండలం, కొనరావుపేట్ మండలంలో కూడా బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రామీణ స్థాయిలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు.బ్యాంకుల ద్వారా ప్రజలకు అందే రుణాలు పెరగాలని, జిల్లాలో డిసెంబర్ 31 నాటికి క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి 128.81శాతం ఉందని, జిల్లాలో ప్రతి బ్యాంకు సిడి నిష్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలోని రైతులకు పంట రుణాల క్రింద రూ 1,519 కోట్లు పంపిణీ చేయడం లక్ష్యం కాగా డిసెంబర్ చివరి నాటికి రూ 808 కోట్ల పంపిణీ చేశామని, పెండింగ్ లక్ష్యాన్ని చివరి క్వార్టర్ లో యాసంగి పంటకు పూర్తి చేసేందుకు కృషి చేయాలని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ పంట పెట్టుబడి కోసం పంట రుణాలు బ్యాంకుల నుంచి మాత్రమే తీసుకునేలా చూడాలన్నారు.వ్యవసాయ టర్మ్ రుణాల కింద రు 421 కోట్ల రుణ పంపిణీ లక్ష్యానికి గాను రూ 405 కోట్ల 92 లక్షల రుణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయడాన్ని కలెక్టర్ అభినందించారు. రైతుల రుణాలకు రైతు భరోసా నిధులను కొన్ని బ్యాంకులు ఆపుతున్నాయని,ఈ ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని ప్రభుత్వం అందించే సహాయాన్ని రైతులకు తప్పనిసరిగా అందించాలన్నారుజిల్లాలో వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు తోడ్పాటు అందించాలన్నారు. ఎంఎస్ఎంఈ లకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ 559 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం కాగా రూ 280 కోట్ల రుణం పంపిణీ చేయడం జరిగిందన్నారు.ప్రతి బ్యాంకు బ్రాంచీ నుంచి కనీసం 5 వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ కు చర్యలు చేపట్టాలని, అర్హులైన యువతకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు.జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్చి 5 నాటికి 3 వేల 997 స్వశక్తి సంఘాలకు 498 కోట్ల 64 లక్షలు, మెప్మా కింద 444 సంఘాలకు 54 కోట్ల 7 లక్షల బ్యాంకు రుణాలు అందించామని అధికారులు తెలిపారు. స్వశక్తి సంఘాలకు నిర్దేశించుకున్న లక్ష్యంలో 93 శాతం పూర్తి చేసామని, పెండింగ్ లక్ష్యాన్ని మార్చి నెలాఖరు నాటికి చేరుకోవాలన్నారు.

స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు వివిధ పథకాల క్రింద యువతకు రుణాలు అందించాలని, స్టాండ్ అప్ ఇండియా క్రింద డిసెంబర్ చివరి నాటికి 11 యూనిట్లకు కోటి 36 లక్షల, ముద్రా రుణాల కింద 6 వేల 280 మంది లబ్ధిదారులకు 75 కోట్ల 35 లక్షల రుణాలు అందించామన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద ప్రస్తుత సంవత్సరంలో ఫిబ్రవరి 19 నాటికి రూ 7 కోట్ల 98 లక్షల విలువగల 161 యూనిట్లను గ్రౌండ్ చేయడం జరిగిందని, యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని,ఈ పథకాల పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు.

# యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలి

**యూత్ డిక్లరేషన్ హామీలన్నింటిని అమలు చేయాలిడివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్**

**హైదరాబాద్ (జనంసాక్షి)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాబోయే వార్షిక బడ్జెట్ లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలని,యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్ అనగంటి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హమినిచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నిరుద్యోగ భృతి గురించి ఊసెత్తడం లేదని అన్నారు. రాబోవు వార్షిక బడ్జెట్ లో నిరుద్యోగ భృతి కి నిధులు కేటాయించాలని, యువతకు ఉపాధి అవకాశాలకు 1000 కోట్ల రూ.లతో యూత్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. యువతకు స్వయం ఉపాధి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియమాక నోటిఫికేషన్స్,పరీక్షల నిర్వహణకు సంబం ధించి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ఫిబ్రవరిలో జాబ్ క్యాలండర్ ను ప్రకటించినా ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉద్యోగ నియామకాలను చేపట్టాలన్నారు. ఉద్యోగాలు ఇచ్చేంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి నాలుగువేల రూపాయలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేయడంతో తీవ్రమైన ఇబ్బందులుపడ్డారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులను చేయకుండా నిరుద్యోగ యువతకు పారదర్శకంగా ఉద్యోగాల నియమకాలు చేపట్టాలన్నారు. యూత్ డిక్లేషన్ హామీలన్నింటిని ప్రభుత్వం అమలు చేయాలన్నా రు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.తిరుపతి,గడ్డం వెంకటేష్, జావెద్,శివవర్మ,క్రిష్ణనాయక్,జి.కార్తీక్ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్,హష్మీ, నరేష్,శ్రీకాంత్, ప్రవీణ్,సాగర్, శ్రీను పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 7 (జనంసాక్షి) :**



జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అదనపు కలెక్టర్లో కలిసి శుక్రవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జనార్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, నాయబ్ తహసీల్దార్ అనీల్, వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

**రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు**

**సంగారెడ్డి ప్రతినిధి, మర్చి 07 (జనంసాక్షి)**



వ్యవసాయానికి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని రైతు సంగం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ శాఖ యస్. ఈ. శ్రీనాథ్ కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతు జిల్లా వ్యవసాయం కు విద్యుత్ కోతలు అరికట్టి నాణ్యమైన విద్యుత్ ను అందించాలని ప్రభుత్వం ను కోరారు. కరెంట్ కోతల వలన కొండాపూర్, సంగారెడ్డి కంది సదాశివపెట్, పుల్కల్ చౌతాకూర్ హతనురా మండలంలో బోర్ మోటార్ ఖాళీ పోయి, పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారని అన్నారు. రైతులపై అదనపు భారం పడుతున్నదని అన్నారు. అనేక చోట్ల విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని వాటిని సరిచేయాలని అన్నారు. మండలాలలో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సమస్యను పరిష్కారం చేస్తామని యస్ఈ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం రైతు అధ్యక్షులు రాజయ్య, నాయకులు శ్రీనివాస్, మాణిక్ రెడ్డి, అశోక్ రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

# బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ భేష్

**ఇన్ స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు 50 మంది ఎంపిక**

**విద్యార్థులను అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్ (జనంసాక్షి) :**



విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసే ఇన్ స్పైర్ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన 50 మంది బీసీ గురుకుల విద్యార్థులను బీసీ సంక్షేమ, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న పది నుంచి 15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 50 మంది బీసీ గురుకుల విద్యారులు ఎంపిక కావడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు తమ తెలివితేటలతో ఎన్నో కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారని, వారి లోని ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ వారిని ఇన్ స్పైర్ లాంటి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాని ఆయన సూచించారు. ఇన్ స్పైర్ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్ లో పదివేల రూపాయలు జమ అవుతాయని, ఈ డబ్బుతో వారి ఆలోచన మేరకు ప్రాజెక్ట్ ను చేసి ప్రదర్శనలో ఉంచాలని ఆయన సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులను స్కూల్ స్థాయి నుంచే భాగస్వామ్యులను చేసేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమంగా నిలిచిన ప్రాజెక్ట్ ను జాతీయస్థాయిలో ప్రదర్శిస్తారని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ప్రతిభకు సృజనాత్మకత జోడించి ప్రాజెక్ట్స్ చేయాలని ఆయన సూచించారు. సామాజిక ప్రయోజనం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ప్రాజెక్ట్స్ చేయడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి సరికొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు రాణించినప్పుడే భవిష్యత్ లో వారు గొప్పగొప్ప సైంటిస్ట్ లుగా ఎదుగుతారన్నారు. విద్యార్థులకు కావల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని విజ్ఞానం పెంచుకోవడం, సృజనాత్మకత పెంపొందించుకోవడం ద్వారా తమ భవిష్యత్ ను గొప్పగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు.ఇన్ స్పైర్ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన 50 మంది విద్యార్థులను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంజెపి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. భవిష్యత్ లో ఇలాంటివి మరెన్నో సాధించాలని సూచించారు.

# అనధికార లేఔట్లకు 25 శాతం రాయితీ

**గద్వాల నడిగడ్డ, మార్చి 7 (జనంసాక్షి)**



అనధికార లే ఔట్ల క్రమబద్దికరణ ఈ నెల 31వ తేదీలోగా చేసుకుంటే 25 శాతం రాయితీ, అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు సంబంధిత అధికారు లతో కలిసి లేఅవుట్ ల క్రమబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ ఎస్ కొరకు జిల్లాలో మొత్తం 46,739 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది, ఇందులో 14,241 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఎల్1 అధికారులు పరిశీలించి సక్రమంగా ఉన్నందున డబ్బులు కట్టెందుకు కోరడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటి వరకు 254 మంది మాత్రమే డబ్బులు కట్టగా మిగతావారు కట్టాల్సి ఉందని తెలిపారు. మార్చి 31వ తేదీ వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే వీరికి చెల్లించాల్సిన రుసుములో 25 శాతం మినహాయింపు ఉన్నందున, వెంటనే సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి అందరితో డబ్బులు కట్టించే విధంగా చూడాలన్నారు.

# ఎంఎస్ఎంఈల అభివృద్ధికి అండగా ఉంటాం

- కొందరు స్వార్థ రాజకీయాల కోసం పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ దుష్ప్రచారం
- ఐటీ పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు




మంథని, (జనంసాక్షి) : ఎంఎస్ఎంఈల అభివృద్ధికి అండగా ఉంటామని ఐటీ పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం బంజారాహిల్స్ లోని తాజ్ డెక్కన్‌లో 'ఎంఎస్ఎంఈ స్పార్క్ 2.0' పేరిట ఏర్పాటు చేసిన సదస్సును మంత్రి శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా. మాల్సూర్, ఎస్‌బీఐ లోకల్ ఆఫీస్ సీజీఎం రాజేష్ కుమార్, ఎఫ్ టీసీసీఐ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అత్యధిక మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు కోరానన్నారు. దురదృష్టవశాత్తు వాళ్లు పట్టించుకోలేదని, తాం అధికారంలోకి రాగానే తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఎంఎస్ఎంఈల అభివృద్ధిపై దృష్టి సారించామని, అన్ని రకాలుగా అండగా ఉంటామని, మన ఎంఎస్ఎంఈలు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటేలా అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా పాలసీని తీసుకొచ్చాం. ఎంఎస్ఎంఈ నిర్వాహకులకు మరింత ప్రయోజనం చేకూరేలా వారిని భాగస్వామ్యం చేస్తూ ఈ పాలసీకి సంబంధించిన ఆపరేషనల్ గైడ్ లైన్స్‌ను తీసుకొస్తామన తెలిపారు. తెలంగాణ బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేసేందుకు ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ ఏర్పాటు చేస్తామని, ఈ క్లస్టర్ల ఏర్పాటులో నిపుణులను భాగస్వామ్యం చేస్తామని, వారి సలహాలు, సూచనలతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వీటిని ఏర్పాటు చేస్తామని, ఎంఎస్ఎంఈల నిర్వాహకులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యంగా వారి ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం తరఫున సహకరిస్తామని, మన దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఎంఎస్ఎంఈలకు రుణాల మంజూరులో బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం తరఫున చొరవ తీసుకుంటామని, ఎంఎస్ఎంఈల నిర్వాహకులు సాంప్రదాయబద్ధంగా కాకుండా కొత్తగా ఆలోచించాలని, వస్తువుల ఉత్పత్తికే 100 శాతం పెట్టుబడి పెట్టొద్దని, మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని, అలా మిగిలిన పెట్టుబడిని మార్కెటింగ్, సేల్స్ కోసం వినియోగించాలని, పరిశ్రమల శాఖ తరఫున ఎఫ్ టీసీసీఐ లాంటి సంఘాలను భాగస్వామ్యం చేసి ఎంఎస్ఎంఈల నిర్వాహకులకు ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీ వినియోగంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సరిదిద్దుతూనే.. ఈ బకాయిలను విడతల వారీగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల చివరి నాటికి రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల బకాయిలను పారిశ్రామికవేత్తలకు చెల్లిస్తామని, కొందరు తమ స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, ఎవరెన్ని రకాలుగా ప్రచారం చేసినా.. రాష్ట్రానికొచ్చే పెట్టుబడులు ఆగడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ ఏడాది దావోస్ పర్యటనలో రూ.1.78 లక్షల కోట్లు పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటాం. తెలంగాణ యువతలో ప్రతిభకు కొదువ లేదు. కొత్తగా ఆలోచించాలి. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి. పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నా. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తాం అని స్పష్టం చేశారు.

# ఉత్పత్తి వ్యయం తగ్గినప్పడే మరింత సంక్షేమం సాధ్యం

- ఉద్యోగుల పని సంస్కృతి మెరుగు పడాల్సిన అవసరం ఉంది
- 38వ నిర్మాణాత్మక సమావేశంలో సీఎండీ ఎన్.బలరామ్
- సింగరేణి సుస్థిర భవిష్యత్ కోసం సంపూర్ణ సహకారం
- నూతన గనుల సాధన, బొగ్గు ధరల తగ్గింపునకు తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు
- ప్రగతితో సంక్షేమమూ కలిసి నడవాలన్నదే మా అభిమతం
- గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)

పోటీ మార్కెట్లో నిలదొక్కుకోవాలంటే సింగరేణి బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గాల్సిన అవసరం ఉందని.. అలా జరిగితే ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడంతోపాటు మరిన్ని నూతన పథకాలను ప్రారంభించుకోవడానికి అవకాశం ఉంటుందని సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తో జరిగిన 38వ నిర్మాణాత్మక సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ బొగ్గు అమ్మకం ధరలు కోల్ ఇండియా ధరల కన్నా, విదేశీ బొగ్గు ధరతో పోల్చితే ఎక్కువగా ఉంటున్నాయని, కనుక మన బొగ్గుకు క్రమంగా డిమాండ్ తగ్గుతోందని, ఇది చాలా ఆందోళనకరమని పేర్కొన్నారు. భూగర్భనుల్లో ఉత్పత్తి వ్యయం టన్నుకు 12 నుంచి 16 వేల రూపాయలకు చేరుకుంటుందన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించాలంటే ఉద్యోగులు పూర్తి పని గంటలు సద్వినియోగం చేస్తూ యంత్రాలను పూర్తిగా వినియోగించాలన్నారు. గైర్హాజరీలు చేస్తున్న కార్మికులపై తీసుకునే కఠిన చర్యలకు సహకారం అందించాలని, తద్వారా క్రమశిక్షణను పెంచడం సాధ్యమవుతుందన్నారు. నాణ్యత పెంపుదలకు మరింత కృషి జరగాలన్నారు. ఈ అంశాలను సవాళ్లుగా స్వీకరించాలన్నారు. నేడు ప్రపంచం థర్మల్ విద్యుత్ నుండి సోలార్ విద్యుత్తు, ఇతర గ్రీన్ ఎనర్జీ విధానాల వైపు అడుగులు వేస్తోంది కనుక సింగరేణి సంస్థ కూడా తన మనుగడ కోసం సోలార్ విద్యుత్తు, కీలక ఖనిజాల ఉత్పత్తి వంటి వ్యాపార విస్తరణ చర్యలను చేపట్టాల్సి వస్తోందన్నారు. కార్మిక సంఘాలు కంపెనీ ఆర్థిక స్థితిగతులు అర్థం చేసుకొని కార్మికుల్ని చైతన్య పరచాలని. కంపెనీ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సింగరేణి అభివృద్ధిలో కార్మికులు కీలకపాత్ర పోషిస్తుంటారని, కంపెనీ అభివృద్ధితోపాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యతనిస్తే సింగరేణికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గతంలో సింగరేణి సంస్థను కష్టాల నుండి కాపాడడానికి కార్మికులు ఎన్నో త్యాగాలు చేశారని, ఇప్పుడు కూడా కంపెనీని అగ్రస్థానంలో నిలపడానికి కార్మికులు తమ వంతు కృషి చేస్తారన్నారు. అయితే కేవలం కంపెనీ ఉత్పత్తిని మాత్రమే దృష్టిలో పెట్టుకోకుండా కార్మిక సంక్షేమానికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని రూపొందించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, సింగరేణి ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని ఆయన కోరారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ గుర్తింపు కార్మిక సంఘం ద్వారా వివరించిన సమస్యలపై చర్యలు తీసుకుంటామని, ఆర్థిక పరమైన సమస్యలపై కమిటీలు వేసి చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ లో సింగరేణి తరఫున ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రతిపాదనకు ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. కార్మికులకు సొంత ఇంటి పథకం సాధ్యాసాధ్యాలపై ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్.వి.సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు(పి అండ్ పి), ఈడీ(కోల్ మూమెంట్) ఎస్ డి.ఎం.సుభానీ, జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం శ్రీమతి కవితా నాయుడు, జీఎంలు పాల్గొన్నారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్ తో పాటు వివిధ ఏరియా నుండి హాజరైన గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధులు అనేక ఉత్పత్తి సంబంధ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు.

## సంస్థ ఛైర్మన్ పని విధానానికి ప్రశంసలు

ఈ సమావేశంలో పాల్గొన్న కార్మిక నాయకులు కొందరు మాట్లాడుతూ.. సంస్థ ఛైర్మన్ ఎన్. బలరామ్ ఎంతో సాదాసీదాగా కార్మికులతో కలిసిపోయి వారి సమస్యలు తెలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఒక ఛైర్మన్ గా కంటే కార్మిక నాయకునిగా కార్మికుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారన్నారు.. గతంలో కార్మికులు ఛైర్మన్ ని కలవడం అనేది ఎంతో అసాధ్యంగా ఉండేదని, అయితే ఎన్.బలరామ్ ను అందరూ కలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఆయన నిర్వహించిన చైతన్య యాత్రలో కార్మికులు నుండి అనేక సలహాలను ఆయన స్వయంగా విన్నారని, వీటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

# గాంధీ భవన్‌కు ఫీనిక్స్ కంపెనీ బాధితులు

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు



హైదరాబాద్, మార్చి 7 (జనంసాక్షి) : టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు ఫీనిక్స్ కంపెనీపై మొబైల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి లో మొబైల్ సొసైటీ సభ్యుల 128 మంది శుక్రవారం గాంధీ భవన్ కు విచ్చేసి మహేష్ కుమార్ గౌడ్ గారికి ఫీనిక్స్ కంపెనీ ఎండి గోపి కృష్ణ, చుక్కలపల్లి సురేష్ లపై పై ఫిర్యాదు చేశారు. ఫీనిక్స్ కంపెనీ తప్పుడు పత్రాలను సృష్టిస్తూ హై కోర్ట్ తీర్పు కు వ్యతిరేకంగా తమ భూములలో అక్రమంగా దౌర్జన్యం చేస్తూ అక్రమనించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి లో 1991 లో అప్పటి ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిందని అప్పటి నుంచి తామే అక్కడ ఉన్నామని కానీ ఫీనిక్స్ కంపెనీ వాళ్ళు దొంగ డాక్యుమెంట్లను సృష్టించి తమ భూములపై అజమాయిషీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కోరారు.

# జలదోపిడీ జరుగుతున్నా పట్టించుకోరా?

- ఇంత మొద్దునిద్ర సీఎంను నేనెప్పుడూ చూడలేదు : హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 7 (జనంసాక్షి) : కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం తీసుకెళ్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లుండి చూడలేకపోతున్నారని, ఇలాంటి మొద్దునిద్ర సీఎంను నేనెప్పుడూ చూడలేదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల కృష్ణా నీళ్ల తరలింపు కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర చేస్తుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల ద్వారా గోదావరి వరద జలాలనే తీసుకువెళ్తున్నాం, తెలంగాణకు నష్టం లేదు అని ఏపీ నీళ్ల మంత్రి అంటే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ మౌనం వహించడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉందన్నారు. గోదావరి, కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను ఏపీ ఇష్టారాజ్యంగా తరలలించే కుట్రలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఉత్తం కుమార్ రెడ్డి సహా ఒక్క నాయకుడికి పట్టింపు లేదు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. "బనకచర్ల తో తెలంగాణకు ఏమి నష్టం" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా మాట్లాడి మూడు రోజులైనా ఒక్కరూ గట్టిగా స్పందించ లేదు. అక్రమంగా నీటిని తరలించుకు పోతుంటే మొద్దు నిద్రలో ఉంటారా..? చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదా? చంద్రబాబుతో బీజేపీ, రేవంత్ దోస్తీ చేస్తూ తెలంగాణను మోసం చేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బాబు, రేవంత్, బీజేపీ మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి? బిఆర్ఎస్ పార్టీ గొంతెత్తినా మీకు చలనం కలగదా? కాంగ్రెస్, బిజెపి తీరు తెలంగాణ తాగు, సాగు నీటి రంగానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నది. తెలంగాణ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ పడుతున్న ఆరాటం మీకు ఎలాగూ అర్థం కాదు, కనీసం మీడియాలో వస్తున్న కథనాలను చూసైనా కదలండి. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి. కేంద్రాన్ని నిలదీయండి. రేవంత్ సహా బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వీడండి! అని హరీశ్‌రావు సూచించారు.

# ఏప్రిల్‌లోగా బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నిక: లక్ష్మణ్



న్యూఢిల్లీ, మార్చి 7 (జనంసాక్షి) : ఏప్రిల్ లోపు భాజపా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక పూర్తవుతుందని ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస అనేది గత చరిత్ర అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా భాజపా ఎదిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులను పోటీలో పెట్టిన ఏకైక పార్టీ తమదని చెప్పారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న భారాసకు అభ్యర్థులను నిలబెట్టలేని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసగించిందని విమర్శించారు. ప్రజలను ఆర్థికంగా శక్తిమంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమన్నారు.

# నిజాం కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

- మౌలిక వసతుల పెంపునకు కృషి : ప్రిన్సిపాల్

హైదరాబాద్, మార్చి 7 (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలో 138 ఏండ్ల చరిత్ర కలిగిన నిజం కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ వరించింది. ఈ మేరకు శుక్రవారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మెయిల్ ద్వారా కళాశాలకు ఏ గ్రేడ్‌ను ప్రకటించింది. దీంతో కళాశాలలో ప్రిన్సిపాల్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఏవి రాజశేఖర్ మాట్లాడుతూ.. కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది సమిష్టి కృషితోనే కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ వరించిందన్నారు. కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఉత్సాహంతో అకాడమిక్‌ను అభివృద్ధి పరచడంతో పాటు మౌలిక వసతులను మరింత పెంపొందిస్తామని తెలిపారు. 138 ఏళ్ల చరిత్ర కలిగిన నిజాం కళాశాలకు ప్రస్తుతం బి ప్లస్ ప్లస్ గ్రేడ్ ఉండేదని అన్నారు. కళాశాల మొత్తంలో కేవలం 14 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీలతో కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్‌ను ఆయన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి నిజాం కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ వచ్చిందని తెలిపారు. దీంతో వీసీ ప్రిన్సిపాల్ ఏవి రాజశేఖర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ రేణుక, ప్రొఫెసర్ అబ్కా నాగేశ్వరరావు, డాక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవిద్య చదువుకు కేటీఆర్ అండ

- రెండేళ్ల ఫీజు చెల్లింపు



హైదరాబాద్, మార్చి7 (జనంసాక్షి) : సరైన పత్రాలు లేకపోవడం హైదరాబాద్ సనత్ నగర్ దాసారం బస్తీకి చెందిన మల్లెల శ్రీవిద్య అడ్మిషన్‌ను స్కూల్ యాజమాన్యం రద్దు చేసింది. బాగా చదువుకోవాలని ఆశపడ్డ శ్రీవిద్యకు ఆధార్ రూపంలో ఎదురైన సమస్య గురించి పత్రికలో వచ్చిన వార్తకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తన కార్యాలయ సిబ్బందిని శ్రీవిద్య ఇంటికి పంపించి తల్లిదండ్రులతో మాట్లాడించారు. ఆధార్, బర్త్ సర్టిఫికేట్ ఇప్పించడంలో సహాయం చేస్తామన్నారు. ఇంతేకాదు శ్రీవిద్య తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న కేటీఆర్, ఆమె చదువు ఆగిపోవద్దనే ఉద్దేశంతో రెండు సంవత్సరాల స్కూల్ ఫీజును చెల్లించారు. భవిష్యత్తులో శ్రీ విద్య చదువుకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని చెప్పారు. కేటీఆర్ చొరవతో సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి అవసరమైన సర్టిఫికెట్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.తమ సమస్య గురించి తెలుసుకుని శ్రీవిద్య జీవితానికి కొత్త వెలుగు అందించిన కేటీఆర్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పత్రికలో వార్త వచ్చిన తరువాత అధికారులు నామమాత్రంగానే స్పందిం చారని చెప్పారు. రెండు సంవత్సరాల ఫీజు ముందే కట్టడంతో పాటు భవిష్యత్తులోనే శ్రీవిద్య చదువుకు అయ్యే పూర్తి ఖర్చును భరిస్తానన్న కేటీఆర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

# పసుపు ధరలపై రైతుల ఆందోళన

- గిట్టుబాటు ధరల కోసం చూపు

నిజామాబాద్, మార్చి7 (జనంసాక్షి) : నిజామాబాద్ పసుపు మార్కెట్‌లో ధరలు దక్కడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పసుపు బోర్డు ప్రకటించినా అది పూర్తిస్థాయిలో తనపనిని చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఎగుమతులు పెరుగుతున్నాయని, తొందరపడి అమ్ముకోవద్దని సూచించారు. పసుపుబోర్డుతో మేలు జరుగుతుందని అన్నారు. అయితే నిజామాబాద్ జిల్లాతోపాటు జగిత్యాల, నిర్మల్ జిల్లాల నుంచి వేల పసుపు బస్తాలను తీసుకొస్తున్న రైతుల సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారు. మద్దతు ధర, ఇతర సమస్యను తీర్చేవారే కరువయ్యారు. పసుపు రైతులను ఏళ్ల తరబడి ఎన్నికలకు అస్త్రాలుగా వాడుకొని లబ్ది పొందిన నేతలు పసుపు ధరపై పట్టించుకోవడం లేదు. నిజామాబాద్ మార్కెట్ లో పసుపు ధర రోజురోజుకూ తగ్గుతోంది. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న రైతులకు ఈ యేడు వచ్చినంత తక్కువగా ఏ సంవత్సరం రాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు కొనుగోళ్లపై దృష్టి సారించకపోవడం వల్ల ధర పెరగలేదు. జాతీయ, అంతర్జాతీయ ప రిస్థితుల నేపథ్యంలో వ్యాపారులు ఒడిదొడు కులను, పాత స్టాక్‌ను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు చేస్తున్నారు. గత సంవత్సరం కంటే తక్కువ ధరకు పసుపు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. భారీగా పసుపు వచ్చిన ధర మాత్రం మారడంలేదు. పసుపునకు మద్దతు ధర కల్పిస్తాం అని ఏళ్ల తరబడి వాగ్దానాలు చేస్తున్నా ధరలు మాత్రం రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ధర నిర్ణయిస్తే తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. ఈ అయిదేళ్లలో పసుపు ధర భారీగా తగ్గింది. కూలీలు, ధరలు, ఎరువులు, ఇతర రసాయనాల ధరలు పెరిగాయి. రైతులకు మ్యాచింగ్ గ్రాంట్‌లాగా నిధులను విడుదల చేసి పసుపు రైతులకు ఇవ్వాలని కోరుతున్నారు.

# నాడు ఎల్ఆర్ఎస్ వద్దన్న రేవంత్.. ఇప్పుడెలా అమలు చేస్తున్నారు?

- బీఆర్ఎస్ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి మండిపాటు



హైదరాబాద్, మార్చి7 (జనంసాక్షి) : ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్ వద్దన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్ ముద్దు అంటున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత పుట్ట విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో హర్షవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డితో పాటు ఆయన మంత్రివర్గం గతంలో చెప్పినట్టు ఎల్ఆర్ఎస్ వంద శాతం ఉచితంగా, తెలంగాణ ప్రజలపై ఎటువంటి భారం పడకుండా, ఎట్లాంటి ఫీజులు వసూలు చేయకుండా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కొత్త పెట్టుబడులు దేవుడెరుగు ఉన్న పెట్టుబడులు తరలిపోతున్నాయని తెలిపారు. కేసీఆర్ హయాంలో పెట్టుబడులు వస్తే.. రేవంత్ పాలనలో పెట్టుబడులు తరలిపోతున్నాయి. కక్షపూరిత చర్యలు మానుకుని సీఎం రేవంత్ రెడ్డి పా లనపై దృష్టి పెట్టాలి అని సూచించారు. గర్వంగా చెప్తున్నాం.. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉఉందన్నారు. కేసీఆర్ పాలనలో 9 ఏండ్లలో రూ. 4 లక్షల కోట్లు పెట్టుబడులు ఆకర్షించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో మల్టీ నేషనల్ కంపెనీలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో అవినీతి, దోపిడీ, విధ్వంస పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. ప్రీమియర్ ఎనర్జీస్, అమరరాజ లాంటి కంపెనీలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయి. కాంగ్రెస్ పాలనలో ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. హైడ్రా వలన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కుదేలైందని చెప్పారు. గతంలో ఎల్ఆర్ఎస్ వద్దన్న కాంగ్రెస్ ఇప్పుడు ఎల్ఆర్ఎస్ వసూలు చేస్తోందని.. రెవెన్యూ కోసం గచ్చిబౌలి లాంటి ప్రాంతాల్లో 400 ఎకరాలు అమ్మకానికి పెట్టారని హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370

# తెలంగాణాలో రాబోయే కాలంలో మరిన్ని పెట్టుబడులు

- ఇప్పటికే ఉన్న ప్లాంట్లో ఐదు వేల మంది ఉద్యోగులు
- ఈ ఆర్థిక సంవత్సరంలో మరో ప్లాంట్ ప్రారంభానికి చర్యలు
- ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సలుజా



**హైదరాబాద్, మార్చి 7 (జనంసాక్షి) :** తెలంగాణాలో రాబోయే కాలంలో మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సలుజా తెలిపారు. తెలంగాణలో 2 గిగావాట్ల సోలార్ సెల్, 4.1 గిగావాట్ల సోలార్ మోడ్యూల్ తయారీ కేంద్రం కలవన్నారు. ఈ తయారీ కేంద్రాలలో సుమారు ఐదు వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని చెప్పారు. ప్రీమియర్ ఎనర్జీస్ భవిష్యత్తు ప్రణాళికలు తెలిపేందుకు బంజారా హిల్స్ లోని తాజ్ కృష్ణ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్, డైరెక్టర్ సుధీర్ రెడ్డిబీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నంద్ కిషోర్ ఖండేల్వాల్‌బీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ డైరెక్టర్ రేవతి రోహిణిబీ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీమియర్ ఎనర్జీస్ కు ఈ రంగంలో 30 ఏళ్ల అనుభవం కలదన్నారు. తెలంగాణాలో ప్రధాన కార్యాలయం ఉందన్నారు. మొదట తెలంగాణలో 4 గిగావాట్ల సెల్, మోడ్యూల్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 3000 కోట్ల పెట్టుబడితో ఐదు వేల మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. అయితే, పునరుత్పాదక ఇంధన మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో.. భౌగోళిక విస్తరణతో పాటు ఇంగాట్, వాఫర్ తయారీ, సోలార్ అల్యూమినియం ఫ్రేమ్ ఎక్స్‌ట్రూషన్, సెల్, మోడ్యూల్ ఉత్పత్తి విస్తరణ చర్యలు చేపట్టామన్నారు. ఈ వ్యూహాత్మక కారణాలతో కొన్ని పెట్టుబడులను ఇతర రాష్ట్రాలకు మళ్లించామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో కొత్త పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నామన్నారు.




## 'ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్-25' పదవ ఎడిషన్

**ఖైరతాబాద్, మార్చి 7 (జనంసాక్షి) :** దేశంలో ప్రభావ వంతమైన ఆవిష్కరణలను నడిపించడంలో అగ్రగామి ఐన మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎంఐఎఫ్) తన ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్నోవేష న్ ఐకాన్స్ 10వ ఎడిషన్‌ను జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో విజయవంతంగా నిర్వహించిందని మా రికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ గవర్నింగ్ కౌన్సిల్,గౌర వ చైర్‌పర్సన్ అమిత్ చంద్ర శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ వ్యాపార, సామాజిక ప్రభావ నిపుణుల నేతృత్వంలోని రెండు కఠినమైన జ్యూరీ రౌండ్ల ద్వారా ఏడుగురు మార్గదర్శక ఆవిష్కర్తలను ఎంపిక చేసి సత్కరించినట్లు తెలిపారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 410 | ₹ 49.2 |
| వరంగల్ | ₹ 412 | ₹49.4 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| ₹ 86,280 (24 క్యారెట్లు) | ₹ 79,090 (22 క్యారెట్లు) |
|---|---|

చెన్నై

| ₹79,191 (22 క్యారెట్లు) | ₹86,390 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹97,790

# స్వల్ప లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్



**ముంబాయి :** వివిధ దేశాలపై అమెరికా టారిఫ్‌లతో అంతర్జాతీయంగా భారీ స్థాయిలో అనిశ్చితి కొనసాగుతుం డటంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది. ఫలితంగా దేశీయ స్టాక్ మార్కెట్లలో శుక్రవారం ప్రారంభ లాభాలు ఆవిరయ్యాయి. ఈక్విటీ మార్కెట్లలో వరుసగా రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 7.51 పాయింట్ల పతనంతో 74,332.58 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో మిడ్ సెషన్‌లో 246.34 పాయింట్లు లాభ పడి 74,586.43 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లింది. మరోవైపు, ఎన్ఎస్ఈ -50 సూచీ నిఫ్టీ 7.80 పాయింట్లు వృద్ధి చెంది 22, 552.50 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్ లో నిఫ్టీ 89 పాయింట్ల వృద్ధితో 22,633.80 పాయింట్ల గరిష్ట స్థాయికి చేరుకుంది.
బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో జొమాటో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టైటాన్, పవర్ గ్రిడ్, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), టెక్ మహీంద్రా, ఐటీసీ తదితర స్టాక్స్ లాభ పడ్డాయి. మరోవైపు, రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్ తదితర స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. ఏషియన్ మార్కెట్‌లలో టోక్యో, షాంఘై, హాంకాంగ్, సియోల్ మార్కెట్లు, యూరోపియన్ మార్కెట్‌లు నష్టాలతో స్థిర పడ్డాయి. వాల్ స్ట్రీట్ గురువారం నష్టాలతో ముగిసింది.
దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి గురువారం వరకూ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 2,377.32 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. మరోవైపు దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,617.80 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.32 శాతం వృద్ధి చెంది 70.38 డాలర్లు పలికింది.



# నేను.. చాలా కాస్లీ గురూ..

## మార్కెట్లోకి బీఎండబ్ల్యూ రూ. 11 లక్షల స్కూటర్

లగ్జరీ కార్లు తయారు చేసే బీఎండబ్ల్యూ అనుబంధ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బీఎండబ్ల్యూ మోటారాడ్ ఇండియా దేశీయ విపణిలోకి కొత్త స్కూటర్ని తీసుకొచ్చింది. ఆధునికీకరించిన బీఎండబ్ల్యూ సీ400 జీటీ మోడల్ని విడుదల చేసింది. దీని ధరను రూ.11 లక్షలుగా (ఎక్స్- షోరూమ్) నిర్ణయించింది. భారత్లో విక్రయిస్తున్న అత్యంత ఖరీదైన స్కూటర్లతో ఇది ఒకటి. పాత మోడల్ పోలిస్తే కొత్త హంగులు జోడించి, సరికొత్త ఫీచర్లతో దీన్ని తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది.
2025 బీఎండబ్ల్యూ సీ400 జీటీ.. 350 సీసీ లిక్విడ్- కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 7,500 ఆర్‌పిఎం వద్ద 34హెచ్‌పి శక్తిని, 5,750ఆర్‌పిఎం వద్ద 35ఎన్ఎం పీక్ టార్కు ఉత్పత్తి చేస్తుంది. గరిష్ఠంగా గంటకు 129 కిలోమీటర్ల వేగంతో వెళుతుందని కంపెనీ పేర్కొంది. స్కూటర్ ముందు వైపు 4.5 లీటర్ల స్పేస్ ఇస్తున్నారు. ఇక సీటు కింద మరో 37.6 లీటర్ల ఖాళీ స్థలం ఉంటుంది. 10.25 అంగుళాల టీఎఫ్టీ డిస్ ప్లేతో వస్తోంది.
నావిగేషన్, మీడియా, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ సదుపాయాలు ఉన్నాయి. స్కూటర్ ఎడమవైపు ఉన్న కంపార్ట్మెంట్లో ఛార్జింగ్ యూనిట్ ఉంటుంది. దీని సాయంతో మీ స్మార్ట్‌ఫోన్ను ఛార్జ్ చేయొచ్చు. ఇది యూఎస్బీ టైప్-సి, 12వి పోర్ట్స్ ఉన్నాయి. ఇక లీన్ సెన్సిటివ్ బ్రేకింగ్ అసిస్టెన్స్, డైనమిక్ బ్రేక్ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఏబీఎస్ ఫీచర్లు ఉన్నాయి. సీవీటీ ట్రాన్స్ మిషన్ ఆప్షన్తో వస్తోంది.




## 100 రైల్వే స్టేషన్లలో స్విగ్గీ సేవలు

ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్ఫామ్ స్విగ్గీ.. రైళ్లలో ఆహారాన్ని అందించే సదుపాయాన్ని మరిన్ని స్టేషన్లకు విస్తరించింది. ఐఆర్సీటీసీతో కలిసి ఇప్పటికే పలు చోట్ల ఈ సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ సంఖ్యను 20 రాష్ట్రాల పరిధిలోని 100 స్టేషన్లకు విస్తరించింది. రానున్న రోజుల్లో మరిన్ని చోట్ల ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని ఆ కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. "భారత సంస్కృతిలో రైల్వే ప్రయాణం అంతర్భాగం. ప్రయాణం సౌకర్యవంతం కావడంలో ఆహారం తప్పనిసరి. ఇందులో భాగంగానే ప్రయాణికులకు ఆహా రాన్ని అందించేందుకు 100 స్టేషన్లకు సేవలు విస్తరి ంచాం" అని స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలూ తెలిపారు. రైల్వే ప్రయాణికులకు ఆహార పదార్థాలను అందించేందుకు ఐఆర్సీటీసీతో 2024 మార్చిలో స్విగ్గీ ఒప్పందం కుదుర్చుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పాయింట్లలో ఫుడ్ డెలివరీ చేస్తోంది. మరో ఫుడ్ డెలివరీ ప్లాట్ఫామ్ జొమాటో కూడా ఇదే తరహా సేవలను రైల్వే స్టేషన్లలో అందిస్తోంది. ప్రస్తుతం ఈ రెండు ఫుడ్ డెలివరీ ప్లాట్ఫామ్లు కలిపి రోజుకు సుమారు లక్షకు పైగా ఆర్డర్లు డెలివరీ చేస్తున్నట్లు అంచనా.

# ఓపెన్‌ఏఐ నుంచి ఏఐ ఏజెంట్స్

- చాటీజీపీటీ మాతృసంస్థ ఓపెన్‌ఏఐ త్వరలో మరిన్ని ఏఐ ఏజెంట్లు



ఏజెంట్లను తీసుకురానుంది. ఏఐ ఏజెం ట్ సేవల్ని ఇప్పటికే పరిచయం చేసిన సంస్థ..
ఈసారి కొత్తతరహా ఏఐ ఏజెంట్ల ను తీసుకొస్తోంది. అయితే ఇప్పటికే అందిస్తున్న సబ్స్క్రిప్షన్ ప్లాన్ల మాదిరిగా కాకుండా.. కంపెనీల కోసం వీటిని ప్రత్యేక ధరలో తీసుకురావాలని చూస్తోందని సమాచారం. నిర్దిష్టమై న విభాగంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఈ ఏజెంట్లను వినియోగించాలంటే ధర కాస్త ఎక్కువ వెచ్చించాల్సి ఉంటుందని నివేదికలు పేర్కొంటున్నాయి.
ఓపెన్ ఏఐ సంస్థ మూడు రకాల ఏఐ ఏజెంట్లను తీసుకురావాలని భావిస్తోంది. ఇందులో ఒక ఏఐ ఏజెంట్ సంస్థలో కీలక వ్యక్తిగా వ్యవహరిస్తుంది. సంబంధిత అంశంపై లోతైన జ్ఞానం కలిగిఉంటుంది. విమర్శనాత్మక ఆలోచన, వ్యూహాత్మక ప్రణాళిక, సొంతంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం దీని సొంతం. ఈ ఏజెంట్ ధర నెలకు రూ.1.74 లక్షలుగా ఉంటుందని తెలుస్తోంది. సాఫ్ట్వేర్ డెవలపర్‌గా పనిచేసే మరో రకం ఏఐ ఏజెంట్ ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నట్లు సమాచారం. దీని ధర నెలకు రూ.8.7 లక్షలుగా ఉండనుంది. కోడింగ్, డీబగ్గిం గ్, బగ్ ఫిక్సింగ్, కోడ్ డెవలప్మెంట్ వంటి విధులను ఈ ఏజెంట్ నిర్వర్తిస్తుంది.
అయితే ఇదే సామర్థ్యంతో అమెరికాకు చెందిన టెక్ కంపెనీ కాగ్నిషన్కు చెందిన కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన సాఫ్ట్వేర్ ఇంజినీర్ 'డెవిన్' సబ్స్క్రిప్షన్ ధర రూ.45,500 కంటే చాలా ఎక్కువ.
ఇక మూడో రకం ఏఐ ఏజెంట్ పీహెచ్ స్థాయి పరిశోధన చేసే సామర్థ్యంతో వస్తోంది. దీని ధర నెలకు 20 వేల డాలర్లు. అంటే మన దేశ కరెన్సీ ప్రకారం అక్షరాలా రూ.17 లక్షలుగా ఉండనుందని సమాచారం. మరోవైపు గూగుల్ తన జెమినీ డీప్ రీసెర్చ్ ఫీచర్ని అందిస్తోంది. ఒక అంశాన్ని పరిశీలించి సమగ్రంగా నివేదికలు రూపొందిస్తుంది. నెలకు రూ.1950 చెల్లించి జెమిని అడ్వాన్స్ ప్లాన్ను వాడుతున్నవారికి ఈ సదుపాయం లభిస్తుంది. దీంతో పోలిస్తే ఓపెన్‌ఏఐ ఏజెంట్ ధర చాలా ఎక్కువ. అయితే ఎప్పటిలోగా ఈ ఏఐ ఏజెంట్లు అందుబాటులోకి రానున్నాయనే విషయంపై మాత్రం స్పష్టత లేదు.

## నెలలో 10 రోజులు ఆఫీసుకు రావాల్సిందే!

**దిల్లీ:** కార్యాలయాల నుంచి మరింత మంది ఉద్యోగులు పనిచేసేలా చూసేందుకు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ చర్యలు తీసుకుంటోంది. నెలలో కనీసం 10 రోజుల పాటు ఉద్యోగులు తప్పనిసరిగా ఆఫీసు నుంచే పనిచేసే విధంగా చూడాలని టెక్నాలజీ టీమ్ను ఇన్ఫోసిస్ తాజాగా ఆదేశించింది. ఈ నెల 10 నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం ఇన్ఫోసిస్ ఉద్యోగులు మొబైల్ యాప్ ద్వారా తమ హాజరు వివరాలను నమోదు చేస్తున్నారు. ఇకపై వర్క్ ఫ్రమ్ హోమ్ అభ్యర్థనలను నేరుగా యాప్ లో ఆమోదించరు. ప్రతి ఉద్యోగి నెలలో కనీసం 10 రోజులు కార్యాలయాలకు వచ్చే విధంగా మార్పులు చేపట్టనున్నారు. ఉద్యోగులకు కొత్త హైబ్రిడ్ పని పద్ధతులతో ఈ వ్యవస్థను అమలు చేస్తారు. ఒకవేళ నెలలో కార్యాలయానికి రావాల్సిన రోజుల్లో ఒకటి లేదా రెండు రోజులు తగ్గితే.. వాటిని ఉద్యోగి సెలవుల నుంచి మినహాయిస్తారు. దీనిపై ఇన్ఫోసిస్ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు.

# సంపాదనలో సగం మద్యానికే ఖర్చు

- ఖజానాను ముంచుతున్న సబ్సిడీలు
- నగదు బదిలీ పథకాలతో దుబారా



**విజయవాడ, మార్చి 7 (జనంసాక్షి) :** కూలీనాలీ చేసుకునే పేదలు తమ డబ్బులో ముప్పావు వంతు మద్యానికే తగలేస్తున్నారు. మద్యం ధరలు పెరిగినా అమ్మకాలు తగ్గడం లేదు. కిలో రూపాయి బియ్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. సబ్సిడీ పథకాలకు ప్రజలను అలవాటు చేసి వారిని నిర్వీర్యులుగా చేయడం లో ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి. నగదు బదిలీ పథకాలు ఇబ్బడిముబ్బడిగా సాగుతున్నాయి. తమ సొంత ఖజానా నుంచి ఇస్తున్నట్లుగా ప్రస్తుతం గ్రామాల్లో కూలీలు దొరకడం కష్టంగా మారింది. వ్యవసాయ కూలీల సంగతి చెప్పనక్కర్లేదు. జీఎస్టీతో ఆదాయం పెరిగిందని చంకలు గుద్దుకుంటున్న కేంద్రం దుబారా ఖర్చులు మాత్రం తగ్గించుకోవడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల పన్నులు కట్టలేక మధ్యతరగతి ప్రజల నడ్డి విరుగుతోంది. పన్నులు కట్టే ప్రజలకు జవాబుదారీ లేకుండాపోతోంది. ధరల విషయంలో పల్లెలకు పట్టణాలకు తేడా లేకుండా పోయింది. కూలీనాలీ చేసుకునే వారు కిక్కులేనిదే ఉండడం లేదు. దీంతో సంపాదించిన దాంట్లో అధిక భాగం తాగడానికే తగలేస్తున్నారు. ఉపాధిహామీ కింద నిర్మాణాత్మక పనులు చేయించాలన్న డిమాండ్‌పై కేంద్రం నిర్ణయాలు తీసుకోవడం లేదు. వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న వినతులను పక్కన పెట్టింది. ఉపాధి హామీకింద ఏటా వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నా పనికి వచ్చే పనులు జరగడం లేదు. దీనిని సమీక్షించాలన్న కనీస పరిజ్ఞానం కూడా ప్రభుత్వానికి కలగడం లేదు. దీంతో గ్రామాల్లో వ్యవసాయ కూలీలు కరువయ్యారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశంలో కూలీలు ఎందుకు దొరకడం లేదన్న ఆలోచన చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా రూపాయికే కిలో బియ్యం పథకాన్ని కొనసాగించడం సరికాదు. దీనిని తొలగించడం వల్ల వేలకోట్ల రూపాయల వృధాను అడ్డుకోవచ్చు. అయినా సమీక్షించడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సాహసిం చడం లేదు. రూపాయికి చాయ్ కూడా రాని రోజుల్లో ఇంకా ఈ పథకం కోసం వేలకోట్లు ప్రజల దనాన్ని దుబారా చేస్తున్నారు. ఈ బియ్యం పథకం ప్రభుత్వాలకు గుదిబండగా మారినా గంట కట్టేదెవరన్నది సాహసించడం లేదు. ఓట్లతో ముడిపడి ఉన్న ఈ పథకాన్ని తొలగించాల్సిందే. తెలుగు రాష్ట్రాల ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతున్న కిలో రూపాయి బియ్యాన్ని తక్షణం తొలగించడం ద్వారా ప్రజల సొమ్ముకు రక్షణగా నిలవాలి. ఆర్థిక మాంద్యంతో అతలా కుతలం అవుతున్న ప్రస్తుత తరుణంలో ఈ పథకంపై సమీక్షించి అక్రమాలను అరికట్టాలి. కొందరికి ఈ పథకం వరంగా మారింది. బియ్యాన్ని హోటళ్లకు అమ్ముకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. మరోవైపు కిలో రూపాయికే ఇస్తున్న చౌక బియ్యం అక్రమంగా రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్నాయి. ఇప్పటికే గ్యాస్ సబ్సిడీ తొలగించి నగదు బదిలీ చేపట్టింది కేంద్రం. దీంతో గ్యాస్ సబ్సిడీలో కొంతయినా అక్రమాలను అరికట్టగలిగారు. బియ్యం పథకం కోసం సబ్సిడీ రూపంలో వేలకోట్లతో పాటు పెద్ద యంత్రాంగం పనిచేయాల్సి వస్తోంది. ఇలాంటి దుబారాను అరికట్టి నిజమైన పేదలకు లబ్ది చేకూర్చేలా కార్యాచరణ చేయాలి. బియ్యం పథకాన్ని ఎత్తేసే ఆలోచన చేస్తే మంచిది. రూపాయికి విలువ లేని సమయంలో కిలో బియ్యాన్ని అందచేసి అక్రమాలకు తావీయకుండా దీనిని ఎప్పుడో తొలగించాల్సింది. రైతు బజార్లను పటిష్టం చేసి అక్కడే అన్ని సరకులను తక్కువ ధరలకు అమ్మితే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసినవారం అవుతాం. అంతేగాని రూపాయికే బియ్యం ఇచ్చి వృధాను ప్రోత్సహించడం ప్రభుత్వాలకు మంచిది కాదు. ఉమ్మడి ఎపిలో సబ్సిడీ బియ్యం ధరను పెంచినందుకు అప్పట్లో సిఎంగా ఉన్న చంద్రబాబుపై విమర్శలు చేశారు. ఆరోజుల్లోనే ఆయన దీనిని ఐదు రూపాయలకు పెంచారు. కానీ ఇప్పుడు రూపాయికే బియ్యం కావడంతో అక్రమ వ్యాపారానికి తెరతీసారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలకు బియ్యం సేకరణ తలకు మించిన భారంగా మారింది. జాతీయ భద్రత చట్టం కింద కొంత కేంద్రం సబ్సిడీ బియ్యాన్ని అందిస్తోంది. మిగిలిన లక్షల కార్డులకు పంపిణీ చేస్తున్న బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ భరించాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం పడుతోంది. ఇదంతా ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న సొమ్ము అని పాలకులు గుర్తించాలి. దీనిపై తోణం సమీక్షించి ధరలను పెంచడంతో పాటు, అక్రమాలను అరికట్టాలి. బయోమెట్రిక్ తీసుకుని వచ్చినా బియ్యాన్ని అమ్ముకుంటూనే ఉన్నారు.

## మహిళలకు సానుభూతి కాదు..సాధికారత అవసరం

### కేసు విచారణ సందర్భంగా మహిళా జడ్జి వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** మహిళలకు సానుభూతి కాదని, సమాజంలో సాధికారత అవసరమని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళా జడ్జీలలో ఒకరైన జస్టిస్ ఎం.త్రివేది మౌఖికంగా వ్యాఖ్యానించారు. బాధితురాలి పట్ల అందరి సానుభూతి ఉందని లైంగిక వేధింపుల కేసు విచారణ సందర్భంగా నిందితుడి తరపున వాదిస్తున్న న్యాయవాది సమర్థిస్తుండగా.. జడ్జి ఖండించారు. 'మహిళలకు సానుభూతి అవసరంలేదు. చట్టాలను సమర్థవంతంగా, కఠినంగా అమలు చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించాలని జస్టిస్ త్రివేది పేర్కొన్నారు.
ఈ వ్యాఖ్యలపై సీనియర్ న్యాయవాది స్పందిస్తూ.. ఇళ్లలో మహిళలకు అధికారం ఇవ్వాలి. అది జరుగుతోందని అన్నారు. ఈ వ్యాఖ్యలను జడ్జి మరోసారి ఖండించారు. కేవలం ఇళ్లలో ఉన్న మహిళల గురించి మాత్రమే కాదని అన్నారు. సమాజంలో ప్రతి చోటా ఉన్న మహిళలందరికీ సాధికారత అవసరమని జడ్జి స్పష్టం చేశారు. జడ్జి వ్యాఖ్యలతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ.. 'అవును .. ప్రతి చోటా' అని జోడించారు. నిందితుడు ఏడు నెలలుగా జైలులో ఉన్నాడని న్యాయవాది వాదించారు. బాధితురాలి మెడపై చిన్న గాయం మాత్ర మే ఉందని, హత్యాయత్నం కేసు కాదు. దీంతో శిక్షను పున:పరిశీలించాల్సి వుందని న్యాయవాది వాదించారు. బాధితురాలి మెడపై ఉన్న గుర్తు సాధారణ గాయం కాదని, నైలాన్ తాడుతో గొంతు కోసి హత్య చేసేందుకు యత్నించారని జడ్జి పేర్కొన్నారు.

## విశాఖ కోరమాండల్లో కొత్త సల్ఫర్ తయారీ ప్లాంట్ ప్రారంభం

విశాఖలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీలో 25 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కొత్త సల్ఫర్ ఎరువుల తయారీ ప్లాంట్ను ఆ కంపెనీ ఎండీ శంకర సుబ్రమణియన్ గురువారం ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ యూనిట్లో ఫాస్ఫరిక్, సల్ఫ్యూరిక్ ఆమ్లాలతో పాటు 12 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 25 వేల టన్నుల సల్ఫర్ ఉత్పత్తి జరుగుతోంది. తాజాగా బెంటోనైట్ సల్ఫర్ కొత్త ప్లాంట్ను అందుబాటులోకి తీసుకురావడంతో ఈ ఎరువుల ఉత్పత్తి 50 వేల మెట్రిక్ టన్నులకు పెరగనుందని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో సుబ్రమణియన్ మాట్లాడుతూ.. జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త ప్లాంట్ను నిర్మించామన్నారు. కొత్తగా తీసుకువచ్చిన బెంటోనైట్ సల్ఫర్ భారతీయ నేలలో పోషక లోపాలను పరిష్కరిస్తుందన్నారు. 2023-24 ఏడాదిలో కంపెనీ రూ.22,290 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. పర్యావరణ పరంగా దేశంలోని పది హరిత కంపెనీల్లో కోరమాండల్ ఒకటిగా యూఎన్డీపీ గుర్తించిందన్నారు. కార్యక్రమంలో బిజినెస్ హెడ్ అవినాష్ ఠాకూర్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

- జనసేన తరపున నాగబాబు నామినేషన్
- నాగబాబు అభ్యర్థిత్వాన్ని సమర్థించిన లోకేశ్



**అమరావతి,మార్చి7(ఆర్ఎన్ఎ):** ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన ప్రధాన కార్యదర్శి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు నామినేషన్ దాఖలు చేశారు. నాగబాబు అభ్యర్థిత్వాన్ని మంత్రి నారా లోకేశ్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బలపరిచారు. రిటర్నింగ్ అధికారిణి వనితా రాణికి నాగబాబు తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ సహా ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. నాగబాబు అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ జనసేన పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా ఈ బాధ్యతను తీసుకొన్నారు. ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, ఆరణి శ్రీనివాసులు, లోకం నాగ మాధవి, పంచకర్ల రమేష్ బాబు, పత్సమట్ల ధర్మరాజు, సుందరపు విజయ్ కుమార్, అరవ శ్రీధర్, పంతం నానాజీ, బత్తుల బలరామ కృష్ణలు సంతకాలు చేశారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా సంతకం చేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నిక నామినేషన్‌లకు మార్చి 10 చివరి గడువు. ప్రభుత్వ సెలవు రోజులు మినహాయించి.. మిగిలిన ఏ రోజైనా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ శాసనసభ భవనంలో నామినేషన్‌లను స్వీకరిస్తారు. మార్చి 11న ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన, మార్చి 13న మధ్యాహ్నం 3 గంటల్లోపు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.

# బిజెపిలో మహిళలకు సముచిత గౌరవం

### సిఎం పదవి అలా వచ్చిందేనన్న రేఖాగుప్తా



**న్యూఢిల్లీ,మార్చి7(ఆర్ఎన్ఎ):** బిజెపిలో మహిళలకు సముచిత గౌరవం ఉంటుందని, సిఎం పదవి తనకు అలా వచ్చిందేనన ఢిల్లీ సిఎం రేఖాగుప్తా అన్నారు. అందుకు తానెంతో గర్విస్తున్నానని అన్నారు. అనుభవం లేకపోయినా ఒకేసారి ఉన్నత పదవిని చేపట్టడం ఎలా ఉందని దిల్లీ సీఎం రేఖా గుప్తా కు ప్రశ్న ఎదురైంది. ఓ జాతీయమీడియా సంస్థతో మాట్లాడుతూ దానికి ఆమె తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. ఉర్దూ కవి రహత్ ఇందోరి రాసిన షాయరీని ప్రస్తావించారు. 'నేను కొమ్మల నుంచి రాలిపోయే ఆకును కాను.. ఎవరైనా ఆ తుపానుకు కాస్త చెప్పండి.. అదుపులో ఉండమని' అంటూ బదులిచ్చారు. 'ముఖ్యమంత్రిని కావడం నా కల కాదు. నా దారిలో నేను పని చేసుకుంటూ ముందు కెళ్లాను. ఈ పదవి లాటరీ కాదు. మన దేశంలో మహిళలపై ఉన్న గౌరవానికి ఇది చిహ్నం. మహిళలకు గుర్తింపు ఇవ్వాలనే సిద్ధాంతంతో సీఎంగా నన్ను నియమించినందుకు ప్రధాని మోదీ, పార్టీ నేతలకు కృతజ్ఞతలు. ఈ నిర్ణయం దేశ మహిళలకు మంచి సందేశాన్ని ఇస్తుంది' అని గుప్తా వెల్లడించారు. గత ప్రభుత్వాల పాలనలోని లోపాలను సరిదిద్దేందుకు, అవినీతిని పారదోలేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల విజయంతో రేఖా గుప్తా దిల్లీ సీఎంగా నియమితులయ్యారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆమెకు ఈ అవకాశం దక్కింది. సీఎంగా ఎన్నికైన వెంటనే ఆప్ విమర్శలు చేయడంతో ఆమె దీటుగా బదులిచ్చిన సంగతి తెలిసిందే. భాజపా ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చ లేదంటూ దిల్లీ మాజీ సీఎం ఆతిశీ చేసిన విమర్శలను రేఖా గుప్తా (ఖీ।÷ఖరజీ ఉబూబిజీ) తిప్పికొట్టారు. 'కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు దిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేశారో చూసుకోకుండా.. అధికారంలోకి వచ్చి ఒక్కరోజు కూడా కానీ మాపై విమర్శలు చేస్తారా..?' అని దీటుగా బదులిచ్చారు.

## జెలెన్స్కీకి పెరిగిన ప్రజామోదం

**కీవ్:** ఇటీవల వైట్ హౌస్ వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మధ్య వాగ్వాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఆ సమయంలో ట్రంప్ మాట్లాడుతూ ఉక్రెయిన్ జెలెన్ స్కీకి ప్రజల మద్దతు లేదని.. ఆయన ఓ నియంత అంటూ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పలు సంస్థలు ఉక్రెయిన్లో జెలెన్స్కీకి ఉన్న మద్దతుపై అభిప్రాయ సేకరణలు చేపట్టాయి. తాజాగా విడుదలైన నివేదికల్లో ట్రంప్తో వాగ్వాదం తర్వాత ఆయనకు ప్రజామోదం 10 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.
కీవ్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషియాలజీ నిర్వహించిన పోల్లో 67 శాతం ఉక్రెయిన్ ప్రజలు తాము జెలెన్స్కీని విశ్వసిస్తున్నామని తెలిపారు. తొలుత 57శాతంగా ఉన్న ఆయన మద్దతుదారులు అమెరికాలో ట్రంప్ తో భేటీ అనంతరం 10 శాతం పెరిగారని పేర్కొన్నారు. ట్రంప్ దురుసు ప్రవర్తనతో తమ అధినేతను అవమానించినట్లు ప్రజలు భావించారని.. అదే జెలెన్స్కీకి మద్దతు పెరగడానికి ముఖ్య కారణమని భావిస్తున్నారు.